www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
గుంటూరు సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 323
గురువారం | 29-1-2026 | పేజీలు: 14

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి మ.1:55 తదుపరి ద్వాదశి, నక్షత్రం: రోహిణి ఉ.7:32, మృగశిర తె.5:29, వర్జ్యం: మ.12:39-2:07, దుర్ముహూర్తం: ఉ.10:36-11:20, మ.3:05-3:50, అమృతఘడియలు: రా.9:26-10:53, రాహుకాలం: మ.1:30-3.00, సూర్యోదయం: 6:51, సూర్యాస్తమయం: 6:05

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


బొర్రా గుహల్లో ఉన్న మరో గుహ ముఖద్వారం

బొర్రా లోపల మరో అందమైన గుహ

కిలోమీటరుకు పైగా విస్తరించిన వైనం
టర్కీలోని టాప్‌డెక్, సయాహత్ కేవ్ రెస్టారెంట్లు మాదిరి అభివృద్ధికి అవకాశం!
మూడేళ్ల క్రితమే అధికారులను ఆదేశించిన పర్యాటక శాఖ నాటి ఎండీ కన్నబాబు
నేటి వరకూ స్పందించని స్థానిక యంత్రాంగం
ప్రభుత్వం దృష్టి సారించాలని స్థానికుల విజ్ఞప్తి

12

గద్దెపైకి సారలమ్మ

సంబరంగా జాతర తొలిఘట్టం
ఉదయం నుంచి సారలమ్మకు పూజలు
నేడే గద్దెపైకి సమ్మక్క తల్లి
పూర్తయిన ఏర్పాట్లు


మేడారంలో వెలిసిన గుడారాలు

12

అమెరికాతోనే గాజాలో శాంతి

ఆ దిశగానే కసరత్తు జరుగుతోంది



ఐరాసలో హమాస్ సంస్థలు చేరాయి.. అందుకే దానిని నమ్మటం లేదు
70 వేల పాలస్తీనీయులను చంపామన్నది అబద్ధం.. మాపై దుష్ప్రచారం
హమాస్‌ను నిర్మూలిస్తాం.. పాలస్తీనీయులకు గొప్ప భవిష్యత్తు కోరుకుంటున్నాం
మా దేశంలో భారత కంపెనీలకు భారీ అవకాశాలు.. ఏపీ, తెలంగాణలో అభివృద్ధికి చేయూతనిస్తాం
'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్

10

కల్తీ.. కెమికల్ నెయ్యి

తిరుమల 'నెయ్యి' కేడీల గుట్టును విప్పిన సీబీఐ సిట్ చార్జిషీట్!

10కిపైగా రాష్ట్రాల పరిధిలో తనిఖీలు
ఐదు రాష్ట్రాల్లో నెట్‌వర్క్ గుర్తింపు
చుక్క పాలు లేకుండా నెయ్యి తయారీ
'భోలేబాబా' డెయిరీ కేంద్రంగా దందా
సహకార డెయిరీలను తప్పించడానికి టెండరు నిబంధనల్లో సవరణలు
సరఫరాదారులు, మధ్యవర్తులు, అధికారుల ప్రమేయం నిర్ధారణ
చార్జిషీట్‌లో సంచలన నిజాలు!



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'కల్తీ నెయ్యి' కేసులో ఏడాదిపాటు దర్యాప్తు జరిపిన సీబీఐ సిట్ సంచలన సంగతులు వెలికి తీసింది. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యి సరఫరాలో బడా కుట్ర జరిగినట్టు తేల్చింది. టెండర్ల నిబంధనల మార్పు నుంచి నెయ్యి సరఫరా వరకూ ఎక్కడెక్కడ, ఎవరెవరు, ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డారనేది పసిగట్టింది. 36 మంది నిందితులు, డజన్ల కొద్దీ డెయిరీ సంస్థలు, ప్రభుత్వ అధికారులు, లాజిస్టిక్ ఆపరేటర్లు, హవాలా మధ్యవర్తుల నెట్‌వర్క్ గొలుసును పదికి పైగా రాష్ట్రాల పరిధిలో వెలికి తీసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ, రాష్ట్ర పోలీసు అధికారులతో ఏర్పడిన 'సిట్' తన దర్యాప్తులో తేల్చిన అంశాలపై తుది చార్జిషీట్‌ను ఈనెల 23న నెల్లూరు ఏసీబీ కోర్టులో సమర్పించిన సంగతి తెలిసిందే. నిజమైన ఆవు నెయ్యి కిలో రూ.319.80కు సరఫరా చేయడం సాధ్యం కాదని.. యూపీలోని భోలే బాబా డెయిరీ, దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ కూడా తిరుమలకు నాణ్యత లేని, కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు చార్జిషీట్‌లో తెలిపినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం చార్జిషీట్‌లో ఏమున్నదంటే.. టీటీడీ బోర్డు సిఫారసుల మేరకు 2020 జనవరిలో ప్రొఫెషనల్ కమిటీ ఏర్పాటు చేసి టెండర్ నిబంధనలను సడలించారు. రోజుకు 4లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యం ఉండాలనే నిబంధన తొలగించారు. డెయిరీ నిర్వహణ అనుభవం మూడేళ్ల నుంచి

మిగతా 14వ పేజీలో...

తప్పు చేసి బుకాయింపు!

వైసీపీ నేరప్రవృత్తి ఇదే: చంద్రబాబు

వాళ్లు తప్పుచేసి మన మీదకు నెట్టేస్తారు
లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు లేదని సిట్ పేర్కొన్నట్లు వైసీపీ దుష్ప్రచారం
ఆ నివేదిక బయటికి వచ్చాక ప్రజలకు వాస్తవాలు వివరించాలి
విషయ పరిజ్ఞానంతో మాట్లాడాలి
విమర్శించాలని విమర్శిస్తే లాభం లేదు
సరైన సమాచారంతో చేసే విమర్శకే విలువ
క్యాబినెట్ భేటీలో సీఎం దిశానిర్దేశం
అర్హత లేని డెయిరీలకు నెయ్యి కాంట్రాక్టులిచ్చారు
అవి రసాయనాల మిశ్రమం సరఫరా చేశాయని సిట్ చెప్పినట్టు తెలిసింది!
సుబ్బారెడ్డి పీఏ ఖాతాలో రూ.4.5 కోట్లు జమ
అయినా కప్పిపుచ్చే యత్నాలు: మంత్రులు

13

కుప్పకూలిన విమానం


బారామతి ఎయిర్‌పోర్టు సమీపంలో అగ్నికీలల్లో విమానం అవశేషాలు

అజిత్ పవార్ దుర్మరణం

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం విషాదాంతం



ఇద్దరు పైలట్లతోపాటు, సహాయకుడు, వ్యక్తిగత భద్రతాధికారి కూడా..
ముంబై నుంచి బారామతికి వెళ్తుండగా దుర్ఘటన
బుధవారం ఉదయం 8.45 గంటలకు ప్రమాదం
పొగమంచు కారణంగా రన్ వే కనబడక ఇబ్బంది
బారామతి విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు ముందు రన్‌వే మొదట్లో కూలిన విమానం
చిన్న ఎయిర్‌ఫీల్డ్ కావడంతో అందుబాటులో లేని 'ఇన్‌స్ట్రుమెంటల్ ల్యాండింగ్ సిస్టమ్'
స్థానిక పైలట్లతోనే ఎయిర్ ట్రాఫిక్ పర్యవేక్షణ
రాష్ట్రపతి, ప్రధాని, ఇతర ప్రముఖుల దిగ్భ్రాంతి
నేడు బారామతిలో అంత్యక్రియలు

పుణె, జనవరి 28: ప్రైవేటు జెట్ విమానం కూలిపోవడంతో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం పాలయ్యారు. విమానం పైలట్లు సహా మరో నలుగురు కూడా ఈ ఘటనలో మృతిచెందారు. మహారాష్ట్రలోని పుణె సమీపంలోని బారామతిలో బుధవారం ఉదయం ఈ దుర్ఘటన జరిగింది. మరణించిన వారిలో అజిత్‌తోపాటు విమానం ప్రధాన పైలట్ (పైలట్ ఇన్ కమాండ్) సుమిత్ కపూర్, రెండో

మిగతా 2వ పేజీలో...



13

రాష్ట్రంలో రాక్షస పాలన!

జంగిల్ రాజ్‌కు బాబు, లోకేశ్ ప్రోత్సాహం
పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారు
మహిళలపై ఎమ్మెల్యేల లైంగిక వేధింపులు
150 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తా
వచ్చేది వైసీపీ ప్రభుత్వమే
జగన్ 2.0 ఎలా ఉంటుందో చూస్తారు
భీమవరం నేతల భేటీలో వైసీపీ అధినేత

ఎట్టకేలకు గ్రూప్-2 ఫలితాలు విడుదల

ఉద్యోగాలకు 891 మంది ఎంపిక
రెండు పోస్టులు రిజర్వ్.. మిగిలినవి 12
కొన్ని కేటగిరీల్లో అర్హులైన అభ్యర్థుల కొరత
టీచర్‌కు గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం
'ఆంధ్రజ్యోతి' కథనంతో ఆగమేఘాలపై కదలిక
ముఖ్యమంత్రి కార్యాలయ అధికారుల ఆరా
వెంటనే విడుదల ప్రక్రియ ప్రారంభం

అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి 12 గంటల సమయంలో కమిషన్ సభ్యులతో సంతకాలు.. తెల్లవారుజాము 2.47 గంటలకు ప్రక్రియ పూర్తి.. 3 గంటలకు అధికారికంగా ఫలితాల విడుదల. గ్రూప్-2 తుది ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసిన తీరిది. 2023 డిసెంబరులో విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్ రెండేళ్లు దాటిన తర్వాత ఇప్పటికి పూర్తయ్యింది. 'ఆంధ్రజ్యోతి' కథనంతో

మిగతా 12వ పేజీలో...

పేదలందరికీ ఇళ్లు

2029 నాటికి 7.50 లక్షల మందికి అందజేత


మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేశ్, కొల్లు, అచ్చెన్న, సీఎస్ విజయానంద్

మరో 2.50 లక్షల మందికి స్థలాల కేటాయింపు
జూన్ నాటికి లబ్ధిదారులకు 2.61 లక్షల ఇళ్లు
హడ్కో నుంచి ఏపీ టిడ్కోకు రూ.4,451 కోట్ల రుణ గ్యారంటీకి ఆమోదం
అమరావతిలో వీధి పోటున్న 112 ప్లాట్లు రద్దు
లాటరీ ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు
రాజధానిలో అనాథ పిల్లలకు పింఛన్ల మంజూరు
టీటీడీలో పలు పోస్టుల అప్‌గ్రేడేషన్‌కు అనుమతి
క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2029 నాటికి అర్హులైన నిరుపేదలందరికీ శాశ్వత గృహాలు, ఇళ్ల స్థలాలు సమకూర్చాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న 2.61 లక్షల ఇళ్లను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేసి, లబ్ధిదారులకు అప్పగించనున్నట్లు వెల్లడించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదించిన వివిధ అంశాలను మంత్రి మీడియాకు వివరించారు. "రాష్ట్రంలో ఇళ్లు, స్థలాల కోసం దాదాపు 10లక్షల మంది

మిగతా 13వ పేజీలో...

14న రాష్ట్ర బడ్జెట్!

11 నుంచి మార్చి 12 వరకూ అసెంబ్లీ సమావేశాలు


ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అండగా నిలవండి

కేంద్ర బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇవ్వండి

ఉప్పాడ తీర రక్షణ గోడకు సహకరించండి.. అమిత్ షాకు పవన్ వినతి
పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా అభివృద్ధి చేయాలని అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి
పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపైనా చర్చ.. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రులు
ఢిల్లీ పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశాలు

న్యూఢిల్లీ/అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. బుధవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అండగా నిలవాలని అమిత్ షాను పవన్ కోరారు. కేంద్ర బడ్జెట్‌లో ఈ మేరకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అమిత్ షాను ఆయన అధికారిక నివాసంలో కలిసి.. రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ

మిగతా 13వ పేజీలో...

రాష్ట్రానికి సంజీవని!

ప్రజలందరికీ వైద్య పరీక్షలు
72.73 లక్షల మందికి హెల్త్ స్క్రీనింగ్: సీఎం

ప్రజారోగ్యం డేటా ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉండాలి
హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయాలి
ఆస్పత్రుల నిర్మాణం, నిర్వహణకు ముందుకొస్తే రాయితీలు
నియోజకవర్గానికో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
ఎంపీహెచ్‌ఏలను విధుల్లోకి తీసుకునేందుకు ఆమోదం



3

జీ రామ్ జీ అమల్లో రాజీ లేదు!

పక్కా ప్రణాళికలతో సిద్ధమైన సర్కారు
బడ్జెట్‌లో రూ. 9 వేలకోట్ల ప్రతిపాదన!
కొత్త స్కీమ్ సద్వినియోగానికి కార్యాచరణ
గ్రామాలకు మరింత అనువుగా మార్చే యోచన
రాష్ట్రాలకు కొత్త పథకం కొంత భారమే..
అయినా, సమర్థంగా వాడుకుంటే మంచి ఫలితాలే వస్తాయన్న ధీమాలో సర్కారు

14




12

హైకోర్టు న్యాయమూర్తిగా మెడమల్లి బాలాజీ!

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

అజిత్ పవార్ దుర్మరణం




విమాన ప్రమాదంలో మరణించిన అజిత్ పవార్ వ్యక్తిగత భద్రతాధికారి విదీప్ జాధవ్, విమాన సిబ్బంది పింకీ మాలి

సీఎం కావాలన్న కల నెరవేరకుండానే...!

» ఆరుసార్లు డిప్యూటీ సీఎం, 8 సార్లు ఎమ్మెల్యేగా ఉన్న అజిత్ పవార్

ముంబై, జనవరి 28: ఏ రోజుకైనా మహారాష్ట్రకు సీఎం కావాలనుకున్న డిప్యూటీ సీఎం అజిత్ పవార్(66), చివరకు తన కల నెరవేరకుండానే విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. తన రాజకీయ జీవితంలో ఆరుసార్లు డిప్యూటీ సీఎం అయ్యారు. తనకు ఢిల్లీ రాజకీయాలకన్నా మహారాష్ట్ర సామ్రాజ్యమే ఇష్టమని, ఏదో ఒకరోజు సీఎం అవుతానని మీడియా ప్రతినిధులతో తరచూ చెబుతూ ఉండేవారాయన. అయితే తన కల నెరవేరకముందే ప్రాణాలు కోల్పోయారు. మరాఠా యోధుడు శరద్ పవార్‌కు అన్న (అనంత్ పవార్) కుమారుడైన అజిత్ పవార్ అహల్యానగర్ దేవ్‌లాలీలో 1959 జులై 22న జన్మించారు. బారామతి కేంద్రంగా 1982లో 23 ఏళ్ల వయసులో చక్కర సహకార బోర్డు సభ్యుడిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. పాల సంఘాలు, చక్కర ఫ్యాక్టరీలు, సహకార బ్యాంకుల నిర్వహణతో 1991లో పూణె జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా ఎదిగారు. 1991లో బారామతి లోక్‌సభ నియోజకవర్గం నుంచి నెగ్గాక శరద్ పవార్ కోసం సీటు త్యాగం చేశారు. నాడు ఇదే నియోజకవర్గం నుంచి మళ్లీ గెలుపొందిన శరద్ పవార్ నాటి పీవీ ప్రభుత్వంలో రక్షణ మంత్రి అయ్యారు. ఆ తర్వాత అజిత్ పవార్ 1991 నుంచి ఇప్పటివరకు బారామతి నుంచి 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

మరాఠా నాటకీయ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్

మహారాష్ట్ర నాటకీయ పరిణామాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అజిత్ పవార్ ఆరుసార్లు డిప్యూటీ సీఎం అయ్యారు. తొలినుంచీ శరద్ పవార్ వెంటే ఉన్న ఆయన తరచూ ధిక్కార స్వరం వినిపించేవారు. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి 1999లో ఎన్సీపీ ప్రారంభించిన బాబాయ్ వెంటే చాలా కాలం నడిచినా తిరుగుబాటుకు వెనుకాడలేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత చిన్నాన్నతో విభేదించి ఫడణవీస్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా కేవలం 80గంటలు మాత్రమే ఉన్నారు. తిరిగి బాబాయ్ గూటికి చేరారు. మహావికాస్ అఘాడీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం అయ్యారు. 2022లో తిరుగుబాటు లేవదీసి ఎన్సీపీని రెండుగా చీల్చి మహాయుతి కూటమి మిత్రపక్షంగా మారి డిప్యూటీ సీఎం పదవి దక్కించుకున్నారు. 2024లోనూ డిప్యూటీ సీఎం అయ్యారు. మరోవైపు అజిత్ పవార్ ఎంత చక్రం తిప్పినా ఎప్పటికీ మహారాష్ట్ర సీఎం కాలేరని శరద్ పవార్ తరచూ చెప్పిన జోస్యాన్ని నిజం చేస్తూ.. దురదృష్టవశాత్తూ ఆయన కనుమరుగయ్యారు.

‘మీ విశ్వసనీయ ప్రభుత్వం...’

» అజిత్ పవార్ చివరి ‘ఎక్స్’ పోస్టు!

న్యూఢిల్లీ, జనవరి 28: విమాన ప్రమాదంలో మరణించడానికి ముందుగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ పెట్టిన చివరి ‘ఎక్స్’ పోస్టు వైరల్ అవుతోంది. ‘మీ విశ్వసనీయ ప్రభుత్వం..’ అంటూ ఇటీవలి మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను ఆ పోస్టులో ప్రజలతో ఆయన పంచుకున్నారు. కాంట్రాక్టర్ల పనికి జరిపే చెల్లింపుల విధానంలో మార్పులు; వొకేషనల్ శిక్షణా కేంద్రాల ఏర్పాటు; పలు విభాగాలు, ప్రైవేటు సంస్థలకు కేటాయించిన భూముల లీజు గడువు పెంపు వంటి కేబినెట్ నిర్ణయాలను ఆయన పేర్కొన్నారు. పైకి ఇదంతా సాధారణ వ్యవహారంలాగే కనిపిస్తోంది. కానీ, ప్రభుత్వంలో సీనియర్ మంత్రి హోదాలో ఉన్న అజిత్ పవార్, అలాంటి సాధారణ పోస్టు పెట్టడం ఏమిటనే చర్చ సర్వత్రా మొదలైంది. ముంబై, పుణె సహా 29 నగరాలకు మునిసిపల్ ఎన్నికల సందర్భంగా అధికార మహాయుతి కూటమిలో విభేదాలు చోటుచేసుకున్నట్టు వార్తలు వచ్చాయి. మహాయుతిలోని పార్టీలు ఎన్నికల ఫలితాలను ఏ మేరకు ప్రభావితం చేయగలవనేది బీజేపీ ఈసారి గట్టిగా పట్టించుకుంది. ఈ క్రమంలోనే సీట్ల సర్దుబాటులో ఎన్సీపీ (అజిత్ పవార్)ని పక్కన పెట్టేసింది. ఈ క్రమంలో ఆయన ప్రతిపక్ష ఎన్సీపీ వ్యవస్థాపకుడు, బాబాయి శరద్ పవార్‌ను కలిశారు. పింప్రి, పుణె పుర ఎన్నికల్లో కలిసి పోటీచేద్దామని కోరారు. శరద్‌తో కలిస్తే అజిత్ పవార్ పార్టీకి ఇక్కడ విజయం నల్లేరు మీద నడకే అవుతుందని జాతీయ మీడియా అంచనా వేసింది. కానీ బీజేపీయే గెలిచింది. తర్వాత పరిస్థితి కాస్త కుదుటపడింది. అజిత్ పవార్ తాజా పోస్టును బట్టి, ఆ గొడవలన్నీ సద్దుమణిగి కూటమిలో సాధారణ స్థితి నెలకొన్నట్టు ఆయన చెప్పదలుచుకున్నారని అనిపిస్తోందని అంటున్నారు.

వైఎస్సార్ నుంచి అజిత్ పవార్ వరకూ..!

» గగనతలంలో ప్రాణాలు కోల్పోయిన ఎందరో ప్రముఖులు

న్యూఢిల్లీ, జనవరి 28: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ సీనియర్ నాయకుడు అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. భారత్‌లో ఇప్పటి వరకూ జరిగిన విమాన ప్రమాదాల్లో ఎందరో ప్రజా నేతలు ప్రాణాలు కోల్పోయారు. తాజా దుర్ఘటన రాజకీయ ప్రముఖుల గగనతల ప్రయాణాల్లో భద్రతా వైఫల్యాలను మరోసారి ఎత్తిచూపింది. గత కొన్ని దశాబ్దాల్లో విమాన, హెలికాప్టర్ ప్రమాదాల్లో మరణించిన ప్రముఖ రాజకీయ నేతల వివరాలు ఇవీ...

దోర్జీ ఖండు (2011)

అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న దోర్జీ ఖండు 2011 ఏప్రిల్ 30న తవాంగ్ జిల్లా సమీపంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. హిమాలయ ప్రాంతంలో వాతావరణంలో అనిశ్చితి కారణంగా టేకాఫ్ తీసుకున్న కాసేపటికే హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయాయి. రోజుల తరబడి గాలింపు చర్యలు చేపట్టిన వైమానిక దళం, సైన్యం.. దట్టమైన అటవీ ప్రాంతంలో శిథిలాలను గుర్తించాయి.

వైఎస్ రాజశేఖరరెడ్డి (2009)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి 2009 సెప్టెంబరు 2న హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారు. రాజకీయ పర్యటన కోసం హైదరాబాద్ నుంచి చిత్తూరు జిల్లాకు వెళుతుండగా ఆయన ప్రయాణిస్తున్న బెల్ 430 హెలికాప్టర్.. ప్రతికూల వాతావరణం కారణంగా నల్లమల అటవీ ప్రాంతంలో కుప్పకూలిపోయింది.

ఓంప్రకాశ్ జిందాల్, సురేంద్ర సింగ్ (2005)

జిందాల్ గ్రూపు వ్యవస్థాపకుడు, హరియాణా మంత్రి ఓంప్రకాశ్ జిందాల్, వ్యవసాయ మంత్రి సురేంద్ర సింగ్ ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్ సమీపంలో 2005 మార్చి 3న జరిగిన కింగ్ కోబ్రా హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు.

జీఎంసీ బాలయోగి (2002)

అప్పటి లోక్‌సభ స్పీకర్, టీడీపీ నాయకుడు బాలయోగి 2002 మార్చి 3న జరిగిన బెల్ 206 హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. వాతావరణం అనుకూలించక ఆ హెలికాప్టర్ కృష్ణా జిల్లాలో కూలిపోయింది.

మాధవరావు సింధియా (2001)

కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మంత్రి మాధవరావు సింధియా 2001 సెప్టెంబరు 30న ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి సమీపంలో జరిగిన బీచ్ క్రాఫ్ట్ సీ90 విమాన ప్రమాదంలో చనిపోయారు. ఢిల్లీ నుంచి కాన్పూర్ వెళ్తున్న విమానం వాతావరణం ప్రతికూలంగా మారడంతో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది.

(మొదటిపేజీ తరువాయి)

పైలట్ (ఫస్ట్ ఆఫీసర్) శాంభవి పాఠక్, సిబ్బంది పింకీ మాలి, పవార్ వ్యక్తిగత భద్రతాధికారి విదీప్ జాధవ్ ఉన్నారు.



కూలిపోయిన తర్వాత విమానం శకలాలు

ఎన్నికల ప్రచారం కోసం బయలుదేరి..

మహారాష్ట్రలో జిల్లా పరిషత్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ప్రచారం కోసం అజిత్ పవార్ బుధవారం ఉదయం 8.10 గంటలకు ముంబై నుంచి ఢిల్లీ వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థకు చెందిన లియర్ జెట్-45 అద్దె విమానంలో పుణె జిల్లాలోని బారామతికి బయల్దేరారు. ఈ రెండింటి మధ్య దూరం 256 కిలోమీటర్లు, ప్రయాణ సమయం సుమారు 45 నిమిషాలు. విమానం 8.39 గంటల సమయంలో బారామతి సమీపానికి చేరుకుంది. కానీ ల్యాండ్ అవకుండా ముందుకెళ్లింది. కాసేపటికి తిరిగి వచ్చి ల్యాండ్ కావడానికి ప్రయత్నిస్తూ.. రన్ వేకు కాస్త ముందే కూలిపోయింది. నేలపై రెండు ముక్కలుగా విడిపోయి, మంటల్లో చిక్కుకుంది. వరుసగా నాలుగైదు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని, విమానంలోని వారిని బయటికి తీసేందుకు ప్రయత్నించారు. కానీ మంటలు తీవ్రంగా ఉండటంతో వీలుకాలేదని తెలిపారు. అజిత్ పవార్ భార్య సునేత్ర రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. వారికి పార్థ్, జయ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం ఉదయం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అజిత్‌పవార్ అంత్యక్రియలు జరగనున్నాయి. అజిత్ దుర్మరణం నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు సంతాప దినాలుగా ప్రకటించింది. ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఇతర ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై విమాన ప్రమాదాల దర్యాప్తు సంస్థ (ఏఏఐబీ) దర్యాప్తు చేపట్టింది. ప్రమాద స్థలంలో ఆధారాలను సేకరించింది.



పొగ మంచు కారణంగానే ప్రమాదం

దట్టంగా కమ్ముకున్న పొగ మంచు కారణంగానే అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం కూలిపోయినట్టు పౌర విమానయాన శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. పైలట్లు ల్యాండింగ్ కోసం పలుమార్లు ప్రయత్నించి, చివరికి రన్‌వేకు సమీపంలోనే కూలిపోయినట్టు తేల్చింది. విమానాల నిర్వహణ సంస్థ తరఫున గానీ, విమానంలోగానీ భద్రతాపరమైన లోపాలేమీ లేవని పేర్కొంది. దీనిపై తొలుత పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పలు వివరాలను వెల్లడించారు. అనంతరం పూర్తి వివరాలతో ఆ శాఖ ప్రకటన విడుదల చేసింది. ముంబై నుంచి బయలుదేరిన ఈ విమానం పైలట్లు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉండగానే బారామతి విమానాశ్రయం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)ని సంప్రదించారు. వాతావరణ పరిస్థితి, విజిబులిటీ ఆధారంగా ల్యాండింగ్‌కు ప్రయత్నించాలని పైలట్లకు ఏటీసీ సూచించింది. గాలి వేగం, విజిబిలిటీ, ఇతర అంశాలు బాగానే ఉన్నాయని పైలట్లు సమాధానమిచ్చారు. విమానాశ్రయం సమీపంలోకి చేరుకున్నాక ల్యాండింగ్ కోసం విమానాన్ని కిందకు తీసుకొచ్చారు. కానీ రన్ వే కనిపించడం లేదంటూ ఏటీసీకి సమాచారమిచ్చి మళ్లీ పైకి తీసుకెళ్లారు. అలాగే ముందుకెళ్లి, చుట్టూ తిరిగి మళ్లీ రన్ వే ప్రారంభం వైపు వచ్చారు. ఆ సమయంలో విమానం సుమారు కిలోమీటరు ఎత్తున, గంటకు 237 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తోంది. రన్‌వే కనిపిస్తోందా అని ఏటీసీ సిబ్బంది అడిగితే.. ఇంకా కనిపించలేదని, కనబడగానే సమాచారం ఇస్తామని చెప్పారు. కొన్ని సెకన్ల తర్వాత తమకు రన్ వే కనిపిస్తోందని ఏటీసీకి చెప్పారు. రన్ వే-11పై విమానం ల్యాండింగ్‌కు అనుమతిస్తున్నామని 8.43 గంటలకు ఏటీసీ సిబ్బంది సమాచారమిచ్చారు. కానీ పైలట్ల నుంచి తిరిగి సమాధానం(రీడ్ బ్యాక్) రాలేదు. ఏటీసీ అనుమతి ఇచ్చిన మేరకు.. విమానాన్ని ఎంత వేగంతో, ఏ రన్‌వేపై, ఎటువైపునుంచి ల్యాండింగ్ చేస్తున్నారనే వివరాలను పైలట్లు తిరిగి చెప్పడమే రీడ్ బ్యాక్. ఏటీసీ సూచనలను పైలట్లు సరిగా విని, అనుసరిస్తున్నారన్నది నిర్ధారించుకోవడమే దీని ఉద్దేశం. కానీ ఈ విమానం పైలట్లు రీడ్ బ్యాక్ చేయలేదు. తర్వాత ఒకట్రెండు నిమిషాల్లోనే రన్‌వే మొదలవడానికి సుమారు 150మీటర్ల ముందే విమానంకూలిపోయింది.


17 విమానాలతో అద్దె సర్వీసులు

వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థ నాన్ షెడ్యూల్డ్ విమాన ఆపరేటర్‌గా పనిచేస్తోంది. అంటే నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం అని కాకుండా.. అవసరాన్ని బట్టి అద్దెపై విమానాలను నడుపుతుంది. ఈ సంస్థ వద్ద తాజాగా కూలిన విమానం సహా ఏడు లియర్ జెట్లు, ఐదు ఎంబ్రాయర్ 135 బీజే, నాలుగు కింగ్ ఎయిర్ బీ200, ఒక పిలాటస్ పీసీ-12 విమానాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రమాదానికి గురైన విమానానికి పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ)’ గత ఏడాది ఫిబ్రవరిలో తనిఖీలు చేసి, క్లియరెన్స్ ఇచ్చింది. కాగా, తమ విమానంలో సాంకేతిక లోపాలేమీ లేవని, ప్రమాదానికి కారణం ఏమిటన్నదానిపై పరిశీలన చేస్తున్నామని వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థ ప్రకటించింది.

ఆ సదుపాయం లేకపోవడంతో సమస్య!

వర్షం, పొగమంచు వంటి సందర్భాల్లో, వెలుతురు సరిగా లేనప్పుడు, రాత్రిళ్లు కూడా రన్ వేపై విమానం సరిగ్గా ల్యాండ్ కావడం కోసం విమానాశ్రయాల్లో ‘ఇన్‌స్ట్రుమెంటల్ ల్యాండింగ్ సిస్టమ్’ ఉంటుంది. ఇది రేడియో నావిగేషన్ సహాయంతో విమానాలు రన్‌వేపై ల్యాండ్ కావడానికి దారిచూపుతుంది. అయితే బారామతి విమానాశ్రయం చిన్నది కావడంతో ఇక్కడ ‘ఇన్‌స్ట్రుమెంటల్ ల్యాండింగ్ సిస్టమ్’ అందుబాటులో లేదు. దీనితో పైలట్లు తమ సొంత విచక్షణ, అనుభవంతోనే ల్యాండింగ్ చేయాల్సి ఉంటుంది. తాజా ఘటనలో రన్ వే సరిగా కనిపించక పైలట్లు ఇబ్బందిపడి.. ల్యాండింగ్ సమయంలో నేలను ఢీకొని ఉంటారనే అంచనాలు ఉన్నాయి. ఇక ఈ విమానాశ్రయంలో పూర్తిస్థాయి ఏటీసీ వ్యవస్థ కూడా లేదు.

లోకం తీరు



మంచి నేతను కోల్పోయాం

» ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జనవరి 28: అజిత్‌పవార్ మృతిపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవితాలను మెరుగుపర్చేందుకు అజిత్ పవార్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. గత మూడున్నర దశాబ్దాల్లో మహారాష్ట్రలోని అన్ని వర్గాల ప్రజలకు అజిత్ పవార్ ఎనలేని సేవ చేశారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇక కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్‌సింగ్, మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ తదితరులు సంతాపం తెలిపారు. అజిత్‌పవార్ అకాల మరణం తనకు ఆవేదన కలిగించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

అజిత్ మృతిపై సుప్రీం పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలి: మమత

కోల్‌కతా/ముంబై, జనవరి 28: విమాన ప్రమాదం, అజిత్ పవార్ మృతిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె కోల్‌కతాలో మీడియాతో మాట్లాడారు. దేశంలో సామాన్యులతోపాటు రాజకీయ నాయకులకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఈ ఘటన రుజువు చేసిందని పేర్కొన్నారు. ఏ దర్యాప్తు సంస్థ విచారణ చేసినా నిజాలు బయటికి రావని, సుప్రీం పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని కోరారు. కాగా, అజిత్ పవార్ మృతి వెనుక ఎలాంటి కుట్ర లేదని, విమాన ప్రమాదాన్ని రాజకీయం చేయవద్దని ఆయన చిన్నాన్న, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ పేర్కొన్నారు.

ఇద్దరు పైలట్లూ సమర్థులే!

» ఒకరికి 16,500 గంటల సుదీర్ఘ అనుభవం

» మరొకరు న్యూజిలాండ్‌లో శిక్షణ పొంది, పైలట్ శిక్షకురాలిగా పనిచేసిన యువతి



సుమిత్ కపూర్ (ప్రధాన పైలట్)



శాంభవి పాఠక్ (పైలట్)

ముంబై, జనవరి 28: బారామతిలో ప్రమాదానికి గురైన లియర్‌జెట్- 45 విమానంలో పైలట్ ఇన్ కమాండ్‌గా కెప్టెన్ సుమిత్ కపూర్ వ్యవహరించగా.. శాంభవి పాఠక్ ఫస్ట్ ఆఫీసర్‌గా పనిచేశారు. ప్రధాన పైలట్ సుమిత్‌కు 16,500 గంటలు విమానం నడిపిన అనుభవం ఉంది. అత్యంత అనుభవజ్ఞుడైన పైలట్‌గా గుర్తింపు పొందిన ఆయన.. ఇంతకుముందు సహారా, జెట్‌లైన్, జెట్ ఎయిర్‌వేస్ వంటి విమానయాన సంస్థల్లో పనిచేశారు. ఇక కో-పైలట్ శాంభవి (26) మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందినవారు. ఆమె తండ్రి వైమానిక దళంలో పనిచేశారు. దీనితో ఆమెకు చిన్న వయసు నుంచే విమానయానంపై మక్కువ ఉండేది. ఈ క్రమంలో గ్వాలియర్‌లోని ఎయిర్‌ఫోర్స్ బాలభారతి స్కూల్‌లో శాంభవి చదువుకున్నారు. 2016-18 మధ్య సెకండరీ విద్యను పూర్తి చేశారు. ముంబై విశ్వవిద్యాలయం నుంచి ఏరోనాటిక్స్, ఏవియేషన్, ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీఎస్సీ పట్టా పొందారు. న్యూజిలాండ్ ఇంటర్నేషనల్ కమర్షియల్ పైలట్ అకాడమీలో శిక్షణ తీసుకుని లైసెన్స్ పొందారు. ఆ తర్వాత భారత్‌కు వచ్చి మధ్యప్రదేశ్ ఫ్లయింగ్ క్లబ్‌లో అసిస్టెంట్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూ, ఇతర పైలట్లకు శిక్షణ ఇచ్చారు. డీజీసీఏ నుంచి కమర్షియల్ పైలట్ లైసెన్స్‌తో పాటు ఫ్రోజెన్ ఎయిర్‌లైన్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్స్ కూడా పొందారు. 2022 నుంచి వీఎస్ఆర్ వెంచర్స్ సంస్థలో ఫస్ట్ ఆఫీసర్ (కో-పైలట్)గా పనిచేస్తూ.. లియర్‌జెట్ -45 వంటి బిజినెస్ జెట్ విమానాలను నడిపే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శాంభవికి 1,500 గంటలకుపైగా విమానం నడిపిన అనుభవం ఉంది.

అజిత్ వారసులెవరో!



అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్‌ను పరామర్శిస్తున్న మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవవ్రత్ సీఎం దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే

» భార్యా.. కుమారుడా?.. లేదంటే ఎన్సీపీ ఎస్పీలో పార్టీ విలీనమా?

అజిత్ పవార్ అకాల మరణంతో ఆయన వారసులుగా ఎన్సీపీ నాయకత్వ బాధ్యతలు చేపట్టేదెవరనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఆయన భార్య సునేత్ర పవార్, కుమారులు పార్థ్ పవార్, జై పవార్‌లలో ఒకరు కచ్చితంగా పగ్గాలు చేపట్టే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్ర మాజీ మంత్రి, అజిత్ చిన్నాన్న శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ-ఎస్పీలో ఎన్సీపీ విలీనం కావచ్చని ఇంకొందరు అంచనా వేస్తున్నారు. శరద్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీని చీల్చిన అజిత్.. నాడు ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేరిన సంగతి తెలిసిందే. తర్వాత ఎన్నికల కమిషన్ అజిత్ నేతృత్వంలోని పార్టీనే అసలైన ఎన్సీపీగా గుర్తించింది. శరద్ పవార్ పార్టీ ఎన్సీపీ-ఎస్పీ అయింది. బీజేపీ, షిండే శివసేనతో కలిసి 2024 లోక్‌సభ ఎన్నికల్లో 4 సీట్లలో పోటీచేసిన ఎన్సీపీ ఒక్క చోటే గెలిచింది. అజిత్ భార్య సునేత్ర బారామతిలో తన ఆడపడుచు, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలేపై పోటీచేసి ఓటమిపాలయ్యారు. కానీ ఆ ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అజిత్ తన పార్టీని 41 చోట్ల విజయపథంలో నడుపగా.. శరద్ పవార్ పార్టీ పది సీట్లకే పరిమితమైంది. తర్వాత రెండు గ్రూపుల విలీనం దిశగా ప్రాథమిక చర్చలు నడిచాయి. అజిత్ ఆసక్తి చూపకపోవడంతో ముందుకు కదల్లేదు. అయితే ఇటీవల పుణె, పింప్రీ-చించ్వాడా కార్పొరేషన్లలో అజిత్ తన చిన్నాన్న పార్టీతో కలిసి పోటీచేశారు. ఇలాంటి దశలో అజిత్ మరణించారు. ఈ క్ర మంలో రెండు వర్గాలు కలిసిపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ విలీనానికి సునేత్ర నుంచి అభ్యంతరం రావచ్చని అజిత్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో శరద్ పవార్ తన కోడలైన సునేత్రను ‘బయటి వ్యక్తి’గా విమర్శించిన నేపథ్యంలో.. ఇప్పుడు ఆమె ఆ కుటుంబానికి చేరువయ్యేందుకు అంగీకరిస్తారా అనే ది ప్రశ్నార్థకంగా మారింది. అజిత్ పెద్ద కుమారుడు పార్థ్‌కు రాజకీయ అనుభవం ఉన్నా.. ఇటీవల రూ.300 కోట్ల భూకుంభకోణంలో ఆయన పేరు రావడంతో ప్రతిష్ఠ దెబ్బతింది. దానికితోడు తండ్రి అడుగుజాడల్లో పార్టీని నడిపే సత్తా ఆయనకు లేదని అజిత్ సన్నిహితులు అంతర్గతంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్సీపీ పరిస్థితి ఏమిటన్న చర్చ జరుగుతోందిన వారసత్వ వ్యవహారం కొలిక్కి వచ్చేదాకా తాత్కాలికంగా పార్టీ బాధ్యతలన్నీ సీనియర్ నేత ప్రఫుల్ పటేల్, రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ తత్కరే నిర్వహించే అవకాశం ఉందని ఎన్సీపీ వర్గాలు వెల్లడించాయి.

- సెంట్రల్ డెస్క్

అజిత్ మరణం ఫడణవీస్‌కూ లోటే!

అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రలో కొంత రాజకీయ శూన్యత ఏర్పడింది. మహాయుతి ప్రభుత్వ సుస్థిరతకూ ముప్పు పొంచి ఉందంటున్నారు. వాస్తవానికి దీర్ఘ కాలం ఉపముఖ్యమంత్రిగా ఉన్న ఆయన.. సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు పలు సందర్భాల్లో ట్రబుల్ షూటర్‌గా పనిచేశారు. గ్రామీణ మహారాష్ట్ర, సహకార చక్కెర కర్మాగారాల ప్రాంతాల్లో ఆయనకు గట్టి పట్టుంది. ఓటుబ్యాంకు కూడా ఉంది. అజిత్ మరణం రాజకీయంగా ఫడణవీస్‌కు కూడా లోటేనని, పాలనాపరంగానూ ఇబ్బందేనని బీజేపీ వర్గాలు అంటున్నాయి.

అజిత్ పవార్ మృతికి రాష్ట్ర క్యాబినెట్ సంతాపం

» నేడు బారామతిలో అంత్యక్రియలకు లోకేశ్

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతికి ఏపీ క్యాబినెట్ సంతాపం తెలిపింది. సమావేశం ప్రారంభం కాగానే విమాన ప్రమాద ఘటనను ప్రస్తావించిన సీఎం, అజిత్ పవార్ మృతికి విచారం వ్యక్తం చేశారు. ఆయనతో తనకున్న పరిచయాన్ని గుర్తు చేసుకున్నారు. పవార్ మృతికి సంతాపం తెలుపుతూ తీర్మానం చేశారు. బారామతిలో జరిగే అజిత్ పవార్ అంత్యక్రియలకు మంత్రి లోకేశ్ హాజరుకానున్నారు.

మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి

అజిత్ పవార్ ఇకలేరనే వార్త తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యానని రాష్ట్ర మంత్రి సత్యకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ‘మహారాష్ట్ర రాజకీయాల్లో అజిత్ స్ఫూర్తిదాయక ప్రయాణం ఇంత ఘోరంగా ఆగిపోతుందని కలలో కూడా ఊహించలేదు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి’ అని తెలిపారు.

నేతలు అప్రమత్తంగా ఉండాలి: డీకే శివకుమార్

బెంగళూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అకస్మిక మృతి తనను కలచివేసిందని కర్ణాటక డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. ప్రయాణాల వేళ రాజకీయ నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సదాశివనగర్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

బ్రాహ్మణులకు రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలి

» పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 28: బ్రాహ్మణులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్న పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిప్పటికీ.. సాధారణంగా సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన వర్గాల(ఎస్ఈబీసీ) నుంచే రాజకీయ వెనకబాటుతనం పుడుతుందని అభిప్రాయపడింది.

యూజీసీ తాజా నిబంధనపై విచారణకు సుప్రీం ఓకే

న్యూఢిల్లీ, జనవరి 28: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఇటీవల ఉన్నత విద్యాసంస్థలకు జారీ చేసిన ఒక నిబంధనపై దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్యా బాగ్చిల బెంచ్‌ను అత్యవసరంగా ఈ పిటిషన్‌ను విచారించాలని ఒక న్యాయవాది కోరగా అందుకు అంగీకరించింది.

అందుబాటులోకి సరికొత్త ఆధార్ యాప్

న్యూఢిల్లీ, జనవరి 28: సరికొత్త ఆధార్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ఆఫ్‌లైన్ వెరిఫికేషన్‌తోపాటు ఎంపిక చేసిన డేటాను మాత్రమే పంచుకోవడానికి, ఆధార్ సర్వీసులను సులభంగా, సురక్షితంగా వినియోగించుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఈ యాప్ ద్వారా మొబైల్ నంబరు, చిరునామాను అప్‌డేట్ చేసుకోవచ్చు. అలాగే ఆధార్ జిరాక్స్ కాపీని ఇవ్వాల్సిన అవసరంలేకుండా ఎంపిక చేసిన ఆధార్ సమాచారాన్ని పంచుకోవడానికి అవకాశం కలుగుతుంది.

ఈయూతో ఒప్పందం.. భారత్‌కే లాభం

వాషింగ్టన్, జనవరి 28: ఐరోపా సమాఖ్య (ఈయూ)తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్‌కే లాభదాయకమని అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జెమిసన్ గ్రీర్ అన్నారు. ఈ ఒప్పందంలో భారతదేశమే పైచేయిగా నిలుస్తుందంటూ భారత్‌కు కలిసొచ్చే కాలం మొదలైందని వ్యాఖ్యానించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ యూరప్‌లో భారత ఉత్పత్తులకు, భారతీయ కార్మికులకు ఎక్కువ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

భారత్, చైనా వాహనాలపై 50% దాకా సుంకాలు!

» పరిశీలిస్తున్న దక్షిణాఫ్రికా

న్యూఢిల్లీ, జనవరి 28: రానున్న కాలంలో దక్షిణాఫ్రికాకు వాహనాలను ఎగుమతి చేసే భారత ఆటోమొబైల్ కంపెనీలపై ప్రభావం పడే సంకేతాలు కనిపిస్తున్నాయి. భారత్, చైనా నుంచి దిగుమతి చేసుకునే వాహనాలపై 50శాతం వరకు సుంకాలను విధించే అంశాన్ని ఆ దేశం పరిశీలిస్తున్నట్టుగా మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ అంశాన్ని దక్షిణాఫ్రికా వాణిజ్య, పరిశ్రమ, పోటీ శాఖ సమీక్షిస్తున్నట్టు సమాచారం.



కొమ్ముకోణం చేప అ'ధర'హో!

కాకినాడ సముద్ర తీరంలో కుంభాభిషేకం రేవు వద్ద మత్స్యకారుల వలకు బుధవారం మూడు భారీ కొమ్ము కోణం చేపలు చిక్కాయి. ఒక్కో చేప 50 నుంచి 100 కిలోల వరకు బరువు తూగింది. వీటిని అమ్మకానికి పెట్టగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ధర పలికాయి. - కాకినాడ, ఆంధ్రజ్యోతి

నేటి నుంచి అరకు ఉత్సవ్



అరకులోయ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అరకు ఉత్సవ్ గురువారం నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకూ జరగనున్నది. గిరిజన సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సవ్‌ను నిర్వహించనున్నారు. 31వ తేదీ సాయంత్రం ప్రముఖ గాయని సునీత లైవ్ కాన్సర్ట్, ఫిబ్రవరి 1న సాయంత్రం ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ లైవ్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

వద్దన్నా హద్దు మీరుతున్నారు...



తిరుమల ఆలయం ముందు ఫొటో షూట్‌లో జంట

- తిరుమలలో ఓ జంట ఫొటో షూట్
- పట్టించుకోని భద్రతా సిబ్బంది

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎన్ని హెచ్చరికలు చేసినా తిరుమలలో 'నిషేధ' ఉల్లంఘనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. కొందరు అత్యుత్సాహంతో చేసే చర్యలు భక్తులకు మనస్తాపం కలిగిస్తున్నాయి. తాజాగా తిరుమల శ్రీవారి ఆలయం ముందు ఒక జంట ఫొటో షూట్ చూసి భక్తులు విస్తుపోయారు. బుధవారం ఉదయం పెళ్లి దుస్తుల్లో ఉన్న జంట గొల్లమండపానికి అతి సమీపంలో ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. ప్రత్యేక లైట్ల వెలుగులో షూటింగ్ జరిగింది. ఈ క్రమంలో నుదుటిపై ముద్దులు పెట్టుకుంటున్న వీడియోలు, ఫొటోలు తీశారు. గొల్లమండపం నుంచి అఖిలాండం వరకు నడుస్తూ ఫోజులిచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఇటువంటివి నిషేధం, అయితే భద్రతా సిబ్బంది ఎవరూ వీరిని అడ్డుకోకపోవడం గమనార్హం.

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులపై ఈయు హర్షం

విజయవాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీలో ఉద్యోగుల పదోన్నతులపై ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయటం పట్ల ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదరరావు, జీవీ నరసయ్య హర్షం వ్యక్తం చేశారు. గతేడాది అక్టోబరు 18న ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన చర్చల అనంతరం ప్రభుత్వం జీవో జారీ చేసినా, 28 జిల్లాల్లోని 15 డివిజన్లలో న్యాయపరమైన ఇబ్బందుల కారణంగా సుమారు 7500 మందికిగాను 550 మందికే పదోన్నతులు లభించాయని వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాప్యంపై నిరసన తెలుపుతూ ఈ నెల 26న ఎండీకి వినతిపత్రం ఇచ్చామన్నారు. దీనిపై స్పందించిన ఎండీ డివిజనల్ సీనియారిటీ అంశాలపై క్లారిటీ ఇస్తూ ఆదేశాలు జారీ చేయడంతో, వారంలోపే ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


కోస్తా జిల్లాల్లో పొగమంచు

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ నుంచి మధ్య భారతం మీదుగా కర్ణాటక వరకూ ఉపరితలద్రోణి విస్తరించింది. దీని ప్రభావంతో మధ్యభారతం నుంచి చలిగాలులు తెలంగాణ, దానికి ఆనుకుని కోస్తాలోని పలు జిల్లాలపైకి వీస్తున్నాయి. దీంతో పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో బుధవారం ఉదయం అనేకచోట్ల పొగమంచు కురిసింది. పొగమంచు కురుస్తున్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని బుధవారం విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం హెచ్చరిక జారీచేసింది. ఇంకా చలి పెరుగుతుందని పేర్కొంది. గురువారం ఉదయం పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పొగమంచు కురుస్తుందని, కోస్తా, రాయలసీమల్లోని పలు ప్రాంతాల్లో చలి పెరిగి రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని తెలిపింది.

రాష్ట్రానికి సంజీవని!

ప్రజలందరికీ వైద్య పరీక్షలు.. 72.73 లక్షల మందికి హెల్త్ స్క్రీనింగ్: సీఎం

- ప్రజారోగ్యం డేటా ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉండాలి
- హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేయాలి
- ఆస్పత్రుల నిర్మాణం, నిర్వహణకు ముందుకొచ్చేవారికి రాయితీలు
- నియోజకవర్గానికో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి
- ఎంపీహెచ్ఏలను విధుల్లోకి తీసుకునేందుకు ఆమోదం



అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేసి పర్యవేక్షించేలా చేపట్టిన సంజీవని ప్రాజెక్టును త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఆరోగ్యశాఖపై ఆయన సమీక్ష జరిపారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాకు విస్తరించిన సంజీవని పైలట్ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధం చేసిన ప్రణాళికలు, పైలట్ అమలు తీరును అధికారులకు సీఎంకు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. 'టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చి, నాణ్యమైన వైద్య సేవలను ప్రజలకు అందించే లక్ష్యంతో సంజీవని ప్రాజెక్టు చేపడుతున్నాం. శిశువుల నుంచి వృద్ధుల వరకూ వైద్య సేవలు అందాలి. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేసేలా ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నాం. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎలాంటి ఆహారం తీసుకోవాలి.. పోషకాహారాల వల్ల ఉపయోగాలేమిటో మొబైల్ యాప్ ద్వారా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. న్యూట్రిషన్ యాప్ కూడా అందుబాటులోకి తీసుకురావాలి' అని ఆదేశించారు. వీటితో పాటు వచ్చే ఏప్రిల్ నుంచి యూనివర్సల్ హెల్త్ పాలసీ అమల్లోకి రానున్న క్రమంలో అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ప్రజారోగ్యమే ప్రధాన ఎజెండాగా సంజీవని ప్రాజెక్టును చేపట్టామని, ప్రభుత్వం దగ్గరున్న డేటాను ఆధారంగా తీసుకుని ప్రజల ఆరోగ్యంపై విశ్లేషించడంతో పాటు ప్రజల వద్దకు వెళ్లి శాంపిల్ సర్వేలు చేపట్టాలని సీఎం సూచించారు. 72.73 లక్షల మందికి హెల్త్ స్క్రీనింగ్ చేయాలని, ప్రజారోగ్యానికి సంబంధించిన డేటా ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉండాలన్నారు. ఎనీమియా, కార్డియాక్, డయాబెటిక్, కిడ్నీ, లివర్ వ్యాధులపై అధ్యయనం చేయాలని.. ఎవరైనా రిస్క్ కేటగిరీలో ఉంటే వారిని అప్రమత్తం చేసి మెరుగైన వైద్య సాయం అందేలా చూడాలని తెలిపారు. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నియోజకవర్గానికో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసుకునే అంశాన్ని పరిశీలించాలన్నారు. ప్రజల జీవన శైలి, ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన కారణాలు లేదా పర్యావరణ సమస్యల వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయో వారికి వివరించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉండాలని, నియోజకవర్గాల్లో మల్టీస్పెషాల్టీ ఆస్పత్రుల నిర్మాణానికి అవసరమైన చర్యలు త్వరగా చేపట్టాలన్నారు. దీనికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని.. కేంద్రానికి వివరాలు పంపించాలని తెలిపారు. రాష్ట్రంలో ఆస్పత్రుల నిర్మాణం, ఏర్పాటుకు ముందుకొచ్చే ప్రముఖ ఆస్పత్రి యాజమాన్యాలకు.. లాభాపేక్ష లేకుండా ఆస్పత్రుల నిర్మాణం, నిర్వహణ చేపట్టే వారికి రాయితీలు ఇస్తామని ప్రకటించారు.

విధుల్లోకి ఎంపీహెచ్ఏలు

మల్టీపర్పస్ మేల్ హెల్త్ అసిస్టెంట్ల (ఎంపీహెచ్ఏ)ను విధుల్లోకి తీసుకునేందుకు సీఎం అంగీకరించారు. వారి సమస్యలను మంత్రి సత్యకుమార్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో 730 మంది ఎంపీహెచ్ఏలున్నారని, వీళ్ల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా తీర్పు ఇచ్చిందని, వీళ్ల పోరాటం చాలా కాలంగా సాగుతోందని తెలిపారు. మంత్రి, అధికారుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన సీఎం.. వెంటనే వారిని విధుల్లో తీసుకోవాలన్నారు. సమీక్షలో ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, కమిషనర్ వీరపాండియన్, డీఎస్‌హెచ్ కమిషనర్ చక్రధర బాబు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో దినేశ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫ్యాప్సీ ఎక్స్‌లెన్స్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) 2025-26 సంవత్సరానికి రాష్ట్రస్థాయి ఎక్స్‌లెన్స్ అవార్డులు అందించనుందని, దీని కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అవార్డుల కమిటీ చైర్మన్ కంకటాల మల్లిక్ తెలిపారు. విశాఖపట్నంలో బుధవారం నిర్వహించిన ఫ్యాప్సీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలు, వ్యాపారవేత్తల ప్రతిభ, నూతన ఆవిష్కరణలు, వ్యాపార స్ఫూర్తి, స్థిర అభివృద్ధిని గుర్తించి ప్రోత్సహించడమే అవార్డుల ముఖ్య ఉద్దేశమన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమలతో పాటు స్టార్టప్స్, మహిళలు, ఎగుమతిదారులు, విద్యా సంస్థలు నిర్వహిస్తున్న వారంతా అవార్డులకు అర్హులేనని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేయడానికి మాజీ న్యాయమూర్తులు చల్లా కోదండరామ్, జస్టిస్ డీవీవీఎస్ సోమయాజులు, రిటైర్డ్ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ చంద్రశేఖర వర్మ, గీతం మాజీ వీసీ డిసౌజా, జానకీరామచంద్రంలతో కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఫిబ్రవరి 25లోపు దరఖాస్తులు పంపాలని, వివరాలకు 9391422821లో నంబరులో సంప్రతించాలని, ఫ్యాప్సీ వెబ్‌సైట్‌లోనూ చూడవచ్చని సూచించారు. సమావేశంలో ఫ్యాప్సీ అధ్యక్షులు ఎ.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కిశోర్‌కుమార్, వ్యవస్థాపక అధ్యక్షులు సీవీ అచ్యుతరావు, కో-చైర్మన్ ప్రద్యుమ్న పాల్గొన్నారు.

నోటిఫైబుల్ వ్యాధిగా కుష్ఠు వ్యాధి

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని నోటిఫైబుల్ వ్యాధిగా ప్రభుత్వం గుర్తించింది. ఈమేరకు ఆరోగ్య శాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం కుష్ఠు వ్యాధి నిర్మూలనకు తీవ్రంగా కృషి చేస్తోంది. అయినా అక్కడక్కడ కేసులు నమోదవుతున్నాయి. దీంతో ప్రభుత్వం కుష్ఠువ్యాధిని నోటిఫైబుల్ వ్యాధిగా గుర్తించింది. దీనివల్ల జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు ఈ వ్యాధిపై అత్యంత జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు నివారణ చర్యలు చేపట్టేందుకు వీలవుతుంది. శస్త్ర చికిత్సలపై ప్రత్యేక దృష్టి పెట్టనుంది.



అనంతపురం జిల్లా పుట్లూరు మండలం చింతకుంట గ్రామ శివారులో దగ్ధమవుతున్న స్కూల్ బస్సు

అనంతలో బడి బస్సు దగ్ధం

- విద్యార్థులు క్షేమం

పుట్లూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పుట్లూరు మండలం చింతకుంట గ్రామ సమీపంలో ప్రైవేటు పాఠశాల బస్సు అగ్నికి ఆహుతైంది. పుట్లూరులోని శ్రీరామ గ్లోబల్ స్కూల్ బస్సు బుధవారం సాయంత్రం విద్యార్థులను ఎక్కించుకొని కడవకల్లు వెళుతుండగా చింతకుంట వద్ద ఉన్నట్లుండి ఆగిపోయింది. డ్రైవర్ బస్సు దిగి పరిశీలించగా, బస్సు కింది భాగంలో మంటలు కనిపించాయి. దీంతో వెంటనే విద్యార్థులను కిందకు దించేశారు. ఆతర్వాత మంటలు పెరిగి బస్సు దగ్ధమైంది. బస్సులోని సుమారు 20 మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. వారిని మరో బస్సులో ఇళ్లకు తరలించారు. బస్సు ఫిట్‌నెస్ సరిగా లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని సమాచారం.

ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు

- ఇప్పటికే నలుగురు కుమార్తెలు..
- ఐదో సారి కొడుకు కోసం ప్రయత్నం
- ఈసారి ఇద్దరు కొడుకులు, కుమార్తె జననం



అనంతపురం వైద్యం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆ దంపతులకు ఇప్పటికే నలుగురు ఆడపిల్లలు జన్మించారు. ఐదోసారి కొడుకు కోసం ప్రయత్నించగా.. ఈ సారి ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించారు. వారిలో ఒక ఆడ, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. దీంతో ఐదుగురు ఆడపిల్లలు సహా మొత్తం సంతానం ఏడుకు పెరిగింది. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం నంజాపూరం గ్రామానికి చెందిన కవిత, రమేశ్‌లకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. తమకున్న నాలుగు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న ఆ దంపతులకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు కావాలని ఐదో కాన్పు కోసం కూడా వారు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కవిత (36)ను గర్భం దాల్చగా పరీక్షించిన వైద్యులు.. ముగ్గురు శిశువులు ఉన్నట్టు గుర్తించారు. ప్రసవం సంక్లిష్టమవుతుందని భావించి.. వారిని అనంతపురం సర్వజన వైద్యశాలకు పంపించారు. గైనకాలజీ విభాగం డాక్టర్ సుచిత్ర ఆధ్వర్యంలో కవిత ఆరోగ్యాన్ని పర్యవేక్షించిన వైద్యులు ఈ నెల 19న ఉదయం సిజేరియన్ చేసి నాలుగు నిమిషాల వ్యవధిలో ముగ్గురు శిశువులను బయటకు తీశారు. అనంతరం చిన్నారులను నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణ కేంద్రం (ఎస్ఎన్‌సీయూ)కు తరలించారు. ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించడంతో తల్లిపాలు చిన్నారులకు సరిపోలేదు. దీంతో సర్వజన వైద్యశాలలోని మదర్స్ మిల్క్‌బ్యాంక్ నుంచి ఇద్దరికి పాలు పడుతున్నారు. వీరిద్దరూ 1.7 కేజీల బరువు ఉండడంతో నాలుగు రోజులకే ఎస్ఎన్‌సీయూ నుంచి డిశ్చార్జ్ చేసి తల్లికి అప్పగించారు. మరో చిన్నారి 1.4 కేజీల బరువు మాత్రమే ఉండటంతో ఎస్ఎన్‌సీయూలోనే వార్మర్‌లో ఉంచారు. ప్రస్తుతం తల్లి కూడా కోలుకున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి తెలిపారు.

రూ.7 కోట్ల విలువైన బంగారం స్వాధీనం

- గతేడాది ఫైనాన్స్ కంపెనీలో ఆడిట్‌కు వచ్చి.. అపహరణ
- 4 నెలల్లో కేసు ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారాన్ని పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఒక ఫైనాన్స్ కంపెనీ నుంచి బంగారాన్ని అపహరించిన ఆడిటర్‌ను అరెస్టు చేసి అతని నుంచి రూ.7 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ వెల్లడిచారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం మీడియాకు కేసు వివరాలను వెల్లడించారు. చింతలపూడిలోని కనకదుర్గ ఫైనాన్స్ కంపెనీలో ఎంతో మంది తమ కుటుంబ అవసరాలు నిమిత్తం బంగారాన్ని తాకట్టుపెట్టారు. ఆ కంపెనీలో రికార్డు ప్రకారం బంగారపు వస్తువులు అన్ని కచ్చితంగా ఉన్నాయో లేదో ఆకస్మికంగా తనిఖీలు చేయిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో గతేడాది సెప్టెంబర్ 9న విజయవాడ హెడ్ ఆఫీస్ నుంచి ఆడిట్ ఎగ్జిక్యూటివ్.. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన వడ్లమూడి ఉమామహేశ్ చింతలపూడి వచ్చాడు. అక్కడ ఉన్న బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ సమక్షంలో లాకరులో ఉన్న 378 బంగారం ప్యాకెట్లను ఉదయం నుంచి సాయంత్రం వరకూ పరిశీంచాడు. సాయంత్రం 5 గంటల సమయంలో ప్రవీణ్ బయటకు వెళ్లడంతో అక్కడే ఉన్న క్యాషియర్‌ను కొబ్బరి బొండాం తీసుకురావాలని చెప్పి బయటకు పంపించాడు. 4.490 కిలోల బరువైన 378 బంగారపు లోను ప్యాకెట్లను తన బ్యాగ్‌లో వేసుకున్న ఉమామహేశ్ అక్కడ నుంచి పరారయ్యాడు. అదే రోజు రాత్రి 8 గంటలకు బ్రాంచ్ మేనేజర్ చింతలపూడి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఉమామహేశ్ కృష్ణా జిల్లా నాగాయలంకలో ఉన్నట్లు గుర్తించారు. అతన్ని బుధవారం ఉదయం అరెస్టు చేసి 4.484 కిలోల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

దేశం నుంచి గాంధీని దూరం చేయలేరు!

- 'గాంధీజీ సందేశ్ యాత్ర' ప్రారంభించిన రఘువీరా



నీలకంఠాపురంలో జాతీయ జెండా చేతబట్టి పాదయాత్ర చేస్తున్న రఘువీరారెడ్డి, ఆయన సతీమణి సునీత వీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

మడకశిర రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గాంధీజీ ఔన్నత్యాన్ని చాటి చెప్పడం కోసం 'గాంధీజీ సందేశ్ యాత్ర' నిర్వహిస్తున్నానని సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. దేశం నుంచి గాంధీజీని ఎవరూ వేరు చేయలేరని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం నీలకంఠాపురం నుంచి బుధవారం ఆయన 'గాంధీజీ సందేశ్ యాత్ర'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు మెళవాయి గోవిందరెడ్డిని రఘువీరా రెడ్డి సన్మానించారు. బ్రిటీష్ పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు ప్రజలందరినీ ఐక్యం చేసి, స్వాతంత్రోద్యమాన్ని నిర్మించిన మహానాయకుడు మహాత్మాగాంధీ అని చెప్పారు. గాంధీజీ స్ఫూర్తితో ఆనాటి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న వారిలో తమ కుటుంబం కూడా ఒకటని తెలిపారు. స్వాతంత్రోద్యమంలో ఏ మాత్రం ప్రమేయంలేని కొందరు తమ సంకుచిత, కుటిల రాజకీయాల కోసం మహాత్మా గాంధీ జీవితంపైన అసత్యాలు, వక్రీకరణలతో వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ ఆలోచనలను, సిద్ధాంతాలను నేటి తరానికి, భవిష్యత్ తరాలకూ అందించాల్సిన చారిత్రక బాధ్యత ఆయన అభిమానులపై ఉందని స్పష్టంచేశారు. కాగా.. తొలిరోజు పాదయాత్ర నీలకంఠాపురం నుంచి బుల్లసముద్రం వరకూ సాగింది.

నంద్యాల జిల్లాకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు కిడ్నాప్

నరసరావుపేట లీగల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు చంటిగారి కృపాకర్ మంగళవారం రాత్రి పల్నాడు జిల్లా నరసరావుపేటలో కిడ్నాపైనట్టు నరసరావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. జూపాడు బంగ్లా ఎంపీపీ పదవిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా ఈ నెల 31న ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ఆ మండలానికి చెందిన కృపాకర్‌తో పాటు మరో ఎంపీటీసీ సభ్యుడు(టీడీపీ) ఈ నెల 27న పల్నాడు జిల్లా నరసరావుపేటకి వచ్చి వినుకొండ రోడ్డులోని ఓ అతిథి గృహంలో బస చేశారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 9:30 గంటల సమయంలో వారు భోజనం చేసి వస్తుండగా కృపాకర్‌ను నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన సురేష్ యాదవ్ మరికొందరు కిడ్నాప్ చేశారు. అక్కడే ఉన్న మరో ఎంపీటీసీ సభ్యుడు వారి అనుచరులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు తెలిపారు.

విద్యార్థికి రూ.5 చొప్పున ఇవ్వాల్సిందే!

- వార్డెన్లకు శ్రీకాకుళం జిల్లా ఏబీసీడబ్ల్యూవో హుకుం
- రూ.1.84 లక్షలు తీసుకుంటుండగా అదుపులోకి



ఏసీబీకి చిక్కిన ఏబీసీడబ్ల్యూవో జి.బాలముకుందరావు

కంచిలి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా సహాయ బీసీ బాలుర సంక్షేమ వసతి గృహ అధికారి (ఏబీసీడబ్ల్యూవో) జి.బాలముకుందరావు వార్డెన్ల నుంచి లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ ఇన్‌చార్జి డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి, సీఐ కె.భాస్కర్ వెల్లడించిన వివరాల మేరకు.. నరసన్నపేటలో ఏబీసీడబ్ల్యూవోగా పనిచేస్తున్న బాలముకుందరావు కంచిలి, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లోని వసతి గృహాలకు ఎఫ్ఏసీగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి విద్యార్థికీ ఐదు రూపాయల చొప్పున తనకు లంచం ఇవ్వాలని, లేని పక్షంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వార్డెన్లను హెచ్చరించారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వార్లు ఆ నగదు ఆయనకు ఇచ్చేందుకు బుధవారం కంచిలి బీసీ వసతి గృహం వద్ద సమావేశం అయ్యారు. ఈ సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, వార్డెన్లు సిద్ధం చేసిన రూ.1,84,070 స్వాధీనం చేసుకున్నారు. ఏబీసీడబ్ల్యూవోపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ ఇన్‌చార్జి డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బారామతిలో విషాదం

మహారాష్ట్ర రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలపాటు కీలకభూమిక నిర్వహించిన ప్రస్తుత ఆ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమానప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. తనకు రాజకీయ జన్మనిచ్చి, దశాబ్దాలుగా వెన్నంటివున్న బారామతిలోనే ఆయన అకాలమరణం పొందారు. రెండుసార్లు ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోసం ప్రయత్నించి, చివరకు కుప్పకూలిన లియర్‌జెట్ 45 మోడల్ చార్టర్ విమానంలో ఎలాంటి సాంకేతిక, నిర్వహణ లోపాలూ లేవని సదరు కంపెనీ యజమాని చెబుతూంటే, ఈ మరణంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ డిమాండ్ చేస్తున్నారు. బీజేపీని వీడాలని అజిత్‌పవార్ ఆలోచిస్తున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగిందని వ్యాఖ్యానించడం ద్వారా ఈ మరణంలో కుట్రకోణం ఉందని ఆమె అనదల్చుకున్నారు. దట్టమైన పొగమంచు కమ్మేసి, ఏమీ కానరాని వాతావరణమే ఈ ప్రమాదానికి కారణమని పౌరవిమానయాన శాఖ అంటోంది.

పినతండ్రి శరద్‌పవార్ రాజకీయనీడలో ఎదిగి, రెండున్నరేళ్ళక్రితమే ఆ నీడనుంచి బయటపడిన అజిత్‌పవార్ ఇంకా ఎత్తుకు ఎదిగే శక్తిసామర్థ్యాలు ఉండికూడా విధివక్రీకరించింది. పదిహేనేళ్లలో ఆరుసార్లు ఉప ముఖ్యమంత్రి అయిన ఆయన నిక్కచ్చితనం, దూకుడు, క్షణాల్లో నిర్ణయాలు చేయగల సమర్థతల గురించి సన్నిహితులు గర్వంగా చెబుతుంటారు. పార్టీమీద ఆయనకున్న పట్టు, కార్యకర్తలతో సాన్నిహిత్యం, భారీ సభలూ సమావేశాల నిర్వహణాశక్తి ఇత్యాది సమర్థతల కారణంగా శరద్‌పవార్ ఈయనమీదే ఎక్కువగా ఆధారపడేవారు. బాబాయ్‌మీద తిరుగుబాటుచేసి, పార్టీని నిలువునా చీల్చి శత్రువులతో చేయికలపడానికి ఉపకరించినవి కూడా ఈ లక్షణాలే. ఇతడిని నమ్ముకొని అంతమంది ఎమ్మెల్యేలు రాజకీయదురంధరుడైన శరద్‌పవార్ మీద తిరుగుబాటు చేయడం అబ్బాయ్ వ్యూహరచనకు, సమర్థతకు నిదర్శనం. ముప్పయ్యేళ్ళక్రితం బాబాయ్ కోసం బారామతి లోక్‌సభ స్థానాన్ని త్యాగం చేసిన అజిత్‌పవార్, అదేచోట బాబాయ్‌ని ఓడించేంత శక్తిమంతుడుగా ఎదిగిపోయాడు.

పెద్దాయనకు విధేయత ప్రకటించడంలోనూ, ధిక్కరిస్తున్నట్టుగా కనిపించడంలోనూ, నేతకు సన్నిహిత దారాలను చూపడంలోనూ అజిత్ అందెవేసిన చెయ్యి. 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాత చిన్నాన్నతో విభేదించి, దేవేంద్రఫడ్నవీస్‌తో చేయికలపడం, కేవలం ఎనభైగంటలు ఉపముఖ్యమంత్రిగా ఉండి, ఆ ప్రభుత్వం మెజారిటీ లేక కుప్పకూలగానే తిరిగి సొంతగూటికి చేరుకోవడం అజిత్‌కు మాత్రమే సాధ్యం. అన్నకొడుకు కనుక అంత అవమానించినా, పెద్దాయన వెనక్కు రానిచ్చారన్నది ఎంత నిజమో, అజిత్ శక్తిసామర్థ్యాలు ఆయనకు అవసరమన్నది అంతే నిజం. అంతేనా, ఉద్ధవ్‌థాక్రే నేతృత్వంలో ఏర్పడిన మహావికాస్ అఘాడీ ప్రభుత్వంలో ఎన్సీపీ భాగస్వామిగా అజిత్ మళ్ళీ అదే పదవి పొందగలిగారు. రెండున్నరేళ్ళలోనే ఉద్ధవ్ ప్రభుత్వం కూలినా, బాబాయ్‌తో విభేదించి, ఈసారి మహాయుతితో చేరి అజిత్ మళ్ళీ అదే పదవిని అలంకరించారు. శిందే ఏలుబడిలోనూ, ఫడ్నవీస్ పాలనలోనూ నెంబర్ టూ గానే ఉండిపోయిన అజిత్‌పవార్, సీఎం కావాలన్న దశాబ్దాల ఆరాటమైనా నెరవేర్చుకోగల సమర్థుడని ఎన్సీపీలో ప్రతికార్యకర్తకూ తెలుసు. పవార్‌ల మధ్య విభేదాలు శుద్ధ అబద్ధాలనీ, బాబాయ్–అబ్బాయ్ కలిసి రాజకీయం చేస్తారని కొందరివాదన. తనకుమార్తెను రాజకీయాల్లోకి తెచ్చి అజిత్‌ను నిలువరించడానికి శరద్‌పవార్ ఒకదశలో ప్రయత్నించిన మాట నిజమేనని మరికొందరంటారు.

అజిత్‌పవార్ నేతృత్వంలోని చీలికవర్గాన్నే అసలు ఎన్సీపీగా ఎన్నికల సంఘం గుర్తిస్తే, 2024నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ పవార్ కంటే ఈ జూనియర్ పవార్‌నే మహారాష్ట్ర ప్రజలు నాలుగురెట్లు అధికస్థానాలు ఇచ్చి ఆదరించారు. ఇకపై అజిత్‌లేని ఆయన 'మన్' అలాగే నిలుస్తుందా లేక పెద్దాయన పంచనచేరిపోతుందా, ఫడ్నవీస్ ప్రభుత్వానికి కష్టకాలం వచ్చినట్టేనా, అజిత్‌స్థానాన్ని ఆయన వారసులకు ఇచ్చి జాగ్రత్తపడుతుందా, ఏక్‌నాథ్ ఏకుమేకుకాకుండా అజిత్‌ను చేర్చుకున్న బీజేపీ ఇకపై శిందే తలెగరేయకుండా నిలువరించగలదా? అనేకానేక [illegible] పక్షంలో మీడియా మారుమోగిపోతోంది. పలు నాటకీయ పరిణామాలు, రాజకీయ తిరుగుబాట్లు, కుట్రలూ కుంభకోణాలతో సాగిన అజిత్‌పవార్ నాలుగుదశాబ్దాల రాజకీయ జీవితం, మరింత భవిష్యత్తు మిగిలివుండగా హఠాత్తుగా ముగిసిపోవడం అత్యంత విషాదం.

ట్రంప్ కోటకు వర్జీనియాలో బీటలు!

అమెరికాలోని వర్జీనియా రాష్ట్రానికి తొలి మహిళా గవర్నర్‌గా ఎన్నికైన అబిగెయిల్ స్పాన్‌బెర్గర్ ప్రమాణ స్వీకార వేడుక ఒక చరిత్రాత్మక ఘట్టం. జనవరి 17న చిరుజల్లుల మధ్య జరిగిన ఈ వేడుకలో స్పాన్‌బెర్గర్ ధరించిన తెల్లటి దుస్తులు ఒక ఫ్యాషన్ ఎంపిక కాదు, దశాబ్దాల క్రితం మహిళలకు ఓటు హక్కు కోసం పోరాడిన 'సఫ్రేజెట్' ఉద్యమానికి ఆమె ఇచ్చిన ఘనమైన నివాళి. 1952 వరకు మహిళలకు ఓటు హక్కు కల్పించని రాష్ట్ర చరిత్రను తిరగరాస్తూ, నేడు మహిళా గవర్నర్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు.

గవర్నరు ఎన్నికలో స్పాన్‌బెర్గర్ విజయం అసామాన్యమైనది. వాషింగ్టన్ డి.సి.లో రిపబ్లికన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలో ఉండగా, పొరుగునే ఉన్న వర్జీనియాలో డెమొక్రాట్లు అధికారాన్ని హస్తగతం చేసుకోవడం విశేషమే. ట్రంప్ దూకుడు రాజకీయాలు, ప్రభుత్వ ఉద్యోగుల కోతలు, పెరుగుతున్న ధరలు, ఆరోగ్య వ్యవస్థలో అనిశ్చితి వంటి అంశాలను స్పాన్‌బెర్గర్ తన ప్రచారాస్త్రాలుగా మార్చుకున్నారు. ఒక మాజీ సీఐఏ అధికారిగా, మూడుసార్లు కాంగ్రెస్ సభ్యురాలిగా పనిచేసిన అనుభవం ఆమెకు పనికొచ్చింది. జాతీయ భద్రత, ఆర్థిక అంశాలపై ఆమెకున్న పట్టు మధ్యేవాద ఓటర్లను కూడా ఆమె వైపు తిప్పుకుంది. "వాషింగ్టన్ నుంచి వస్తున్న అనాలోచిత నిర్ణయాల నుంచి వర్జీనియా ఆర్థిక వ్యవస్థను కాపాడతాను" అన్న ఆమె నినాదం ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంది. తన



ప్రమాణస్వీకార ప్రసంగంలో స్పాన్‌బెర్గర్ కేంద్రంలోని ట్రంప్ ప్రభుత్వంపై పదునైన విమర్శలు చేశారు. సివిల్ సర్వీస్ వ్యవస్థను దెబ్బతీయడం, పెరుగుతున్న ధరలు, ఆరోగ్య వ్యవస్థలో అనిశ్చితిపై ఆమె యుద్ధం ప్రకటించారు. "వర్జీనియా జీవితాలపై రాజులు లేదా ఒలిగార్క్‌లు శాసించలేరు, ఇక్కడి ప్రజలే నిర్ణయిస్తారు" అని ఆమె అన్న మాటలు ట్రంప్ విధానాలకు సవాల్ విసిరాయి. భారత సంతతికి చెందిన గజాలా హష్మి పాత్ర ఈ ఎన్నికల్లో మరువలేనిది. హైదరాబాద్ లోని మలక్‌పేటలో జన్మించిన ఆమె, ఖురాన్ మీద ప్రమాణం చేసి వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. అమెరికా చరిత్రలోనే ఈ పదవిని చేపట్టిన తొలి ముస్లిం మహిళగా రికార్డు సృష్టించారు. 30ఏళ్ల పాటు ప్రొఫెసర్‌గా పనిచేసిన గజాలా, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి ఈ స్థాయికి చేరుకున్నారు. ఆమె విజయం వలసదారులకు, ముఖ్యంగా తెలుగువారికి గర్వకారణం. అలాగే నాడు బానిసత్వానికి కేంద్రంగా ఉన్న వర్జీనియాలో, నేడు తొలి నల్లజాతీయుడైన జే జోన్స్ అటార్నీ జనరల్‌గా బాధ్యతలు చేపట్టడం ఒక సామాజిక విప్లవం. స్పాన్‌బెర్గర్, హష్మి, జోన్స్‌ల బృందం వర్జీనియాలోని బహుళత్వాన్ని ప్రతిబింబిస్తోంది. రిపబ్లికన్ల పాలనలో గత నాలుగేళ్లు కొనసాగిన విభజన రాజకీయాలకు స్వస్తి పలికి, ఐక్యతతో కూడిన పాలనను అందిస్తామని ఈ బృందం చాటిచెప్పింది. అధికారం చేపట్టిన కొద్ది గంటల్లోనే స్పాన్‌బెర్గర్ సామాన్యులపై ఆర్థిక భారాన్ని తగ్గించేలా, విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేసేలా 10 కీలక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకం చేశారు. వలసదారులను ఇబ్బంది పెట్టే పాత ప్రభుత్వ నిర్ణయాలను రద్దు చేస్తూ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. స్థానిక పోలీసులు వలస చట్టాల అమలు కోసం సమయాన్ని వృథా చేయకూడదని, ప్రజల భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె స్పష్టం చేశారు. విద్యా బోర్డుల్లో మార్పులు చేస్తూ యువతకు పెద్దపీట వేశారు. స్పాన్‌బెర్గర్ విజయం వర్జీనియా రాష్ట్రానికే పరిమితం కాకుండా ఈ ఏడాదిలో జరగబోయే అమెరికా మధ్యంతర ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

– కృష్ణ కానూరి

కేంద్ర బడ్జెట్‌లో చేనేతకు చోటు లేదా?

భారతదేశంలోని గ్రామీణ కుటీర పరిశ్రమల ప్రాముఖ్యత ఎంత చెప్పుకున్నా తక్కువే. నాలుగవ ఇండియన్ హ్యాండ్లూమ్ సెన్సెస్–2020 ప్రకారం దేశవ్యాప్తంగా 35.22 లక్షల కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి. మొత్తం 68.86 లక్షల చేనేత కార్మికులు ఈ రంగంలో పనిచేస్తున్నారు. వీరిలో స్త్రీలు 38.61 లక్షలు, పురుషులు 30.25 లక్షల మంది పనిచేస్తున్నారు. వీరిలో ఎస్సీలు 13.8శాతం, ఎస్టీలు 17.8శాతం, ఓబీసీలు 36శాతం, ఇతరులు 32.4శాతం ఉన్నారు. ముస్లింలు, క్రైస్తవులు చెప్పుకోదగిన సంఖ్యలో జీవనోపాధి పొందుతున్నారు. వీరిలో 90 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్నారు. వీరి నెలసరి ఆదాయం చాలా తక్కువగా ఉంది. ఐదువేల రూపాయల కన్నా తక్కువ ఆదాయం పొందుతున్న వారు 67శాతం కాగా, పదివేల లోపు ఆదాయం పొందుతున్న వారు 26శాతం మాత్రమే. 15 వేల లోపు ఆదాయం పొందుతున్న వారు కేవలం 4.5శాతం కాగా, 15000 రూపాయల పైన ఆదాయం పొందుతున్న వారు రెండు శాతం మాత్రమే. టెక్స్‌టైల్ మినిస్ట్రీ లెక్కల ప్రకారం చేనేత కార్మి



కులకు సంవత్సరంలో 274 రోజులు పని దినాలు లభిస్తున్నాయని అంచనా. అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉపాధి పొందుతున్న రంగాలలో చేనేత ఒకటి. నేడు ఉపాధి కల్పన పేరుతో ఒక్కో ఉపాధికి కోట్లాది రూపాయలు సబ్సిడీల రూపంలో వెచ్చిస్తున్న కేంద్ర ప్రభుత్వం చేనేత రంగం అభివృద్ధికి సంక్షేమానికి సరైన రీతిలో ప్రోత్సాహాలు కల్పించడం లేదు.

ఉపాధి రంగంగా నిలుస్తున్న చేనేతకు రాను రాను బడ్జెట్ కేటాయింపులు తగ్గుతున్నాయి. 2013–14 జాతీయ బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.493కోట్లు కేటాయిస్తే, 2025–26 బడ్జెట్‌లో రూ.200కోట్లు మాత్రమే కేటాయించారు. 2013–14 మొత్తం జాతీయ బడ్జెట్ రూ.14.90 లక్షల కోట్లు కాగా 2025–26 నాటికి అది రూ.50.65 లక్షల కోట్లకు పెరిగింది. మూడింతలు పెరిగిన బడ్జెట్ ప్రకారం మరి చేనేత రంగానికి కనీసం రూ.1479కోట్లు కేటాయించాలి కానీ అలా జరగలేదు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ప్రకారం చేనేత రంగానికి కనీసం ఒక్కో కార్మికునికి సగటున రూ.1519 చొప్పున రూ.1070కోట్లు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. 2025–26 బడ్జెట్‌లో ఒక్కో కార్మికునికి ఏడాదికి కేవలం రూ.290 మాత్రమే కేటాయించారంటే చేనేత రంగం పట్ల భారత ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నదో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో చేనేత కార్మికుని పైన ఏటా రూ.715 కేటాయించేది.

మొత్తం టెక్స్‌టైల్ బడ్జెట్‌లో సైతం చేనేత రంగాన్ని విస్మరిస్తున్నారు. 2013–14లో మొత్తం టెక్స్‌టైల్ బడ్జెట్ రూ.3915కోట్లు కాగా, అందులో 15.7 శాతం రూ.493కోట్లు చేనేత రంగానికి కేటాయించారు. 2025–26లో టెక్స్‌టైల్ బడ్జెట్ రూ.5272 కోట్లు కాగా, అందులో కేవలం 3.9శాతం అంటే 200 కోట్లు చేనేత రంగానికి కేటాయించారు! ఇది చాలా దారుణమైన తగ్గింపు. ఒకవైపు వికసిత భారత్ అని ప్రచారం చేస్తూ మరోవైపు చిన్న పరిశ్రమలను నిర్లక్ష్యం చేయడం సమంజసమా?

– **తడక యాదగిరి**, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఓయూ

భారత్ ఈయూ ఒప్పందం ఉభయతారకం

భారత్, యూరోపియన్ యూనియన్ నడుమ తాజాగా కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అన్ని విధాలా ఘనం.. ఉభయ తారకం. మన ప్రధాని వర్ణించినట్టు ఇది అన్ని ఒప్పందాలకు తల్లి లాంటిదే. మిత్ర, శత్రు భేదం చూపించకుండా అమెరికా అందరినీ తన సుంకాల పెంపు తర్జన చూపించిన నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యం కుదుపునకు లోనైంది. అందుకు భారత్, ఈయూ కూడా మినహాయింపేమీ కాదు. ఈ స్థితిలో మూలపడి ఉన్న ద్వైపాక్షిక ఒప్పందాలకు బూజు దులిపి క్రియాశీలకం చేయడం అవసరమయింది. ప్రపంచ జీడీపీలో 25 శాతం కలిగిన ఈ భాగస్వాములూ తమ తమ సుంకాల్ని దశలవారీగా దాదాపు ఎత్తివేయడం వల్ల లాభం పొందుతాయి. ఈ ఒప్పందం శీఘ్రంగా కార్యరూపం దాల్చాలని ఆశిద్దాం.

– **డా. డి.వి.జి. శంకర రావు**

గణ రాజ్యమా? గణతంత్రమా?

భారత రాజ్యాంగం మన రిపబ్లిక్‌ను గణ రాజ్యంగా పేర్కొంది. భారత పౌరుల పాస్‌పోర్ట్‌లో కూడా గణరాజ్యం అనే ఉంటుంది. అయితే మన రిపబ్లిక్ డే (జనవరి 26)ను అధికారికంగా భారత గణతంత్ర దినోత్సవంగా పిలవడం ఆనవాయితీగా ఉంది. ఇదొక చిన్న వ్యత్యాసం మాత్రమేనని మీరు భావించవచ్చు. బహుశా, అజాగ్రత్త వల్ల సంభవించిన అనాలోచిత తప్పిదంగా మీరు ఉపేక్షిస్తుండవచ్చు. ఒక సూక్ష్మమైన తేడాగా మీరు పరిగణిస్తుండవచ్చు. మన ప్రజాస్వామ్య వర్తమానం, భవితవ్యం గురించి నేను హిందీలో రాసిన పుస్తకం శీర్షిక 'గణరాజ్య కా స్వధర్మ్'. ఆ శీర్షిక 'గణతంత్ర కా స్వధర్మ్'గా ఉండాలని ప్రచురణకర్త ప్రతిపాదించారు. అయితే నేను పెట్టిన శీర్షికను మార్చవద్దని గట్టిగా చెప్పినప్పుడు ఆయన అభిప్రాయాలు పైన ప్రస్తావితమయినట్టుగా ఉన్నాయని నాకు అర్థమయింది.



■ యోగేంద్ర యాదవ్

ఇది చాలా చిన్న తేడాగా కనిపిస్తుండవచ్చు గానీ ఆ స్వల్ప భేదాన్ని లోతుగా శోధించవలసి ఉన్నది. ఎందుకంటే గణతంత్రం, గణరాజ్యం అనేవి రెండు విభిన్న భావనలు. ఆ రెండిటికీ ఆంగ్లంలో ఒకే ఒక్క పదం ఉన్నది. ఆ మాట 'రిపబ్లిక్'. బాగా సుపరిచితమైన, ఆధిపత్య భావన అయిన గణతంత్రం నుంచి గణరాజ్యం భావనను వేరు చేయవలసిన అవసరమున్నది. అలా వేరు చేసినప్పుడే గణరాజ్యం భావనలో ఉన్న విశిష్ట అర్థాలను విశదం చేసుకోగలుగుతాము. మరీ ముఖ్యంగా మన గణరాజ్యం భావన కోల్పోయిన ఆ అర్థాలను మనం తిరిగి సాధించుకోగలుగుతాము. తద్వారా ఇప్పుడు మన ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కోగలుగుతాము. భారత గణ రాజ్యాన్ని సమున్నతం చేసుకునేందుకు ఇది అత్యవసరం..

నేడు వాడుకలో ఉన్న ఈ రెండు పదాలలో ఒకటి తప్పు అని నేను సూచించడం లేదు. ఈ రోజుల్లోని నాయకుల వలే కాకుండా మన రాజ్యాంగ నిర్మాతలు, మన రిపబ్లిక్ తొలి సంరక్షకులు తాము ఉపయోగించే పదాల విషయంలో చాలా జాగ్రత్తగా, వివేచనాయుతంగా ఉండేవారు. జనవరి 26ను గణరాజ్య దినోత్సవంగా కాకుండా గణతంత్ర దినోత్సవంగా వారు పిలవడానికి సహేతుకమైన కారణాలు ఉండివుంటాయి. ఆ రెండు పదాలలో ఒకటి రెండో దాని కంటే మరింత ప్రామాణికమైనదని నేను చెప్పడం లేదు. నిజానికి గణతంత్రం, గణ రాజ్యం అనే పదాలు ఇటీవలి కాలానివి (19 లేదా 20వ శతాబ్దానివి)అని సంస్కృత భాషా కోవిదులు చెబుతుంటారు. పురాతన భారతదేశంలో రిపబ్లిక్‌లను 'గణరాజ్య' లేదా 'గణతంత్ర' అని కాకుండా 'గణ' లేదా 'సంఘ' అని మాత్రమే పిలిచేవారు. ఈ పదాలకు చారిత్రక వాస్తవాలు అయిన ప్రాచీన భారత 'గణాల'కు మధ్య ఒక ప్రత్యక్ష సంబంధమున్నదని నేను వాదించడం లేదు. ఆ పురాతన రాజకీయ నిర్మాణాలను ఆధునిక ప్రజాస్వామిక గణ రాజ్యాలతో పోల్చవద్దని చరిత్రకారులు హెచ్చరిస్తున్నారు. బుద్ధుడి కాలంలోని వైశాలి, లిచ్ఛవీ గణ రాజ్యాలు వంశపారంపర్య కులీన పాలనా వ్యవస్థలే గానీ మనం అర్థం చేసుకునే ఆధునిక ప్రజాస్వామ్యాలు కానే కావు. చెప్పవచ్చినదేమిటంటే గణతంత్రం, గణరాజ్యం భావనల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి, వాటి ప్రత్యేకతలను, అవి పురిగొల్పే భిన్న రాజకీయ సంభావ్యతలను అర్థం చేసుకుని, మన ప్రజాస్వామ్య వర్తమాన సమస్యలను అధిగమించేందుకు స్ఫూర్తి పొందాలి.

గణతంత్రం అనేది ఒక రిపబ్లిక్‌కు ఉన్న ప్రతికూల, సంకుచిత అర్థాన్ని సూచిస్తుంది. రాజ్యాధిపతిగా ఉండే వ్యక్తి జన్మహక్కు ద్వారా నిర్ణయింపబడని ప్రభుత్వ వ్యవస్థ ఉన్న దేశం గణతంత్ర రాజ్యమని రాజనీతి శాస్త్ర పాఠ్యగ్రంథాలు మనకు చెబుతాయి. బ్రిటన్‌ను రాజు/ రాణి పరిపాలిస్తుంటారు. కనుక అది రిపబ్లిక్ కాదు. నేపాల్ రాచరికాన్ని రద్దు చేసింది. అది ఇప్పుడు ఒక రిపబ్లిక్. చాలా తక్కువగా ఉన్న నామమాత్ర రాచరికాలను మినహాయిస్తే ఇప్పుడు ప్రతి దేశమూ ఒక ప్రజాస్వామిక లేదా మరో తరహా రిపబ్లిక్‌గా ఉన్నది. గణతంత్రను కొన్నిసార్లు ఒక విశాల అర్థంలో వాడుతుంటారు. కేవలం రాచరికం లేకపోవడం అనే రాజకీయ వాస్తవాన్నే కాకుండా ప్రజా సార్వభౌమత్వ వ్యవస్థను సూచించేందుకు కూడా దాన్ని ఉపయోగిస్తారు. ప్రజా సార్వభౌమత్వానికి ప్రాతిపదిక అయిన ఎన్నికల ప్రజాస్వామ్య సంస్థాగత నిర్మాణాలను వివరించేందుకు గణతంత్ర భావనను ఉపయోగిస్తారు. ఈ విశాల అర్థంలో గణతంత్ర, లోక్‌తంత్ర లేదా ఎన్నికల ప్రజాస్వామ్యానికి ఒక పర్యాయపదం. అయితే ఇదొక అలంకారిక వ్యక్తీకరణగా మిగిలిపోతోంది. మన రాజకీయ భావనాశక్తి వికాసానికి దోహదం చేసేదిగా ఉండడం లేదు.

గణతంత్రకు భిన్నంగా గణరాజ్యం మనలను ఒక రిపబ్లిక్ భావనలో ఉన్న సానుకూల, అభ్యుదయాత్మక భావాలు, ఆశయాలకు తీసుకువెళ్తుంది.

> భారత్ భావనే భారత గణ రాజ్య స్వధర్మం. ఇప్పుడు మనకు వాటిల్లుతోన్న ప్రమాదాలు భారత ప్రజాస్వామ్య తిరోగమనం, భారత రాజ్యాంగాన్ని ఛిన్నాభిన్నం చేసే ప్రయత్నాలే. ఇవి మన గణరాజ్యం స్వధర్మం అంటే భారత్ భావనపై జరుగుతోన్న ఎడతెగని దాడి. ఈ పరిస్థితుల్లో మన గణ రాజ్య విశిష్ట స్వధర్మాన్ని సంరక్షించుకోవడమే మన అనుదిన కర్తవ్యం కావాలి.

ఈ ప్రకారం గణరాజ్యం ఒక సాధారణ రాజకీయ వ్యవస్థ. ఈ వ్యవస్థలో సంఘం అంటే కేవలం వ్యక్తుల సముదాయం కాదు, సమానుల సమాజం. తమ సమష్టి వ్యవహారాల నిర్వహణకు స్వంత నిబంధనలను, ఒక విశిష్ట ధర్మాన్ని రూపొందించుకునే సమానుల సమాజం. పౌర ధర్మాలను పెంపొందించడం ద్వారా అది ఆ విశిష్ట ధర్మాన్ని స్థిరపరుస్తుంది. పాలకులను జవాబుదారీగా చేయడం ద్వారా ప్రజలు సమష్టి సంకల్పంతో ఆ ధర్మాన్ని అమలు పరుస్తారు. ప్రజలు కేవలం అధికారానికి మూలం



మాత్రమే కాదు, దాన్ని సక్రమంగా ఉపయోగించేలా నియంత్రించే, ప్రభావితం చేసే శక్తులు కూడా. పౌర ధర్మం, స్వపరిపాలన, ఏకపక్ష అధికారం నుంచి స్వేచ్ఛ సమానుల సమాజం లక్ష్యంగా ఉంటుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజా సార్వభౌమాధికారమే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. యూరోపియన్ 'రిపబ్లికనిజం' సంప్రదాయాలు ప్రజా సార్వభౌమత్వానికి నిబద్ధమైనవి. ఇటీవలి సంవత్సరాలలో పాశ్చాత్య రాజనీతి చింతనలో ఒక మౌలిక మార్పు చోటుచేసుకున్నది. దీని ప్రకారం గణరాజ్యం అంటే రాజరికం లేకపోవడం మాత్రమే కాదు, ఎలాంటి ఆధిపత్యాలు లేని వ్యవస్థ. క్రియాశీల పౌరసత్వానికి ప్రాధాన్యమిస్తూ ఆధిపత్యం లేని స్వేచ్ఛ వర్ధిల్లేదే గణరాజ్యం అని ఈ నవీన రాజకీయ చింతన స్పష్టం చేసింది.

గణరాజ్యం గురించిన ఈ పాశ్చాత్య భావనే భారత జాతీయోద్యమం సమర్థించిన గణరాజ్య భావన కూడా. అధికారం ఒక వ్యక్తిలో కేంద్రీకృతం కాకుండా సమాన భాగస్వాముల మధ్య పంచుకోబడే భాగస్వామ్య సార్వభౌమత్వాన్ని సూచించే పురాతన పాళీ వ్యక్తీకరణ 'సమన్న– రాజ్య' ఈ నవీన గణరాజ్య భావనకు సన్నిహితంగా ఉన్నది. ఆధునిక వాడుకలో మన 'జన్– గణ్– మన్' భారతీయ గణరాజ్య భావనా స్ఫూర్తిని వ్యక్తీకరిస్తుంది. జన్ అంటే ప్రజలు– సార్వభౌమత్వాధికారానికి మూలాధారాలు. ప్రతి ఒక్కరూ సమానులుగా నిర్ణయాలు తీసుకునే ఒక రాజకీయ సమాజంగా ప్రజలు సంఘటితమవడం 'గణ్'కు అవసరం. 'మన్' అనేది సామూహిక నైతిక మనస్సాక్షి. ఇది కేవలం ఒక నిర్దిష్ట సమయంలో ప్రచలితంగా ఉండే ప్రజాభిప్రాయం మాత్రమే కాకుండా ప్రజలు అన్ని వేళలా ఆమోదించి అనుసరించే నైతిక ఆదర్శాలను తెలియజేస్తుంది. ఇవి భారత రాజ్యాంగ విశిష్టతను వెల్లడిస్తాయి.

ఈ భారతీయ గణరాజ్య భావన అనివార్యంగా ఒక ప్రశ్నకు దారితీస్తోంది: భారత్ గణరాజ్యాన్ని (రిపబ్లిక్ ఆఫ్ ఇండియా) విశిష్టంగా తీర్చిదిద్దుతున్న నైతిక ఆదర్శాలు ఏమిటి? ఈ ప్రశ్నకు సమాధానం భారత రాజ్యాంగ పీఠిక. ప్రాచీన భారతీయ నాగరికతా విలువలను ఆధునిక రాజ్యాంగ సూత్రాలతో కలగలిపి భారత గణరాజ్యం ఒక శక్తిమంతమైన, వైవిధ్యమైన, సమ్మిళిత ప్రజాస్వామ్యంగా ఉండేలా మన రాజ్యాంగ పీఠిక నిర్దేశించింది. అయితే భారత రాజ్యాంగం ఇప్పుడు పలు విధాలా తీవ్ర దాడులకు గురవుతున్న వాస్తవాన్ని విస్మరించలేము, విస్మరించకూడదు. భారత రాజ్యాంగ విలువలను మనం ఎందుకు విశ్వసించాలి? అన్న ప్రశ్నను మనకు మనం వేసుకోవాలి. ఈ ప్రశ్నకు సమాధానం రాజ్యాంగసభ చర్చలు, సమాలోచనల ఆవలకు వెళుతుంది. ఎందుకంటే మన రాజ్యాంగం కేవలం 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులలో లిఖితమైనది కాదు. అది కనీసం వంద సంవత్సరాలుగా జరిగిన జాతి నిర్మాణ ప్రయత్నాల పరాకాష్ఠ. స్వాతంత్ర్య పోరాటాలు, శాసన ప్రయోగాలు, భారత రాజ్య స్వభావం గురించి జాతీయోద్యమ నాయకుల మేధోమథనం సమష్టి ఫలితమది. బ్రిటిష్ వలసపాలన నుంచి భారత్‌కు స్వాతంత్ర్యాన్ని సాధించడం మాత్రమే భారత జాతీయోద్యమ ధ్యేయం కాదు. పురానవ దేశమైన భారత్‌ను సమగ్రంగా పునర్నిర్మించడమే మన జాతీయోద్యమ సమున్నత లక్ష్యం. భారత జాతీయవాదం యూరోపియన్ జాతీయవాద సంప్రదాయాలకు అనుకరణ కాదు. భారతీయ నాగరికత వారసత్వం, పాశ్చాత్య ఆధునికతల సమన్వయ పరిణామమది. ఈ సమన్వయంలో సామరస్యమూ ఉన్నది, సంఘర్షణా ఉన్నది.

గణరాజ్య భావనకు ప్రాతిపదికగా ఉన్న నైతిక ఆదర్శాలు మన రిపబ్లిక్ స్వధర్మ (స్వభావం)ను వెల్లడించేందుకు మనలను పురిగొల్పుతాయి. ఈ స్వధర్మం తరచూ ఉటంకించబడే 'భారత్ భావన' అని చెప్పి తీరాలి. ఇది మనలను ఒక కఠోర నిర్ధారణకు వచ్చేలా చేస్తోంది: ఇప్పుడు మనం ఎదుర్కొంటున్నది భారత ప్రజాస్వామ్య తిరోగమనం, భారత రాజ్యాంగాన్ని ఛిన్నాభిన్నం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు మాత్రమే కాదు. మన గణరాజ్యం స్వధర్మం అంటే భారత్ భావనపై జరుగుతున్న ఎడతెగని దాడి. మన గణరాజ్య స్వధర్మాన్ని సంరక్షించుకోవడమే మన అనుదిన కర్తవ్యం కావాలి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

చర్చలతోనే జల సమస్యల పరిష్కారం

తెలంగాణ ప్రభుత్వానికి ట్రిబ్యునల్–1 ప్రకారం, వారి కృష్ణా జలాల వాటా ఎంతో, ఇప్పుడు ట్రిబ్యునల్–2 ముందు వారి అవసరాలకు ఎన్ని జలాలు అవసరమో ఇంకా స్పష్టత కొరవడినట్టుగా గోచరిస్తోంది. పైగా గందరగోళం రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. తాజాగా వారి వాటా బచావత్ ట్రిబ్యునల్ వెలువరించిన తీర్పు ప్రకారం, 299 టీఎంసీలకు అదనంగా, 490 టీఎంసీలు అంటున్నారు. 555 టీఎంసీలు అవసరమని ట్రిబ్యునల్–2 ముందు విన్నవించుకున్నట్టు చెబుతున్నారు. ఈ సంఖ్య ఏ విధంగా లెక్క కడితే వస్తుందో ఎవరూ చెప్పలేరు. తెలంగాణ ట్రిబ్యునల్–2 ముందు మొదటగా వారి అవసరాలు 599 టీఎంసీలు నికర వినియోగంగా చూపించారు. ప్రభుత్వం మారాక దీనిని 763 టీఎంసీలుగా మార్చారు. ట్రిబ్యునల్ ముందు తెలంగాణ తుదివాదనలు పూర్తయిపోయాయి. తమ తుది వాదనలు పూర్తయ్యాక కూడా వారి వాటాలపై స్పష్టత రాకపోవడం విడ్డూరమనిపించదా? ఇంకా వేర్వేరు వ్యాఖ్యలు వినిపించవలసిన అవసరం ఏముంది?

న్యాయస్థానాలు తమ తీర్పులను అమలులో ఉన్న చట్టాల ఆధారంగా ఇస్తాయి. భావావేశాలు, మనోభావాలు, విశ్వాసాల ఆధారంగా పరిష్కరించవు. బచావత్ ట్రిబ్యునల్ నీటి వాటాలను ఏ ప్రాతిపదికన నిర్ణయించాలి అన్న అంశంపై విస్తృత అధ్యయనం చేసి వాటిని సుదీర్ఘంగా వివరించి తీర్పు చెప్పింది. మొట్టమొదటిగా విచారణ సమయానికి వినియోగంలో ఉన్న ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యాన్ని ఇచ్చింది. అప్పటికే ఆ ప్రాజెక్టుల వినియోగంలో ఉన్న ఆయకట్టు అవసరాలను దృష్టిలో ఉంచుకోకపోతే ఆ ప్రాంతాల్లో స్థిరపడిన ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అవుతుందని అది సమంజసం కాదని చెప్పింది. ఈ కోవలోనే కృష్ణా డెల్టాకు సింహభాగంగా 181.2 టీఎంసీలు, కేసీ కెనాల్‌కు 39.9 టీఎంసీలు లభించాయి. 1970 నాటికి నాగార్జునసాగర్ నిర్మాణం కీలక దశకు చేరుకొని పాక్షికంగా అమలులోకి రావటంతో ఆ ప్రాజెక్టు అవసరాలకు 281 టీఎంసీలకు కూడా ప్రాధాన్యం ఇచ్చింది. ఇందులో తెలంగాణ వాటాగా 99 టీఎంసీలు ఉన్నాయి. తెలంగాణ నీటి అవసరాలను అప్పటి ఆంధ్రప్రదేశ్ సమర్థవంతంగా సమర్పించలేదన్న వాదన సమర్థనీయం కాదని ప్రస్తుత ట్రిబ్యునల్ 2016లో చెప్పింది. ఇది రాజకీయ ఆరోపణే కానీ, ఏ చట్టాన్ని అతిక్రమించినది కాదు. తెలంగాణ నాయకుల ఇప్పటి వాదనలలో, ప్రకటనలలో, వివరణలలో ఏ సందర్భంలోనూ ఫలానా చట్టంలోని ఫలానా సెక్షన్ ఉల్లంఘన జరిగినట్లు ఆధారాలు ఉటంకించటం లేదు. అన్నీ రాజకీయ ప్రేరేపణ ఆధారితాలే. అమలులోకి రాని ట్రిబ్యునల్–2, 2013లో చేసిన కేటాయింపులు కూడా మొత్తం వారికి స్వీయ సమర్పణ చేసుకుంటున్నారు. సెక్షన్–3, ప్రాతిపదికన విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వ లేఖను పేర్కొంటూ, దీని ప్రకారం బచావత్ తీర్మానించిన 811 టీఎంసీల కేటాయింపును రద్దుగా భావించాలని వాదిస్తోంది. అంటే బచావత్ తీర్పులో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేటాయింపులు మాత్రం పాక్షికంగా రద్దు అని వాదన. ఒక కార్యనిర్వాహక ఆదేశం ఒక చట్టాన్ని ఒక రాష్ట్రానికి అనుకూలంగా ఇంకొక రాష్ట్రానికి విరుద్ధంగా, పాక్షికంగా రద్దు చేయటాన్ని ఏ న్యాయస్థానమైనా సమర్థిస్తుందా? ఎటు చూసినా 2002 సవరణ చట్టంలోని నాలుగవ నిబంధన ప్రకారం గానీ, 2014 రాష్ట్ర విభజన చట్టం ప్రకారం గానీ బచావత్ కేటాయింపులు మారే అవకాశాలు లేనే లేవు. మరి తెలంగాణ నాయకులు ఊహిస్తున్నట్లుగా కేటాయింపులలో సమూల మార్పులు జరుగుతాయో లేదో వేచి చూడాలి. ఒకవేళ మార్పులు వాళ్ళు కోరుకుంటున్నట్లు జరగకపోతే తెలంగాణ ప్రజానీకానికి ఏమి వివరణ ఇచ్చుకుంటారు? సుప్రీంకోర్టుకు వెళ్లి, అది నిలిపివేస్తాం అంటారేమో. ఇన్ని సంవత్సరాల తరువాత వెలువడిన తీర్పును సుప్రీంకోర్టు ఏకపక్షంగా నిలిపివేస్తుందా? ఆ తీర్పు చట్టాలను అనుసరించి ఉన్నప్పుడు అడ్డు తగులుతుందా?


> ఎటు చూసినా 2002 సవరణ చట్టంలోని నాలుగవ నిబంధన ప్రకారం గానీ, 2014 రాష్ట్ర విభజన చట్టం ప్రకారం గానీ బచావత్ కేటాయింపులు మారే అవకాశాలు లేనే లేవు. మరి తెలంగాణ నాయకులు ఊహిస్తున్నట్లుగా కేటాయింపులలో సమూల మార్పులు జరుగుతాయో లేదో వేచి చూడాలి.



తెలంగాణ ఒక సంగతి ఉపేక్షిస్తోంది. 2014 విభజన చట్ట ప్రకారం గానీ, లేక సెక్షన్–3 పరంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశంగానీ సమీక్ష అంతా 811 టీఎంసీలకు సంబంధించినదే. ట్రిబ్యునల్–2, కేటాయింపులు కూడా ఇరు రాష్ట్రాల మధ్య పంపిణీ అనుమానాస్పదమే. ఎందుకంటే ఆ కేటాయింపులు ఇంకా చట్టరూపం దాల్చలేదు కాబట్టి. ఈ పరిస్థితులలో సమీక్ష 811 టీఎంసీలను దాటి ఉండబోనందున మిగులు జలాల ఆధారంగా చేపట్టిన షెడ్యూల్–11 ప్రాజెక్టులకు కేటాయింపుల గురించి ట్రిబ్యునల్ తమ తీర్పులో ప్రస్తావించకపోవచ్చు. అప్పుడు భారీ ఎత్తున ఖర్చుపెట్టి నిర్మిస్తున్న లేక నిర్మించిన ఆ ప్రాజెక్టుల పరిస్థితి అనిశ్చితికి దారితీస్తుందని మర్చిపోతున్నారు. బచావత్ తీర్పు అమలులో ఉన్నంత కాలం ప్రస్తుత పరిస్థితి కొనసాగుతుంది. ట్రిబ్యునల్–2 అమలులోకి వస్తే ఈ ప్రాజెక్టులు మనుగడ సాగించాలంటే గోదావరి జలాల మళ్లింపు తప్ప ప్రత్యామ్నాయం లేదు. ఈ కేటగిరీలో తెలంగాణ ప్రాజెక్టులకు సుమారు 207 టీఎంసీల నీరు కావాలి. నెట్టంపాడు 22, కల్వకుర్తి 25, ఎస్ఎల్‌బీసీ 40, పాలమూరు–రంగారెడ్డి 90, డిండి 30... మొత్తం కలిపి 207 టీఎంసీలు. ఇవి గాక దేవాదుల మూడవ స్టేజి కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ పరంగా ఇటువంటి ప్రాజెక్టులకు 125.5 టీఎంసీలు అవసరం. ఇవి గాలేరు–నగరి 38, హంద్రీ–నీవా 40, వెలుగొండ 43.5, తెలుగుగంగ 4 (29లో ట్రిబ్యునల్–2 కేటాయించిన 25 మినహాయించి)... ఇవి కూడా మనుగడ సాగించాలంటే గోదావరి జలాల మళ్లింపే ఆవశ్యకం. గోదావరి జలాల మళ్ళింపు సఫలీకృతం కావాలంటే ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తున్నట్లు పరస్పర అంగీకారం, సహకారం అవసరం. కనుక రోజువారీ ప్రసంగాలు ఆపి చర్చలకు సిద్ధమవ్వటం అవసరం. ఇచ్చిపుచ్చుకునే ధోరణి అభిలషణీయం.

షెడ్యూల్–11 ప్రాజెక్టులకు ప్రస్తుత ట్రిబ్యునల్ 2,578 టీఎంసీల కంటే అధికంగా లభ్యమయ్యే మిగులు జలాలను ఇరువురికీ ఉపయోగించే వెసులుబాటు కల్పించగలదు అనుకుందాం. అప్పుడు ఆ వెసులుబాటు ఇరు రాష్ట్రాలకు వాటి లభ్యత యాభై శాతం విశ్వసనీయత కంటే (సుమారు 35 నుంచి 40 శాతం) తక్కువ ఉంటుంది. ఆ వెసులుబాటు కూడా మహారాష్ట్ర 663 టీఎంసీలు, కర్ణాటక 900 టీఎంసీలు వినియోగించుకున్నాకే లభిస్తుంది. అటువంటప్పుడు వాటిపై పెట్టిన పెట్టుబడులు లాభసాటి కావు. తెలంగాణకైతే భారీ ప్రాజెక్టులు అయిన ఎస్ఎల్‌బీసీ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులకు షెడ్యూల్ 11లో చేర్చనందున ఇటువంటి వెసులుబాటు అసలే ఉండదు. కనుక రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా గోదావరి జలాల మళ్ళింపు ద్వారా ప్రత్యక్షంగా గాని లేక కృష్ణా జలాల ప్రత్యామ్నాయ వినియోగం ద్వారా గాని వాడుకునే వెసులుబాటు కల్పించమని అభ్యర్థించాలి. ఒకవేళ ఇది తన పరిధిలోకి రాదు అనుకుంటే కనీసం కేంద్రానికి వేరుగా గోదావరి ట్రిబ్యునల్ కేటాయింపులు జరిపే వరకూ తాత్కాలిక వెసులుబాటుకు సమ్మతించవలసిందిగా సిఫార్సు చేయమని అడగాలి. ఈ విషయంలో ఇరు రాష్ట్రాలు కలిసికట్టుగా వ్యవహరించటం ఇరువురికీ శ్రేయస్కరం.

◆ **కురుమద్దాలి వెంకట సుబ్బారావు**
విశ్రాంత చీఫ్ ఇంజనీర్





ఆర్ఓబీ పెండింగ్ స్ట్రక్చర్‌ని తొలగిస్తోన్న ఏజెన్సీ



భారీ యంత్రాలతో.. తొలగింపు

శంకర్‌విలాస్ ఆర్వోబీ కూల్చివేతలో జాగ్రత్తలు

రైళ్లకు ఇబ్బంది లేకుండా పనులు చేపడుతున్న ఏజెన్సీ

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎంతో క్లిష్టమైన.. ఏమాత్రం ఏమరుపాటు వహించినా.. రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితులు నెలకొంటాయి. ఈ క్రమంలో ఉన్నత స్థాయి నుంచి అనుమతులు కూడా అతికష్టంగా వచ్చాయి. దీంతో శంకర్‌విలాస్ పాత ఆర్‌వోబీ రైల్వే ట్రాక్ పైభాగంలో ఉన్న కట్టడాన్ని రోడ్లు, భవనాలు, రైల్వే శాఖల సంయుక్త పర్యవేక్షలో ఏజెన్సీ ఎంతో జాగ్రత్తగా తొలగిస్తోన్నది. ఇందుకోసం రెండు భారీ క్రేన్‌లను వినియోగిస్తున్నది. బ్రాడీపేట వైపున ఒకటి, మెడికల్ కళాశాల రోడ్డు వైపున మరొకటి పొజిషన్ చేసింది. తొలుత ప్రత్యేక యంత్రాల ద్వారా సిమెంట్ కాంక్రీట్‌ని బ్లాకులుగా పైన కట్ చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని భారీ క్రేన్‌ల సహాయంతో కిందికి తీసుకొచ్చి నేరుగా ట్రక్‌లలోకి లోడింగ్ చేసి బయటకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఎటువైపు అయితే బ్లాక్ కట్ చేస్తోన్నారో దాని కింద ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగెలకు సరఫరా నిలిపేసి రైళ్లను కూడా క్రమబద్ధీకరిస్తున్నారు. రైల్వే విద్యుత్ లైన్లకు, కింద యార్డుకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తొలుత పైభాగంలో ఉన్న సిమెంట్ కాంక్రీట్ శ్లాబుని తొలగించి ఆ తర్వాత రైల్వే భాగంలో ఉన్న పాత పిల్లర్లను తొలగించనున్నారు. పని ప్రదేశంలో భారీ సామర్థ్యం కలిగిన జనరేటర్లను కూడా వినియోగిస్తున్నారు. రోజుకు కొంత సమయం పాటు రైల్వే నుంచి రైళ్ల రాకపోకలను నిలిపేసి వేగవంతంగా పనిని పూర్తి చేస్తున్నారు.

మరో ఆరు నెలలు

- పీఏసీఎస్ త్రిసభ్య కమిటీల కొనసాగింపు

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) పాలక వర్గాలుగా నియమితులైన త్రిసభ్య కమిటీల పదవీ కాలం మరో ఆరు నెలలు పొడిగస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 30తో కమిటీల గడువు ముగుస్తుంది. దీంతో ఈ నెల 31 నుంచి జూలై 30 వరకు వారి పదవీ కాలం పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. పల్నాడు జిల్లాలో 58, గుంటూరు జిల్లాలో 110, బాపట్ల జిల్లా పరిధిలో 57 సొసైటీలకు త్రిసభ్య కమిటీల పదవీ కాలం పొడిగించారు. ఒక్కొక్క సొసైటీకి ఒక ఛైర్‌పర్సన్, ఇద్దరు పర్సన్ సభ్యులను నియమించింది. మూడు జిల్లాల్లో 225 సొసైటీలకు కమిటీల పదవీ కాలం పొడిగించడంతో రైతు నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్రిసభ్య కమిటీలతో సొసైటీల వారీగా త్రిసభ్య కమిటీల్లో 675 మంది కూటమి నేతలను పదవులు వరించాయి. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం ఎన్నికలు నిర్వహిస్తారని రైతులు ఆశించారు. వైసీపీ హయాంలో ఏకపక్షంగా నమోదు చేసిన పేర్లను సరిదిద్దిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే సొసైటీల వారీగా సభ్యులను గుర్తించాల్సి ఉంది. ఈ ప్రక్రియ నిర్వహణలో జాప్యం జరిగే అవకాశం ఉండటంతో కొత్త ఓటర్ల జాబితాలు రూపొందించే వరకు త్రిసభ్య పాలన కొనసాగింపునకు ప్రభుత్వం మొగ్గు చూపింది.



అన్నవరం సొసైటీ కార్యాలయం

కష్టాల కడలిని దాటి
- గ్రూప్ - 2 లో మెరిసిన ఉమ్మడి జిల్లా యువత

8

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన
నాలుగు పళ్ల విభాగంలో విజేత తెలంగాణ ఎడ్లజత

7న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

23 ఫార్మసీ అధికారుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఫార్మసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

క్లీన్ చీట్!
- తూతూ మంత్రంగా ములకలూరు పాఠశాల హెచ్‌ఎంపై విచారణ

6

పొలమేలిన.. మొక్కజొన్న



మొక్కజొన్న

రబీ సీజన్‌లో పంటల సాగు ఆశాజనకంగా ఉంది. గత ఐదేళ్ల కంటే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సాధారణ విస్తీర్ణం మించి 111.9 శాతం పంటలు సాగు చేయడం విశేషం. పుష్కలంగా సాగునీటి సరఫరా చేయడంతో ఇది సాధ్యమైంది. అయితే పంట మార్పిడి వైపు రైతులు మొగ్గు చూపారు. దీంతో మొక్కజొన్న సాగు అంచనాలను మించి సాగైంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 6.37 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఒక్క మొక్కజొన్న పంట 2.18 లక్షల ఎకరాల్లో సాగు కావడం విశేషం. గత రబీ కంటే ఈసారి సాగు విస్తీర్ణం 41 వేల ఎకరాలు అధికం.



6.37 లక్షల ఎకరాల్లో రబీ పంటల సాగు

- గతేడాది కంటే 41 వేల ఎకరాలు అధికం
- వరిని వెనక్కినెట్టిన మొక్కజొన్న..
- 2.18 లక్షల ఎకరాల్లో సాగు..
- పంటల సాగులో 34.27 శాతంతో ఆధిపత్యం
- పొగాకు సాగు నిషేధంతో.. ప్రత్యామ్నాయం

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

రబీలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, శనగ, మినుము పంటలను రైతులు చేస్తారు. వరి తర్వాత ప్రధాన పంట మొక్కజొన్నగా ఉండే ది. ఈ సారి మొక్కజొన్నే పొలమేలు తోంది. ప్రధాన పంటగా మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానంలో వరి సాగు ఉంది. మొక్క జొన్న మూడు జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 1,27,072 ఎకరాలు కాగా, ప్రస్తుతం 2,18,586 ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది 1,39,227 ఎకరాల్లో సాగు చేయగా ఈ ఏడాది 79,359 ఎకరాలు సాగు విస్తీర్ణం పెరిగింది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 98,401 ఎకరాలు కాగా 67,292 ఎకరాలు, శనగ సాగు సాధారణ విస్తీర్ణం 1,07,335 ఎకరాలు కాగా 1,34,798 ఎకరాల్లో సాగైంది. శనగ సాగు పల్నాడులో భారీగా తగ్గగా.. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో గణనీయంగా పెరిగింది. గతేడాది 76,022 ఎకరాల్లో శనగ సాగు చేయగా ఈసారి 58,776 ఎకరాలు అదనంగా సాగైంది. గతేడాది పొగాకు 90,502 ఎకరాల్లో సాగు చేయగా.. నిషేధాజ్ఞలతో ప్రత్యామ్నాయంగా పల్నాడు జిల్లాలో మొక్కజొన్న, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో మొక్కజొన్నతోపాటు శనగను రైతులు సాగు చేశారు. పంటల సాగు అశాజనకంగా ఉంది. దిగుబడులు బాగుంటాయని రైతులు ఆశిస్తున్నారు.

పల్నాడు జిల్లాలో..

వరి సాధారణ (మిగతా 8వ పేజీలో)

50 లక్షల జనాభాతో అమరావతి

- రాజధాని గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక
- తుళ్లూరు సభలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో అమరావతి పరిధిలోని 29 గ్రామాలలో 50 లక్ష మంది జనాబా కలిగి ఉంటుంది. అందుకు తగ్గట్లుగానే రాజధాని గ్రామాల్లో మౌలిక వసుతుల కల్పన జరుగుతుంది.. అని మంత్రి నారాయణ తెలిపారు. తుళ్లూరులో బుధవారం జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే రాజధాని గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు(డీపీఆర్) తయారు చేసినట్లు చెప్పారు. తుళ్లూరులో ప్రస్తుతం 8961 మంది ఉన్నారని, భవిషత్‌లో ఆ సంఖ్య 32,690కి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి 135 లీటర్ల నీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. మురుగు నీరు నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామంలో 22 కిలోమీటర్ల మేర రోడ్లు వేయాల్సి ఉందని చెప్పారు. రైతుల లే అవుట్లలో అంతర్జాతీయ మౌలిక వసతులు ఏ విధంగా కల్పిస్తున్నామో అలాగే రాజధాని గ్రామాలలో వసతుల కల్పన ఉంటుందన్నారు. ఎటువంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. గ్రామ కంఠాల సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. రోడ్లు, శ్మశానం, 30 పడకల ఆస్పత్రి, తాగునీటి పైపులు, బీసీ కాలనీలో డ్రెయినేజీ, ఎన్టీఆర్ సుజల పథకం, మూడో వాటర్ ట్యాంకు నిర్మాణం తదితర సమస్యలపై గ్రామస్థులు ఫిర్యాదు చేయగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలో నుంచి వచ్చే రోడ్లను రాజధాని ప్రధాన రహదారులకు అనుసంధానం చేయాలని కోరారు. విస్తరించిన గ్రామ కంఠంలో చేపట్టే పనులపై డీపీఆర్‌లో పేర్కొనలేదన్నారు. తాడికొండ అడ్డరోడ్డు నుంచి రాయపూడి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. రోడ్డు కింద ఇళ్ల స్థలాలు కోల్పోయే వారికి మంచి ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, చీఫ్ ఇంజనీర్ ధనుంజయడీసీ పద్మావతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్, రైతు జేఏసీ నేత సుధాకర్ పాల్గొన్నారు.



అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

మార్చి 16కి అమజీవి స్మృతి వనం

మార్చి 16వ తేదికి రాజధానిలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనాన్ని పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ పూర్తి చేస్తున్నట్లు మంత్రి నారాయయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తెలిపారు. స్మృతి వనంలో అమరజీవి విగ్రహ ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజధాని అమరావతిలో ప్రతిఒక్కరూ అమరజీవిని స్మరించుకునే విధంగా ఆయన విగ్రహం, స్మృతివనాన్ని తుళ్లూరు రెవెన్యూలో ఏడు ఎకరాల్లో నిర్మిస్తున్నామన్నారు. అమరావతిలో భూములు పొందిన ప్రైవేటు సంస్థలు కూడా పనులు వేగవంతం చేశాయన్నారు.

నాణ్యతలో రాజీ వద్దు

మధ్యాహ్న భోజనం తనిఖీలో డీఈవో

గుంటూరు(విద్య), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతపై రాజీ పడరాదని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాష ఉపాధ్యాయులను ఆదేశించారు. కేఎస్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, అదే ప్రాంగణంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, హిందూ కాలేజ్ హైస్కూల్, యాదవ ఉన్నత పాఠశాల, నల్లపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పంపిణీ చేసే చిక్కీలు, కోడిగుడ్ల నాణ్యత అడిగి తెలుసుకున్నారు. నాణ్యతపై సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలు, పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న 100 రోజుల ప్రణాళిక అమలు తీరును, 9వ తరగతి విద్యార్థుల సిలబస్ పరిశీలించారు వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల నమోదు పెంచేందుకు ఇప్పటి నుంచే తల్లిదండ్రుల సహకారంతో ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో సలీం బాషా

శిల్పారామం అభివృద్ధికి 1.47 ఎకరాలు

- రూ.25 కోట్లతో హాల్, ఆటస్థలం నిర్మాణం
- మంత్రి మండలి సమావేశంలో ఆమోదం

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని శిల్పారామం కల్చరల్ సెంటర్ ఎంటర్‌టైన్మెంట్ జోన్‌ను అభివృద్ధి చేయడానికి నిపుణుల కమిటీ సిఫార్సు చేసిన విధంగా 1.47 ఎకరాల భూమిని కేటాయిస్తూ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్, కల్చరల్ సొసైటీ ప్రతిపాదనకు కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. ఎం/ఎస్ రఘురామ్ హ్యామ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్, గుంటూరుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ లేదా లెటర్ ఆఫ్ అవార్డు జారీ చేయడానికి సీఈఓకు అధికారం కల్పించింది. ఈ సంస్థ సుమారు రూ.25 కోట్లు పెట్టుబడి పెట్టి 1000 మంది పట్టే హాల్, పిల్లల ఆటస్థలం వంటివి నిర్మిస్తుంది. దీనివల్ల ప్రభుత్వానికి ఎలాంటి ఖర్చు లేకుండా కొత్త సౌకర్యాలు వస్తాయి.

మిర్చి యార్డు వైస్ ఛైర్మన్.. జనసేనకు

- ప్రధానంగా బిట్రగుంట మల్లిక పేరు పరిశీలన
- డైరెక్టర్లలో టీడీపీకి పది, జనసేనకు మూడు, బీజేపీకి ఒకటి
- పాలకవర్గంపై నేడో, రేపో వెలువడనున్న జీవో

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆసియాలో కెల్లా పేరొందిన గుంటూరు మిర్చియార్డు పాలకవర్గం కూర్పు కొలిక్కి వచ్చింది. ఇప్పటికే ఛైర్మన్‌గా కుర్రా అప్పారావును నియమించిన విషయం తెలిసిందే. యార్డు పరిధిలో ఉన్న ప్రత్తిపాడు, గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు మొత్తం 14 మంది డైరెక్టర్ల ఎంపిక బాధ్యతను అప్పగించారు. కాగా కూటమిలో భాగంగా ఉన్న జనసేనకు వైస్ ఛైర్మన్ పదవితో పాటు మరో రెండు డైరెక్టర్ పదవులు, బీజేపీకి ఒకటి, మిగతా పది పదవులు టీడీపీకి ఇచ్చే విధంగా ఒప్పందం కుదిరింది. కాగా జనసేనకు కేటాయించిన వైస్ ఛైర్మన్ పదవిని గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకురాలు, కాపు సామాజికవర్గానికి చెందిన బిట్రగుంట మల్లిక కు ఇవ్వనున్నట్లు సమాచారం. టీడీపీకి కేటాయించిన పది డైరెక్టర్ పదవుల్లో ఐదు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి కేటాయించి పెద్దపీట వేశారు. తూర్పు నియోజకవర్గానికి మూడు, ప్రత్తిపాడు నియోజకవర్గానికి రెండు డైరెక్టర్ పదవులు కేటాయించారు. కాగా పాలకవర్గానికి సంబంధించి రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడనున్నాయి.



బిట్రగుంట మల్లిక

రేపు జీజీహెచ్‌కు సీఎం చంద్రబాబు

డాక్టర్ కానూరి జింకానా తల్లీ బిడ్డల ఆరోగ్య కేంద్రం ప్రారంభం ● ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్ పరిశీలన

గుంటూరు మెడికల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం, ఉత్తర అమెరికా (జింకానా) ఆర్థిక సాయంతో రూ.100 కోట్లతో గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో నిర్మించిన డాక్టర్ కానూరి జింకానా తల్లీ బిడ్డల ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సీఎం చంద్రబాబు ఈ భవనం ప్రారంభించనున్న నేపథ్యంలో తుది నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణయశస్వి తదితరులు ఆస్పత్రిలో భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా జీజీహెచ్‌లో చేపట్టాల్సిన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం నిర్వహణ తీరును పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనను సురక్షితంగా, సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వీవీఐపీ రూట్ ఏర్పాట్లు, సభా ప్రాంగణం చుట్టుపక్కల భద్రత తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు ఆయా విభాగాల్లో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ఎస్.ఎస్.వి.రమణ, ఆర్డీవో కే శ్రీనివాసరావు, డీఎస్పీ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి, జింకానా అధ్యక్షుడు డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు, డాక్టర్ బాబుల్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ, ఉప రవాణా కమిషనర్ సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో పర్యటిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ జిందాల్

బార్లకు మళ్లీ ఆహ్వానం

- 64 బార్లకు రీ నోటిఫికేషన్
- ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు
- ఏఆర్ఈటీ మినహాయింపు



వివరాలు వెల్లడిస్తున్న డీసీ శ్రీనివాసులు, అరుణ కుమారి, మారయ్య బాబు

గుంటూరు కార్పొరేషన్, నరసరావుపేట లీగల్, జనవరి 28 ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో 42, పల్నాడు జిల్లాలో 22 బార్లకు రాష్ట్ర ప్రభుత్వం రీ నోటిఫికేషన్ జారీ చేసినట్లు గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం బ్రాడీపేటలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో విలేకర్లకు ఆయన వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో నోటిఫై చేసిన బార్ షాపుల్లో ఖాళీగా ఉన్న వాటి నిర్వహణకు ప్రభుత్వం రీ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 26, మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 6, తెనాలి మున్సిపాలిటీ పరిధిలో 9, పొన్నూరు మున్సిపాలిటీ పరిధిలో ఒకటి చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మున్సిపాలిటీలో 7, చిలకలూరిపేటలో 5, పిడుగురాళ్లలో 4, మాచర్లలో 3, వినుకొండలో 3 ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్షిక లైసెన్స్ ఫీజు రూ.75లక్షలు అని, మిగిలిన ప్రాంతాల్లో రూ.55 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరణ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉంటుందన్నారు. ఫిబ్రవరి 5న ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో డ్రా తీసి షాపులు కేటాయించబడతాయన్నారు. ప్రభుత్వం తాజాగా బార్ షాపులు దక్కించుకునే వారికి ఏఆర్ఈటీ (అడిషనల్ రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్) నుంచి మినహాయింపు ఇచ్చిందన్నారు. జిల్లాఅధికారి అరుణకుమారి, ఏఈఎస్ మారయ్యబాబు పాల్గొన్నారు. అలాగే పల్నాడు జిల్లాలో బార్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సూపరింటెండెంట్ కె.మణికంత స్థానికంగా విలేకరుల సమావేశంలో కోరారు.

కందుకూరి పురస్కారం అందుకున్న డాక్టర్ కందిమళ్ల




పురస్కారం అందజేస్తున్న మంత్రి దుర్గేష్

యడ్లపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ ప్రకటించిన కందుకూరి పురస్కారాన్ని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అందుకున్నారు. గతేడాది ఈ పురస్కార ప్రదాన సమయంలో సాంబశివరావు విదేశీ పర్యటనలో ఉండడంతో తీసుకోలేకపోయారు. ఇటీవలే స్వదేశానికి వచ్చిన ఆయనకు అమరావతి సచివాలయంలో పురస్కారాన్ని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ప్రదానం చేశారు. ఏటా సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఏప్రిల్ 16న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. అనంతపురం ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు గుదె పాండురంగా రావు పాల్గొన్నారు.

క్లీన్ చీట్!

- తూతూ మంత్రంగా ములకలూరు పాఠశాల హెచ్‌ఎంపై విచారణ
- గ్రామస్థుల ఫిర్యాదులు బుట్టదాఖలు
- స్పందించని చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ



హెచ్‌ఎంపై ఫిర్యాదు చేస్తూ గ్రామస్తులు రాసిన లేఖ



ఎండలో మోకాళ్లపై ఉన్న విద్యార్థులు(ఫైలఫొటో

గుంటూరు(విద్య) జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్ని మోకాళ్లపై ఎండల్లో నుంచోబెట్టి చదివించడం.. పాఠశాలలో ఉన్న సిమెంటు టైల్స్ మోయించడం.. మోయడం చేతకాక గాయాలపాలవడం.. ఈ నెల 23న పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం ములకలు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నిర్వాకంతో జరిగిన ఈ ఘటనలు.. ఉన్నతాధికారులకు కనిపించలేదు. దీనికి కారణమైన ప్రధానోపాధ్యాయురాలిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా ఆమె మంచిదంటూ, పత్రికల్లో వచ్చిన కథనాలు అసత్య ఆరోపణలంటూ క్లీన్‌చిట్ ఇచ్చేశారు. చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ కూడా వీటిని పట్టించుకోకపోవడం కూడా ఓ విచిత్రం. ఫలితంగా హైస్కూల్ హెచ్‌ఎం శ్రీలక్ష్మి నిర్వాకంపై విచారణ తూతూ మంత్రంగా ముగిసి.. నివేదిక బుట్టదాఖలైంది. విచారణ పేరుతో పాఠశాలకు వెళ్లిన ఓ అధికారి తనకు సన్మానం చేయగానే పాఠశాల హెచ్‌ఎంపై ఉన్న ఆరోపణలన్నీ గాలిలో కలిసిపోయినట్లు వ్యవహరించారు. మరోవైపు బాధిత విద్యార్థులతో బలవంతంగా ఒత్తిడి చేసి హెచ్‌ఎంకు అనుకూలంగా ఆయన లేఖలు తీసుకొని, విచారణ మమ అనిపించారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఎక్కడ

విద్యార్థులు, చిన్నారుల భద్రతకు కట్టుబడి ఉన్నామని చెప్పుకునే చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఎక్కడ అనే అనుమానం తల్లిదండ్రుల్లో వస్తోంది. జిల్లాలో ఎక్కడ బాలలపై అఘాయిత్యాలు జరిగినా.. వారితో పని చేయించినా.. ఇబ్బందులకు గురిచేసినా.. రెక్కలు కట్టుకొని వాలే చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ములకలూరు జడ్పీ స్కూలుకు ఎందుకు వెళ్లలేదని అనుమానం వస్తోంది. కమిటీ సభ్యులు హెచ్‌ఎంతో లాలూచీ పడినందు వల్లే ఇటువంటి పరిస్థితి నెలకొందని గ్రామస్థులులు ఆరోపిస్తున్నారు. సాక్షాత్తూ తామే స్వయంగా ఫిర్యాదు చేసినా.. పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో ఫొటోలతో సహా కథనాలు వచ్చినా కమిటీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు విచారణ పేరుతో వెళ్లిన అధికారికి పెద్ద మొత్తంలో ముడుపులు అందినట్లు ఫిర్యాదులున్నాయి. విచారణను ఎంఈఓ నుంచి హైజాక్ చేసి ఆయన మమ అనిపించినట్లు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. సదురు అధికారి తాను పనిచేసే డైట్ కళాశాలకు సక్రమంగా వెళ్లకుండా ఇటువంటి వివాదాల్లో తల దూర్చి భారీగా దండుకుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా.. జిల్లాస్థాయిలో అత్యున్నత అధికారులు స్పందించి ములకలూరు జడ్పీ స్కూల్ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన



మంగళగిరి సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఏప్రిల్ 11న అమరావతిలో పూలే స్మృతి వనం నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేస్తారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ప్రకటించడం పట్ల ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు హర్షం వెలిబుచ్చారు. ఇటీవల గొల్లపూడిలోని బీసీ భవన్‌లో బీసీల సమస్యలపై ఆయా సంఘాలతో జరిగిన సదస్సులో సంఘం తరపున 23 ప్రధాన డిమాండ్లపై మంత్రి సవితకు వినతిపత్రం అందజేశామన్నారు. తాము కోరిన విధంగా పూలే స్మృతి వనం, 28 జిల్లా కేంద్రాల్లో మహాత్మా పూలే బీసీ భవనాలు, బీసీ స్టడీ సర్కిళ్లు లేని జిల్లాల్లో అన్ని హంగులతో పక్కా భవనాలు నిర్మిస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. జనగణనతో పాటు డెడికేషన్ కమిషన్ ద్వారా సమగ్రంగా కులగణన చేయించి, బీసీల లెక్కలు కచ్చితంగా తేల్చుతామని ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపారు. బీసీల గణనతో సరిపెట్టకుండా, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో రాయితీలు, రిజర్వేషన్లు జనాభా దామాషా మేరకు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

7న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

గుంటూరు సిటీ జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు వచ్చే నెల 7న పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జడ్పీ ముఖ్య కార్య నిర్వహణ అధికారి వి.జ్యోతిబసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి స్థాయీ సంఘం (ప్లానింగ్, ఫైనాన్స్), రెండవ (గ్రామీణాభివృద్ధి), నాలుగవ (విద్య, వైద్యం), ఏడవ స్థాయీ సంఘ (పనులు) సమావేశాలు జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హేనీ క్రిస్టీనా ఆధ్యక్షతన ఆమె చాంబర్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. మూడవ స్థాయీ సంఘ (వ్యవసాయం) సమావేశం జడ్పీ వైస్ ఛైర్మన్ సొంఠిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన నాన్ ఏసీ మీటింగ్ హాల్లో, ఐదవ స్థాయీ సంఘ (మహిళా సంక్షేమం) సమావేశం తెనాలి జడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి అధ్యక్షతన డిప్యూటీ సీఈఓ చాంబరులో, ఆరవ స్థాయీ సంఘ (సాంఘిక సంక్షేమం) సమావేశం జడ్పీ వైస్ ఛైర్మన్ బత్తుల అనురాధ అధ్యక్షతన సీఈఓ చాంబర్‌లో ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు జరుగుతాయని సీఈఓ పేర్కొన్నారు.

నేటి నుంచి జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన

మాచవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మోర్జంపాడు గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి 70వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నుంచి జాతీయస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. వివిధ విభాగాల్లో ఈ పోటీల్లో ఉంటాయని పేర్కొంది. ఎడ్ల యజమానులు కమిటీని సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపింది.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విజ్ఞాన్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ కేవీ కృష్ణకిషోర్



విద్యార్థిని అభినందిస్తున్న కేవీ కృష్ణకిషోర్

గుంటూరు (విద్య) జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, విద్యార్థులందరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని విజ్ఞాన్ యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ పిలుపునిచ్చారు. వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీజీహెచ్ నుంచి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్‌నాయక్, తెనాలి జీజీహెచ్ నుంచి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ జి.రాధాభాయ్, గుంటూరులోని నీడ్స్ బ్లడ్ బ్యాంక్ నుంచి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శాంతిశ్రీ, గుంటూరులోని తలసేమియా బ్లడ్ బ్యాంక్ నుంచి డాక్టర్ మణికంఠ హాజరయ్యారు. రిజిస్ట్రార్ పీఎంవీరావు, విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

23 ఫార్మసీ అధికారుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ గుంటూరు ప్రాంతీయ కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న 23 ఫార్మసీ అధికారుల పోస్టులను (గ్రేడ్-22 ఫార్మసిస్టు) ఒప్పంద పద్ధతిలో భర్తీ చేసేందుకు నిర్ణయించామని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ గుంటూరు ప్రాంతీయ సంచాలకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను వచ్చే నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరులోని వైద్య ఆరోగ్య శాఖ ఆర్‌డీ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం వైద్య ఆరోగ్య శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు.

మెప్మా పీడీ డిప్యూటేషన్ పొడిగింపు

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మెప్మా - డీపీఎంయూ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి డిప్యూటేషన్‌ని మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె 2024 నవంబరులో పంచాయతీరాజ్‌శాఖలో డివిజనల్ డెవలప్ మెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తూ డిప్యూటేషన్‌పై మెప్మా పీడీగా వచ్చారు. విజయలక్ష్మి డిప్యూటేషన్ గతేడాది నవంబరు 23న ముగిసింది. తన డిప్యూటేషన్‌ని పొడిగించాల్సిన ఆమె దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం బుధవారం జీవో జారీ చేసింది. ఈ ఏడాది నవంబరు 22 వరకు మెప్మా పీడీగా కొనసాగనున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559


బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	158, 167, 178
చికెన్ విత్ స్కిన్(కిలో)	306.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	316.00

మిర్చియార్డు సమాచారం

(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	86,859
అమ్మకాలు	84,540
నిల్వ	17,560

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	25000
4884	----	----
సూపర్ 10	13600	26500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20000
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	23000
దేవనూరు డీలక్స్	14000	25000
ఆర్మూరు	12000	17000
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	20500
నెంబరు. 5	13500	21000
273	----	----
341	13000	22500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	13500	22000
దేవనూరు డీలక్స్	---	---
	7000	10500

వైసీపీని వీడి టీడీపీలో 70 కుటుంబాల చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి శావల్యాపురం మండలం పొట్లూరు గ్రామానికి చెందిన 70 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. శావల్యాపురం సొసైటీ అధ్యక్షుడు గడిపూడి విశ్వనాథం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో వారిని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై, జీవీ నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరుతున్నట్లు ఆయా కుటుంబాల ప్రతినిధులు తెలిపారు. ప్రతి కార్యకర్తకు కుటుంబ సభ్యుడిలా అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా తమ వద్దకు రావాలని జీవీ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. నాయకులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో తమిళనాడు అధికారులు

కర్లపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని తమిళనాడుకు చెందిన పంచాయతీరాజ్ డీపీవో, బీడీవో, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, డీఆర్‌డీఎస్ శాఖలకు చెందిన 29 మంది మండలస్థాయి అధికారులు బుధవారం సందర్శించారు. బాపట్ల ఈటీసీ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నిర్వహిస్తున్న రికార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఏపీవో శ్యామ్, బాపట్ల ఈటీసీ ఫ్యాకల్టీ లలిత, రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవోలు ఐనంపూడి శ్రీనివాసరావు, డి.పద్మావతి పాల్గొన్నారు. .

టీబీ నివారణకు.. నూతన ఎక్స్‌రే మెషిన్



హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో ఎస్.విజయమ్మ

బాపట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : టీబీ ముక్త్‌బారత్ అభియాన్‌లో భాగంగా.. బాపట్ల జిల్లాకు ఏఐ కంపెనియన్ ఫ్యూచర్ గల హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే మిషన్ కేటాయించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ బుధవారం లాంఛనంగా దానిని ప్రారంభించారు. టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు ఈ ఎక్స్‌రే మిషన్ వినియోగించుకోవాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ వి. సోములనాయక్, ప్రోగ్రాం ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గతేడాది అక్టోబరులో నిర్వహించిన మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను బుధవారం పరీక్షల నిర్వహణాధికారి ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. పరీక్ష ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన

రెంటచింతల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కానుకమాత 176వ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నాలుగుపళ్ల విభాగంలో బసవ రాజుల పోటీలను నిర్వహించారు. 15 నిమిషాల వ్యవధిలో 9 క్వింటాళ్ల 50 కేజీల బరువు లాగేందుకు 12 జతల ఎడ్లు పోటీలో నిలిచాయి. ప్రథమ బహుమతిని తెలంగాణలోని మేళ్ల చెరువు గ్రామానికి చెందిన కొప్పుల గోవర్ధనరెడ్డి, ప్రవలీష్ రెడ్డి ఎడ్లజత 43.91 అడుగుల దూరం లాగి కైవసం చేసుకుంది. గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ప్రకాశం జిల్లా కురిచేడు హర్షవర్ధన్‌రెడ్డి ఎడ్లజత 4379.3 అడుగుల దూరంతో ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా కంభానికి చెందిన వెంకటగిరి హేమలతనాయుడు ఎడ్లజత 4208.9 అడుగుల దూరంతో తృతీయ స్థానం, దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత 4,066 అడుగుల దూరంతో నాలుగోస్థానం, కడప జిల్లా పెద్దముడియానికి చెందిన కె.వెంకట హేమలతారెడ్డి ఎడ్లజత 3,964 అడుగుల దూరంతో ఐదో స్థానాన్ని దక్కించుకున్నాయి. మొదటి బహుమతిని సర్పంచ్ పూజల పుష్పవతి రామయ్య రూ.60 వేల నగదును అందించారు. తొలుత పోటీలను తహసీల్దారు మేరికనకం, ఫాదర్ గోవింద బాలస్వామి ప్రారంభించారు.



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు

షబేబరాత్‌కు అన్ని వసతులతో ఏర్పాట్లు చేయండి

• తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల మూడో తేదీన షబే బరాత్ (పెద్దల పండుగ)కు కబరస్తాన్‌లో మౌలిక వసతులు కల్పించాలని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని ఆనందపేట ముస్లిం శ్మశానవాటికను ఎమ్మెల్యే నసీర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్మశాన వాటికలో తాగునీటి సరఫరా, శానిటేషన్ అంశాలపై అధికారులతో మాట్లాడారు. తాగునీటి పైపులైన్ల వద్ద అపరిశుభ్రంగా ఉండడంతో వెంటనే క్లీన్ చేయించాలని, నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. శ్మశాన వాటికలో చిల్లచెట్లు పెరిగి ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే వెంటనే వాటిని తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముస్లిం మైనారిటీలు రాత్రంతా జాగారం ఉండి ప్రత్యేక దువా చేస్తారని తెలిపారు. దానధర్మాలు వంటి కార్యక్రమాలు చేపడతారని, మరణించిన తమ కుటుంబీకులు, బంధువుల ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటారని తెలిపారు. ఆధ్యాత్మికంగా తమను తాము శుద్ధి చేసుకునే సమయంగా భావిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమబాటే

• ఈయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ గుంటూరు-1 డిపోలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమబాట తప్పదని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బస్టాండ్‌లో ఎర్రబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన గేట్ మీటింగ్‌లో శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంటూరు-1 డిపో యాజమాన్యం ఉద్యోగులపై పక్షపాతి ధోరణితో వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. చార్ట్ బుకింగ్‌లో ఓడీ కండక్టర్‌ను వాడొద్దని సర్క్యులర్ ఉన్నప్పటికీ దానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర కార్యదర్శి కేవీఎస్ నరసింహారావు మాట్లాడుతూ డిపో అధికారులు ఉద్యోగులను బెదిరించాలని చూస్తే సహించేదిలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు కరిముల్లా మాట్లాడుతూ చార్ట్‌లో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి జె.రత్నాకర్, మస్తాన్‌వలి, ఐవీ రామమ్మ, కృష్ణవేణి, స్వామి, ఎన్వీ రెడ్డి, ఎస్ఎస్ రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి మణికుమార్, ఎమ్మెస్ ప్రసాద్ తదితరులున్నారు.



నిరసనలో ప్రసంగిస్తున్న శ్రీనివాసరావు, నరసింహారావు ఉద్యోగులు

ఎయిడెడ్ పాఠశాలలో టీచర్ పోస్ట్ భర్తీకి నోటిఫికేషన్ విడుదల

గుంటూరు (విద్య), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసరావుపేటలోని రవీంద్రనాథ్ ఠాగూర్ కమిటీ ప్రాథమికోన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న గ్రేడ్ 2 హిందీ పండిట్ పోస్టు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ కోసం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో డాక్టర్ ఎస్కే సలీం బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు నాలుగో తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు ఇతర వివరాల కోసం సీఎస్ఈ ఏపీ ఎయిడెడ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ అనే వెబ్‌సైట్లో చూడాలని సూచించారు.

లోకమంత యోగవాశిష్టమే

• ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు

గుంటూరు(తూర్పు), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజమంతా యోగవాసిష్టంతో నిండిపోయిందని మహాసహస్రావధాని, ఆధ్యాత్మిక ప్రవచన కర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. గుంటూరు, పట్టాభిపురం, శ్రీ రమ సత్యనారాయణస్వామి ఆలయ 49వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వాల్మీకి మహర్షి రచించిన యోగవాశిష్టంపై బుధవారం ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనం చేస్తూ రామునికి, వశిష్ట మహర్షికి జరిగిన సంవాదమే యోగవాశిష్టమన్నారు. రాముడికి కలిగిన నేను ఎవరనే సందేశ నివృత్తికై వశిష్ట మహర్షి వద్దకు వెళ్ళారన్నారు. జీవి పుట్టగానే మాయతో నిండి ఉంటాడని, దాని నుంచి బయటపడేదే యోగవాశిష్టం అన్నారు. మన మనోభావాలను బట్టే మన ఆలోచనా విధానం ఉంటుందన్నారు. జీవి ఒక శరీరాన్ని విడిచి మరొక శరీరంలోకి ఎందుకు ప్రవేశించాలని.... రాముడు వశిష్టుని అడిగారన్నారు. జన్మనెత్తడానికి దుఃఖానికి కారణం నేను అనేది వదలి పెట్టాలన్నారు. బంధాల వలన వినాశనం తప్పదన్నారు. దేశభక్తి లేనిదే దైవభక్తి లేదని తెలిపారు. ప్రతి హిందూ అన్నవాడు ఏదో ఒక రకమైన బొట్టు పెట్టుకోవాలని సూచించారు. ఒకనాడు విశ్వగురువుగా ఉన్న భారతదేశం కొన్ని కారణాల వల్ల విశ్వగురు స్థానాన్ని కోల్పోయిందని, దానిని తిరిగి విశ్వగురు స్థానంలో నిలబెట్టడానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.



ప్రవచనం చేస్తున్న డాక్టర్ గరికపాటి, హాజరైన ప్రజలు

కృష్ణానదిలో చక్రస్నానం

• ముగిసిన విజయకీలాద్రి బ్రహ్మోత్సవాలు



కృష్ణానదిలో చక్రస్నాన ఘట్టం నిర్వహిస్తున్న చినజీయర్ స్వామి

తాడేపల్లి టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేదవిశ్వ విద్యాలయ వ్యవస్థాపకుడు త్రిదండి చినజీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్ర 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. అవబృధ స్నానం, పుష్పయాగం, ద్వాదశరాధన, దేవతోద్వాసన, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పెరుమాళ్లకు విజయకీలాద్రి స్వామికి కృష్ణా నదిలో చక్రస్నానం స్వామిజీ నిర్వహించారు. వేదాశీర్వాచనంతో విజయకీ లాద్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

రెవెన్యూ సేవలతో ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలి

• కలెక్టర్ అన్సారియా



రెవెన్యూ అధికారుల వర్క్‌షాప్‌లో మాట్లాడుతోన్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిని ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా మరింతగా మెరుగుపరిచేలా తహసీల్దార్లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో బుధవారం జరిగిన రెవెన్యూ అధికారుల వర్క్ షాప్‌లో ఆమె జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ శాఖలో ఇటీవల అనేక సర్క్యులర్స్ జారీ చేసిందన్నారు. నిషేధిత భూముల జాబితాలో ఉన్న కొన్ని రకాల భూములు తొలగింపునకు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్థాయి నుంచి ఆర్డీవో, తహసిల్దార్ స్థాయిలోనే దరఖాస్తులు పరిష్కారించటానికి అవకాశం కల్పించారన్నారు. నూతనంగా రెవెన్యూ శాఖలో జారీ చేసిన సర్క్యులర్‌పై అవగాహన కోసం రెవెన్యూ డివిజన్ అధికారి స్థాయి నుంచి, తహసిల్దార్లు, మండల సర్వేయర్లు, క్షేత్రస్థాయిలో పనిచేసే విలేజ్ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లకు రెవెన్యూ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లాలో రెవిన్యూ అంశాలకు సంబంధించి ఐవీఆర్ఎస్‌లో ప్రజల సంతృప్తి స్థాయి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ గతం కంటే మెరుగ్గా ఉందని, దీనిని మరింతగా మెరుగుపరచాలన్నారు. పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్‌లలో వచ్చిన దరఖాస్తులలో పరిష్కరించే అంశాలను క్షేత్రస్థాయిలో విచారణను సత్వరమే పూర్తి చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ నిషేధిత భూముల జాబితా తొలగింపు నకు సంబంధించిన దరఖాస్తులను మూడు నెలల్లో నూరు శాతం పరిష్కరించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి అన్ని రెవెన్యూ ఫైళ్లు ఈ ఆఫీస్ ద్వారానే కచ్చితంగా పంపించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి మాట్లాడుతూ ఈ-ఆఫీసులో ఫైళ్ల నమోదుకు మూడు రోజుల్లో మండల పరిధిలోని వీఆర్వోలు, ఆర్ఐలు, డిప్యూటీ తహసీల్దార్‌లకు లాగిన్‌లు అందించేలా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, తెనాలి సబ్ కలెక్టర్ ఇంచార్జి లక్ష్మి కుమారి, ఏడి సర్వే పవన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న బాబు ప్రసాదు, పాల్గొన్న ప్రజా, కార్మిక సంఘాల నాయకులు

నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 5 నుంచి జరిగే నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాబు ప్రసాదు పిలుపు నిచ్చారు. పాతగుంటూరు, సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రజా, కార్మిక సంఘాల సదస్సులో ఆయన ప్రసంగించారు. ఫిబ్రవరి 12న జరిగే సమ్మె జయప్రదం చేసేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అందులో భాగంగా ఫిబ్రవరి 5 నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో జీపు యాత్ర, 10న బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు. 12న జరిగే సమ్మెలో భాగంగా శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కార్యకర్తలు, నాయకులతో కలిసి భారీ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. సీపీఐ నగర కార్యదర్శి అకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కృష్ణ, కోటయ్య, దండా లక్ష్మీనారాయణ, మేడా హనుమంతరావు, రంగారెడ్డి, చెంగయ్య, రమణ పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు జిల్లా క్రీడాకారులు

గుంటూరు క్రీడలు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో ఇటీవల జరిగిన కూడో మార్షల్ ఆర్ట్స్ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి అఫ్రోజ్ క్రీడాకారులను అభినందిస్తూ రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కూడో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, సిద్దార్థ క్రీడాకారులు గునేశ్వర్, లోకనాథ్, శ్రీమంత్‌రెడ్డి, సంతోష్, ఉద్దిప్, బంధవ్, హనోక్, రామావత్ అనిల్ పాల్గొన్నారు.

ప్రయాణికులు లేక ఆర్టీసీ వెల వెల

• అరకొర ప్రజలతోనే బస్సుల రాకపోకలు

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ వెలవెలబోతుంది. ప్రయాణీకుల తాకిడి లేక కళా విహీనంగా మారింది. సంక్రాంతి పర్వదినం ముగిసిన తరువాత నాలుగైదు రోజుల పాటు ప్రయాణీకుల రద్దీతో ఎన్‌టీఆర్ బస్టాండ్ కళకళ లాడింది. మరో వైపు మహిళలకు ఉచిత ప్రయాణం కూడా కలిసి రావటంతో బస్సుల్లో కూడా మహిళా ప్రయాణీకుల సంఖ్య 70 శాతంపైగా వారే ఉన్నట్లు అధికారులు తెలిపారు. సంక్రాంతి పర్వదినం ముగిసిన తరువాత ఆర్టీసీకి ప్రయాణీకుల తాకిడి పూర్తిగా తగ్గింది. సాధారణ రోజుల్లో ఛార్జీల రూపంలో వచ్చే ఆదాయం కూడా సగానికి పైగా తగ్గిందని అధికారులు తెలిపారు. మరికొన్ని రోజుల పాటు ఇలానే ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ఫలితంగా ఆర్టీసీ రోజువారీ ఆదాయంలో కూడా భారీగా కోతపడనున్నది.



ప్రయాణికుల తాకిడి లేక వెలవెలబోతున్న ఎన్‌టీఆర్ బస్టాండ్

పశ్చిమ డెల్టాకు 2054 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విజ యవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకు 2054 క్యూసెక్కులనీరు బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికా రులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 11.6 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 144 క్యూ సెక్కులు, తూర్పుకాల్వకు 183 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 100 క్యూసెక్కులు, నిజాం పట్నంకాల్వకు 140 క్యూసెక్కులు, కొమ్మమూ రుకాల్వకు 1080 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల పసుపు మార్కెట్‌యార్డులో 743 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు బుధవారం విక్రయించారు. కొమ్ములు క్విం టాల్‌కు కనిష్టధర రూ.10,681, గరిష్టధర రూ. 14.011 మోడల్‌ధర రూ.13,511 పలికాయి. కాయ కనిష్టధర రూ.12.2,00 గరిష్టధర రూ. 14,011, మోడల్‌ధర రూ.13.511 పలికాయి.

విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

• వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఎస్ఆర్ కళాశాలలో ఎస్పీ ఆదేశాల ప్రకారం ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు సూచనల మేరకు, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సింగయ్య మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మైనర్‌లు వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు సులభంగా అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ అవసరం, మొబైల్ ఫోన్ వాడకంతో వచ్చే ప్రమాదాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యత వంటి అంశాలపై వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి ప్రాణ రక్షణ సాధ్యమని విద్యార్థులకు స్పష్టంగా అవగాహన కల్పించారు.

వైభవంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు

గుంటూరు(తూర్పు), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్వీఎన్ కాలనీ, శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొలువైన శ్రీ విజయ గణపతి స్వామి వారి 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు పరాశరం కృష్ణ ప్రసాదు బృందం వారిచే బుధవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, వాస్తు పూజ, వాస్తు హోమం, గణపతి హోమం, బలిహరణ, చూర్ణోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. సాయంత్రం వేళలో స్వామి వారి ద్వాదశ ప్రదక్షిణలు, ఊంజల్ సేవ కార్యక్రమాలను భక్తి ప్రపత్తులతో జరిపారు. కార్యక్రమాల్ని ఆలయ పాలకమండలి వారు పర్యవేక్షించారు.



హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న భక్తులు

ఈవీఎం గోదాముల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

• డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రోలర్ నోడల్ ఆఫీసర్ ఆంజనేయులు

గుంటూరు(తూర్పు), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎం), వీవీ ప్యాట్ల భద్రపరిచిన గోదాములకు పకడ్బందీగా భద్రతా కల్పించి, నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రోలర్ నోడల్ ఆఫీసర్ ఎస్.ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. నెలవారీ తనిఖీలలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో, ఫిరంగిపురం మండలం, రేపూడి గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎం, వీవీప్యాట్‌లు భద్రపరిచిన గోదాములను ఆయన తనిఖీ చేశారు. గోదాముల వేసిన తాళాల సీళ్ళు, సీసీ కెమెరాల రికార్డులను, భద్రత ప్రమాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గోదాముల వద్ద అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు ప్రణాళిక ప్రకారం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఖాజా వలి, ఈవీఎం నోడల్ అధికారి ప్రసాదు, ఆర్డీవో కార్యలయ అధికారి రమేష్, ఫిరంగిపురం తహసీల్దారు జే ప్రసాదరావు, ఆర్అండ్‌బీ డీప్యూటీ ఎస్ఈ హజరతయ్య తదితరులు పాల్గొన్నారు.



రేపూడిలోని ఈవీఎం గోదాములను పరిశీలిస్తున్న ఆంజనేయులు

పచ్చదనంపై గొడ్డలి వేటు

• బస్టాండ్‌లో వృక్షాల తొలగింపుపై విమర్శలు
• పట్టించుకోని అధికారులు

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించాలని పదే పదే ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా... కొందరు కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో పచ్చని వృక్షాలను నరికివేశారు. ఎన్‌టీఆర్ బస్టాండ్ ఆవరణ చుట్టూ పచ్చని వృక్షాలతో కళకళలాడుతుండేది. అయితే కింది స్థాయి సిబ్బంది కొందరు కొన్ని వృక్షాలను పూర్తిగా నరికివేయటంతో పాటు కొన్ని వృక్షాలను కొమ్మలను తొలగించటంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. వృక్షాల తొలగింపును కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్‌లలో ఫోటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చే సి వైరల్ చేశారు. వృక్షాల తొలగింపుతో ఆర్టీసీ సిబ్బందిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. పచ్చదనాన్ని పెంచాల్సిన సిబ్బంది వృక్షాలను తొలగించటంపై పలువురు ఆందోళన వ్యక్తం చేశారు.



తొలగించిన వృక్షాల కొమ్మలు



సీసీ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

వెనుకబడిన డివిజన్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం

• పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి
• రూ.1.15 కోట్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ నియోజకవర్గంలో వెనుకబడిన డివిజన్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని, గతంలో మౌలిక సదుపాయాలకు నోచుకోని ప్రాంతాల మీద ప్రత్యేక దృష్టి పెట్టి పెద్ద ఎత్తున సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గంలోని 20వ డివిజన్లో రూ.1.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, వెట్ మిక్స్ రోడ్డు నిర్మాణానికి బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సంపత్‌నగర్ మెయిన్ రోడ్డు నుంచి రామనామ క్షేత్రం మెయిన్ రోడ్డు పీకలవాగు ఔట్‌ఫాల్ డ్రెయిన్ వరకు రూ.80 లక్షలతో సీసీ డ్రెయిన్, ఆర్‌సీసీ కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. కొబ్బరితోట 2వ లైన్‌లో రూ.35 లక్షలతో సీసీ డ్రెయిన్, వెట్ మిక్స్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో తన్నీరు కృష్ణ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే మాధవి చెప్పారు. పశ్చిమ కార్యాల యంలో కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతల నుంచి వినతులు స్వీకరించారు. నియోజకవర్గ అనుబంధ సంఘాల నేతలుగా నియమితులైన నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతా నికి అనుబంధ సంఘాల నేతలు క్రియాశీలకంగా పని చేయాలని ఆమె సూచించారు.

చంద్రన్న పాలన మహిళా సాధికారతకు పునాది

అన్న ఎన్టీఆర్, చంద్రన్న పాలనలో మహిళా సాధికారతకు బలమైన పునాది వేశారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో బుధవారం తెలుగు మహిళ నూతన కమిటీ ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత, స్త్రీ సంక్షేమాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని టీడీపీ ఆవిర్భావం నుంచి పని చేస్తోందని చెప్పారు.

దుర్మార్గపు పాలన భరించలేకే ప్రజలు జగన్‌ను ఫుట్‌బాల్ ఆడారు

• టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో చేసిన దుర్మార్గపు పాలనను భరించలేకే ప్రజలు జగన్‌ను, ఆయన వైసీపీ పార్టీని ఫుట్ బాల్ అడారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు బుధవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. అందుకే జగన్ స్కోర్ 151 నుంచి 11కి పడిపోయిందన్నారు. జగన్ 1.0 లోనే జగన్ సైకోయిజం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఇక జగన్ 2.0 అంటే అరాచకం, విధ్వంసం, విచ్చలవిడితత్వం ఏ స్థాయిలో ఉంటుందో ప్రజలు ఊహించగలరన్నారు. విజ్ఞులైన ఆంధ్ర ప్రజలు జగన్‌ను నాయకుడిగా అంగీకరించలేరన్నారు. జగన్ తన పార్టీ వారిని కూడా సైకోలుగా, విధ్వంసకారులుగా, అరాచక శక్తులుగా తయారు చేస్తున్నాడని, అధికారం కోసం రాష్ట్రాన్ని నాశనం చేయాలని పూటకో అబద్ధంతో తప్పుడు ప్రచారం చేస్తున్నాడని మాణిక్యరావు తెలిపారు.

సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన విరమించం

• సహకార సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక అధ్యక్షుడు వెంకటేశ్వరరావు
• రెండో రోజుకు చేరుకున్న నిరసన కార్యక్రమాలు

గుంటూరు(తూర్పు), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దిగివచ్చి సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళనలు విరమించేది లేదని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు చేపట్టిన దశల వారీ ఆందోళనలలో భాగంగా బుధవారం స్థానిక శ్యామలనగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట చేపట్టిన ఉద్యోగుల నిరసనలు బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. వంట-వార్పు చేపట్టి తమ నిరసనను తెలిపారు. ఆయన మాట్లాడుతూ సహకార ఉద్యోగుల అడిగే న్యాయమైన డిమాండ్లతో ప్రభుత్వ ఖజానాపై ఎటువంటి భారం పడదని అన్నారు. 2019లో తీసుకొచ్చిన జీవో నెం 36ను అమలు చేసి ఉద్యోగులందరికి ప్రొసిడింగ్ ఇచ్చి డిఎల్ఎస్ఎఫ్ ఏర్పాటు చేసి జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర విభాగాల్లో మాదిరిగానే పదవి విరమణ 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. విధుల్లో మరణిస్తే ఉద్యోగి కుటుంబానికి రూ.20 లక్షలు టర్మ్ పాలసీ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కరించని నేపథ్యంలో 13న కార్యాలయాల ముట్టడి, అప్పటికి సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో 16వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో నెల్లూరు, ప్రకాశం సంఘ నాయకులు తోట వెంకట్రామయ్య, రామానాయుడు, చిరంజీవిరెడ్డి, కరుణకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హరికృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.



సహకార సంఘ కార్యాలయం ఎదుట చేపట్టిన వంట-వార్పులో పాల్గొన్న ఉద్యోగులు

వీధి జంతువుల కోసం వాటర్ బౌల్ ప్రాజెక్టు

మంగళగిరి సిటీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో వీధి జంతువులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జంతు సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నీటి పాత్రల పంపిణీ నిర్వహిస్తున్నట్టు సంస్థ మేనేజరు మహాలక్ష్మి తెలియజేశారు. మంగళగిరిలో బుధవారం నీటి పాత్రలను పంపిణీ చేశారు. చెన్నయ్, అమరావతి కేంద్రాలుగా పనిచేస్తున్న ఈ సంస్థ ద్వారా జంతు సంక్షేమంపై దృష్టి సారించి వాటర్ బౌల్స్ ప్రాజెక్టును చేపట్టామని తెలిపారు. వీధుల్లో సంచరించే కుక్కలు, పిల్లులు తదితర జంతువులకు తాగునీరు అందుబాటులో ఉండేలా పలు ప్రాంతాల్లో నీటి పాత్రలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు తమ ఇళ్ల ముందు, దుకాణాల వద్ద నీటి పాత్రలు ఏర్పాటు చేస్తే మరింత ప్రయోజనం చేకూరుతుందని, రాబోయే రోజుల్లో ఈ తరహా కార్యక్రమాలను విస్తృ తం చేస్తామని తెలియజేశారు. వీధి జంతువల సంక్షేమంపై ఆసక్తి వున్న వారు 9014232854 నెంబరులో సంప్రదించాలని కోరారు.

కష్టాల కడలిని దాటి

● గ్రూప్ 2లో మెరిసిన ఉమ్మడి జిల్లా యువత

సమాజంలో ఉన్నతంగా జీవించాలన్నా... కష్టాల కడలిని దాటాలన్నా చదువుతోనే సాధ్యమని భావించిన వారు పట్టుదలగా చదివి గ్రూప్-2 ఉద్యోగాలు సాధించారు. బుధవారం ఏపీపీఎస్సీ గ్రూప్-2 ఎంపిక జాబితా విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి బరువు అబ్బిరెడ్డి, మర్రి సురేష్, గర్నెపూడి బాబి, సమీర్, ఓంకార్, తిరుమలలక్ష్మిసాయి ప్రసన్న, బాలవికాస్ ఉద్యోగాలకు ఎంపికై ఆశయం, సంకల్పం గట్టిదైతే ఏదైనా సాధ్యమని నిరూపించారు.

-నరసరావుపేట టౌన్/ రెంటచింతల/ నకరికల్లు/ చెరుకుపల్లి/ వేమూరు/ యడ్లపాడు (ఆంధ్రజ్యోతి)



లంచ్ సమయంలో గ్రూప్స్‌కు ప్రిపరేషన్

● టీచర్‌గా చేస్తూ సబ్‌రిజిస్ట్రార్‌గా ఎంపికైన సురేష్ బాబు

టీచర్ మర్రి సురేష్ బాబు పీహెచ్‌సీ కోటాలో సబ్ రిజిస్ట్రార్ పోస్టును పొందారు. రెంటచింతలకు చెందిన మర్రి సురేష్ బాబు స్థానిక సాగర మాత జూనియర్ కళాశాలలో చదివి అటు పిమ్మట డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి 2008 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టును సాధించారు. లంచ్ సమయంలో గ్రూప్స్‌కు సంబంధించి ప్రిపేరయ్యేవాడినని ఆయన చెప్పారు. పరీక్షలకు ముందు ఒక నెలరోజుల సెలవు పెట్టి సొంతంగా ప్రిపేరై ఇంటర్వ్యూలో సబ్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యాయని తెలిపారు.



వీఆర్‌వో నుంచి సబ్‌రిజిస్ట్రార్‌గా అబ్బిరెడ్డి

నకరికల్లు వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్న బరువు అబ్బిరెడ్డి సబ్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యారు. రెంటచింతల మండలం జెట్టిపాలెంకు చెందిన ఆయన ఐటీఐ పూర్తి చేసి నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈలో డిప్లమో చేశారు. ఆ తరువాత అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ ద్వారా బీఏ, ఎంఏ హిస్టరీ పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 16 సబ్ రిజిస్ట్రార్ పోస్టులు ఉండగా జోన్-1లో అబ్బిరెడ్డిని వైజాగ్‌కు కేటాయించారు. అబ్బిరెడ్డి 2014లో జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా విలేజ్ రెవెన్యూ అధికారిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన నకరికల్లులో విధులు నిర్వహిస్తున్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి గ్రూప్-2 సాధించాలని నిర్విరామంగా కృషి చేస్తున్నానని అబ్బిరెడ్డి తెలిపారు.



ఏఎస్‌వోగా బాబి..

నరసరావుపేట పట్టణంలో ప్రకాష్‌నగర్‌కు చెందిన గర్నెపూడి బాబి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌వో)గా ఎంపికయ్యారు. గర్నెపూడి బాబి ప్రముఖ న్యాయవాది గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ సోదరుడయిన ఏఆర్ కానిస్టేబుల్ గర్నెపూడి అబ్రహం కుమారుడు. బాబి సాధించిన ఈ విజయంపై ప్రకాష్ నగర్, తాళ్లూరి నగర్ పెద్దలు, యువత హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.



మూడో ప్రయత్నంలో అర్హత

● ఏఎస్‌వోగా ఎంపికైన డిజిటల్ అసిస్టెంట్ ఓంకార్

చెరుకుపల్లి ఎంపీడీవో కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అంచా ఓంకార్ రాష్ట్ర సెక్రటేరియట్‌లో ఏఎస్‌వోగా అర్హత సాధించారు. తనతండ్రి శ్రీహరిరావు ప్రోత్సాహంతో తన మూడో ప్రయత్నంలో ఈ అర్హత సాధించినట్లు ఓంకార్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కోచింగ్ తీసుకున్నట్లు చెప్పారు. ఆయన గ్రూప్-2కు అర్హత సాధించడం పట్ల ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, డిప్యూటీఎంపిడివో ఏజీ ఏశ్రీనివాసన్, కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఎన్‌ఐటీలో బీటెక్ చేసి సివిల్స్‌పై మక్కువతో...

● సాయి ప్రసన్న (ఏఎస్‌వోగా ఎంపిక)



బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన రైతు కోగంటి లవకుమార్ కుమార్తె తిరుమలలక్ష్మి సాయి ప్రసన్న ఏపీ సెక్రటేరియట్‌లో ఏఎస్‌వోగా అర్హత సాధించారు. సాయి ప్రసన్న పది వరకు వరంగల్‌లో, ఇంటర్ విజయవాడ నారాయణ కళాశాలలో చదివి అనంతరం నాగపూర్ ఎన్ఐటీలో బీటెక్ మైనింగ్ బ్రాంచ్ కోర్సు పూర్తి చేశారు. 2018లో వేదాంత గ్రూపులో రెండున్నర సంవత్సరాలు ఉద్యోగం చేసి సివిల్స్‌పై మక్కువతో ఉద్యోగం మానేసి కోచింగ్ తీసుకున్నారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్న ఆలోచనలతో కష్టపడి చదివి గ్రూపు-2కు ఎంపికయ్యానని సాయిప్రసన్న తెలిపారు.

సమాజానికి సేవ చేయాలని..

● బాల వికాస్ (ఎక్సైజ్ ఎస్సైగా ఎంపిక)



యూకేలో ఎంఎస్ చేసిన బాపట్ల జిల్లా వరహాపురానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి కట్టా పేరయ్య కుమారుడు బాలవికాస్ గ్రూపు-2 ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా అర్హత సాధించారు. వైజాగ్‌లో బీటెక్ చదివిన వికాస్ యూకేలో ఎంఎస్ పూర్తి చేశారు. అనంతరం సివిల్స్‌లో మెయిన్స్ పాస్ అయ్యారు. 2024లో గ్రూపు-2 నోటిఫికేషన్‌కు హాజరై సెలక్ట్ కావడంతో ప్రభుత్వ ఎక్సైజ్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. గ్రూపు-2 ద్వారా తనకు ఉద్యోగం రావడం ఎంతో ఆనందంగా ఉందని వికాస్ అన్నారు.

కూలీ బిడ్డ.. నేడు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్



నాదెండ్ల మండలం రాజుగారిపాలెం గ్రామానికి చెందిన దోకిన గోపాలం, మల్లీశ్వరి దంపతులు వృత్తిరీత్యా వ్యవసాయ కూలీలు. ఈ దంపతుల కుమారుడు వెంకట్రావు చిన్నతనం నుంచి తల్లిదండ్రుల కష్టాన్ని చూస్తూ పెరిగాడు. ఎలాగైనా ఉన్నత స్థితికి చేరాలన్న లక్ష్యంతో కష్టపడి చదివాడు. 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై ప్రస్తుతం కొండవీడు పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అయితే తాను చేస్తున్న ఉద్యోగంతో సంతృప్తి పడకుండా ఉన్నత కొలువు సాధించేందుకు వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూనే అహర్నిశలు కష్టపడ్డారు. గ్రూప్-2 పరీక్షలకు హాజరై విజయం సాధించి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా ఎగ్జిక్యూటివ్ పోస్టుకు ఎంపికయ్యారు.

ఏఎస్‌వోగా ఎంపికైన పీఎస్ బాబర్ బాష



చిలకలూరిపేట మండల కావూరు గ్రామానికి చెందిన షేక్ నానా సాహెబ్, మౌలాబిల పెద్ద కుమారుడు బాబర్ బాషా ఏఎస్‌వోగా ఎంపికయ్యారు. తండ్రి ఆర్‌ఎంపీ వైద్యుడు కాగా తల్లి గృహిణి. 2019లో జరిగిన పోటీ పరీక్షల్లో పంచాయితీ కార్యదర్శిగా ఎంపికైన బాబర్ బాషా ప్రస్తుతం సందెపూడి పంచాయితీలో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఉంటూనే గ్రూప్-2 పరీక్షలకు సిద్ధమయ్యారు. గ్రూప్-2 ఫలితాల్లో బాబర్ బాషా ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఏఎస్‌వోగా ఎంపికయ్యారు. ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు స్ఫూర్తిదాయకమని పలువురు ప్రశంసించారు.

పోస్టాఫీసులో పనిచేస్తూనే చదువు

● తహసీల్దార్‌గా ఎంపికైన పోస్ట్‌మాస్టర్ సమీర్



నరసరావుపేటకు చెందిన పోస్ట్‌మాస్టర్ సమీర్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. తొలుత సచివాలయ ఉద్యోగిగా, ప్రస్తుతం పోస్టాఫీసులో పనిచేస్తూనే చదువును కొనసాగించి ఈ విజయాన్ని సాధించినట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల చేయూత

మరువలేనిది

● జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి



డాక్టర్ గోపాలకృష్ణ గోఖలేను సన్మానిస్తున్న వైద్యులు

గుంటూరు మెడికల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల, అనుబంధ ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి అన్నారు. బుధవారం జింకానా ఆడిటోరియంలో నిర్వహించిన గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (జింకోసా) వార్షిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగున్నర దశాబ్దాలుగా జింకానా, జింకోసాలు ఆసుపత్రి, కాలేజీ అభివృద్ధికి అందిస్తున్న చేయూత అభినందనీయమన్నారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ, జింకానా సౌజన్యంతో రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించిన కానూరి జింకానా తల్లీ బిడ్డల ఆరోగ్య కేంద్రంతో గర్భిణులకు, చిన్నారులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. మాజీ వైద్య ఆరోగ్య మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలో మరే ఇతర మెడికల్ కళాశాలకు లేని విధంగా గుంటూరు వైద్య కళాశాలకు జింకానా రూపంలో గొప్ప దాతలు ఉన్నారన్నారు. మాతృ విద్యా సంస్థకు వీరు అందిస్తున్న సేవలు మరువలేనివని, వీరిని స్ఫూర్తిగా తీసుకొని ఇతర వైద్య కళాశాలల పూర్వ విద్యార్థులు కూడా వారు చదివిన విద్యా సంస్థల అభివృద్ధికి చేయూతనివ్వాలని ఆయన కోరారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థులైన ప్రముఖ వైద్యులు పద్మశ్రీ అవార్డు గ్రహీతలైన డాక్టర్ యార్లగడ్డ నాయుడమ్మ, డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జింకానా అధ్యక్షుడు డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ త్రిపురనేని, జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ డి.శ్రీధర్, డాక్టర్ బి.మాధవి, జింకానా సమన్వయకర్తలు డాక్టర్ పీవీ హనుమంతరావు, డాక్టర్ ఎస్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యలంక నుంచి హైదరాబాద్‌కు

కారవాన్

● పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు

● కలెక్టర్ వినోద్‌కుమార్



సూర్యలంక తీరం నుంచి హైదరాబాద్ వరకు ఏర్పాటు చేసిన కారవాన్

బాపట్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా సూర్యలంక నుంచి హైదరాబాద్ వరకు ప్రభుత్వం కారవాన్‌లను ఏర్పాటు చేసిందని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. స్వదేశీ దర్శన్‌లో భాగంగా పర్యాటక రంగం అభివృద్ధిపై బుధవారం కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోనే ప్రథమంగా నాలుగు ప్రాంతాలలో ఇలాంటి వాహనాలను ఏర్పాటు చేయగా ఒక వాహనం బాపట్ల జిల్లా సూర్యలంకకు కేటాయించటం సంతోషదాయకమన్నారు. ఈ వాహనం సూర్యలంక నుంచి హైదరాబాద్‌కు వెళతుందన్నారు. రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ద్వారా వాహనాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు.

● ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా బుకింగ్ సదుపాయం

ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా వాహనాలను బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ వాహనంలో టీవీ, ఫ్రిజ్, వాష్‌రూమ్ వంటి వసతులు ఉంటాయన్నారు. రెండు రోజుల ప్రయాణానికి 12 సీట్లకుగాను రూ. 85 వేలు ఖర్చు అవుతుందని ఆయన తెలిపారు. ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పర్యాటకుల కోసం త్వరలో హౌస్‌బోట్‌లు వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కనువిందు చేసే దృశ్యాలతో బోటు ప్రయాణం సాగించటానికి త్వరగా పనులు చేపట్టాలని సూచించారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పేరలి డ్రైన్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటకశాఖాధికారి ఆలీ అస్గర్, ఆర్డీవో పి.గ్లోరియా, ప్రాజెక్ట్ మేనేజర్, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పొలమేలిన.. మొక్కజొన్న

(5వ పేజీ తరువాయి)

సాగు విస్తీర్ణం 56,962 ఎకరాలు. ఈ రబీలో 40,440 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 27,065 ఎకరాలు కాగా, 72,784 ఎకరాల్లో సాగు చేశారు. శనగ సాధారణ సాగు విస్తీర్ణం 28,630 ఎకరాలు కాగా 20,675 ఎకరాల్లో సాగు చేశారు. 28 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. మినుము 4,795 ఎకరాలకు గాను 1,895 ఎకరాలు, పొగాకు 2,122 ఎకరాల్లో సాగైంది. కంది 4,685 ఎకరాల్లో సాగు చేయగా సాధారణ విస్తీర్ణం కన్నా 38 శాతం తగ్గింది.

బాపట్ల జిల్లాలో..

వరి సాధారణ విస్తీర్ణం 40,247 ఎకరాలు కాగా 25,407 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 72,050 ఎకరాలు కాగా 87,898 ఎకరాల్లో సాగైంది. సాధారణం కన్నా ఇది 22 శాతం అధికం. శనగ సాధారణ సాగు విస్తీర్ణం 67,540 ఎకరాలు కాగా 84,245 ఎకరాల్లో సాగు చేశారు. 25 శాతం సాగు పెరిగింది. మినుము సాధారణ సాగు విస్తీర్ణం 63,580 ఎకరాలు కాగా 65,280 ఎకరాల్లో సాగైంది. పెసర 30,807 ఎకరాలు సాధారణం కాగా 28,360 ఎకరాల్లో సాగు చేశారు. పొగాకు సాగు గణనీయంగా తగ్గించారు. 26,472 ఎకరాలు సాధారణం సాగు విస్తీర్ణం కాగా 8,207 ఎకరాల్లో సాగు చేశారు. అంటే 69 శాతం పంట సాగు తగ్గింది. నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధించడంతో.. సాగుకు రైతులు దూరంగా ఉన్నారు.

గుంటూరు జిల్లాలో..

వరి సాధారణ విస్తీర్ణం 1,192 ఎకరాలు కాగా 1,415 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న 27,957 ఎకరాలు సాధారణ సాగు విస్తీర్ణం కాగా, 57,904 ఎకరాల్లో సాగు చేశారు. 107 శాతం అధికంగా సాగైంది. శనగ సాధారణ సాగు విస్తీర్ణం 11,165 ఎకరాలు కాగా 29,878 ఎకరాల్లో సాగు చేశారు. 168 శాతం అధికం. మినుము సాధారణ సాగు విస్తీర్ణం 8,977 ఎకరాలకు గాను 15,160 ఎకరాల్లో సాగు చేశారు. 69 శాతం సాగు పెరిగింది. పెసర సాధారణ సాగు విస్తీర్ణం 14,792 ఎకరాలకు గాను 20,624 ఎకరాల్లో సాగు చేశారు. 39 శాతం పెరిగింది. 1,486 ఎకరాల్లో మాత్రమే పొగాకు సాగు చేశారు.

పేదవాడి సొంతింటి కల

నెరవేరేనా..?

● జగనన్న కాలనీలో మార్చి నాటికి ఇంటి నిర్మాణం చేపట్టకుంటే ఇంటి సాయం రద్దు

● గత ప్రభుత్వ అధికారుల తీరుపై లబ్ధిదారుల ఆగ్రహం



పునాదులకే పరిమితమైన జగనన్న కాలనీలోని నివాస గృహాలు

వినుకొండటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీలో ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులకు సొంతింటి కల కలగానే మిగిలింది. వినుకొండలో 120 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 5,275 మంది లబ్ధిదారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో సెంటు చొప్పున నివాస స్థలాలు పొందారు. ఆగ మేఘాల మీద ఇల్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని నివాస గృహాల పనులు ప్రారంభించారు. మరో రెండు నెలల్లో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టకుంటే నివాస గృహాలకు ప్రభుత్వం కేటాయించిన రూ.1.80లక్షలకు అనర్హులయ్యే అవకాశం ఉంది. ఆప్షన్ 1 ప్లాన్ ప్రకారం కొందరు సొంతగా ఇల్లు నిర్మించుకోవడం ప్రారంభించగా అధిక భాగం 5 ఏజెన్సీలకు ఇంటి నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఆర్‌పీఎల్ ఇంజనీరింగ్ సంస్థ 406 నివాస గృహాలను కట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ కేవలం 100 మాత్రమే పూర్తి చేయగా మిగిలిన 385 నివాస గృహాలను నిర్మించాల్సి ఉంది. రామ్ కన్‌స్ట్రక్షన్స్ 1024 గృహాలకు గాను 496 గృహాలు నిర్మించాల్సి ఉంది. ముద్దు కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ 177కు గాను 11, జననీ కన్‌స్ట్రక్షన్స్ 959 గాను 56, ఏవీ కన్‌స్ట్రక్షన్స్ 15కు గాను 14 గృహాలను ఇప్పటికీ నిర్మించాల్సి ఉంది. గత ఐదు సంవత్సరాల కాలంలో 3,705 నివాసగృహాలు ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణాలకు మంజూరు కాగా కేవలం 2,064మాత్రమే నిర్మించగా మిగిలిన 3211 గృహాలు నేటికి పూర్తికాలేదు.

● ఒక్కో నివాస గృహానికి 90 కట్టల సిమెంట్

జగనన్న కాలనీ పేరుతో కేంద్రప్రభుత్వం ఒక్కో నివాస గృహానికి 90 కట్టల సిమెంటు, 20 టన్నుల ఇసుక, 480 కేజీల ఇనుముతో పాటు ఇంటికి అవసరమైన కిటికీలు, డోర్‌లు లబ్ధిదారులకు కాంట్రాక్టర్ ద్వారా అప్పగించాల్సి ఉంది. కొన్ని వ్యక్తిగతంగా నిర్మించుకున్న లబ్ధిదారులకు అధికారులు అందించాల్సి ఉంది. వ్యక్తిగత నిర్మాణాల పేరుతో కొందరు కాంట్రాక్టర్లు లబ్ధిదరుల నుంచి డబ్బులు వసూలు చేసి నేటికీ ఇళ్లు నిర్మించకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

● ప్రభుత్వానికి ఇష్టం లేకనే వదిలేసినట్లు విమర్శలు

ఐదు సంవత్సరాల కాలంలో పూర్తి కాని జగనన్న కాలనీని నేడు అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం నిర్మించడం ఇష్టంలేక వదిలేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వం నుంచి దిగుమతి చేసుకున్న ఇసుక, సిమెంటు, ఇనుములో ఆన్‌లైన్ లెక్కలకు, వాస్తవాలకు లెక్కల్లో తిరకాసు రావడంతో గుత్తేదారులు నిర్మాణాలను నిలుపుదల చేసినట్లు సమాచారం. హౌసింగ్ శాఖలో గత ఐదు సంవత్సరాల్లో పర్మినెంట్ డీఈ పోస్టును భర్తీ చేయకపోవడమే ఇందుకు ప్రధానకారణమని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇంటి నిర్మాణాల్లో కోట్ల రూపాయలు అవినీతి చోటు చేసుకున్నట్లు జగనన్న లబ్ధిదారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా గోడౌన్‌లోని తిరకాసులను ప్రభుత్వ పెద్దలు ఆరా తీయడంతో ఆన్‌లైన్‌కు వాస్తవాలకు మధ్య వ్యత్యాసం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు జగనన్న కాలనీ నిర్మాణాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలికితీసి పేదవారికి మంజూరైన ఇంటి నిర్మాణాలు చేపట్టి సొంతింటి కల నెరవేర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కాగా, ఈ విషయంపై గృహనిర్మాణ శాఖ ఏఈ అశోక్‌ను వివరణ కోరగా ఇంటి స్థలం మంజూరై ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం రద్దవుతుందని తెలిపారు.



24 గంటల పరుగుపందెంలో మెడల్ సాధించిన అబ్దుల్లా

24 గంటల పరుగు పందెంలో సత్తా

● మెడల్ సాధించిన వినుకొండ వాసి అబ్దుల్లా

వినుకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి 24 గంటల పరుగు పందెంలో వినుకొండకు చెందిన షేక్ అబ్దుల్లా ప్రతిభ కనపరిచారు. న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 24న ఉదయం 7 గంటలకు మొదలై మరుసటి రోజు 25న ఉదయం 7 వరకు జరిగిన 24 గంటల పరుగు పందెం దిగ్విజయంగా పూర్తి చేసి మెడల్ సాధించారు. ఇదలా ఉండగా జూన్ 13వ తేదీన బెంగళూరు కాంతిలాల్ స్టేడియంలో జరగబోయే 24 గంటల పరుగు పందెం (225 కిలోమీటర్లు) అర్హత సాధించారు. త్వరలో జపాన్‌లో జరగబోయే 24 గంటల ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అవార్డు సాధించిన అబ్దుల్లాను వినుకొండ పట్టణానికి చెందిన వ్యాపారులు, విద్యావంతులు అభినందించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో టోకరా

● రూ.81.20 లక్షలు కాజేసిన సైబర్ కేటుగాళ్లు

● రూ. 20 లక్షలు రికవరీ.. బాధితుడికి అందజేత

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్ళు ఓ వ్యక్తి నుంచి రూ. 81. 20 లక్షలు కాజేశారు. సైబర్ క్రైం పోలీసులు రూ.20 లక్షల 49 వేలు రికవరీ చేసి.. ఆ మొత్తాన్ని బాధితుడికి అందజేశారు. సైబర్ పోలీసుల వివరాల ప్రకారం, మంగళగిరి మండలానికి చెందిన బాధితుడిని నీరజ్ కుమార్, ప్రియాంక రెడ్డి అనే నిందితులు "జీజీఎఫ్ ఎక్స్‌చేంజ్" అనే ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌కు పరిచయం చేశారు. ప్రారంభంలో లాభాలు చూపించి నమ్మకం కలిగించిన అనంతరం, హర్ష వర్ధన్ అనే వ్యక్తిని పరిచయం చేశారు. అతను తనను "ఇ టోరో అనలైటికల్ టీమ్" సభ్యుడిగా పరిచయం చేసుకొని, 21 ట్రేడ్లతో కూడిన కాంట్రాక్ట్ ఆధారిత ట్రేడింగ్ స్కీమ్‌లో చేరాలని బాధితుడిని ఒప్పించాడు. కాంట్రాక్ట్ నిబంధనల ప్రకారం, ప్రతి విజయవంతమైన ట్రేడ్ అనంతరం 25 శాతం కమీషన్ చెల్లించాల్సి ఉండగా, ట్రేడింగ్ మొత్తం వారి వద్దనే ఉంచుతామని నిందితులు తెలిపారు. ఈ విధంగా బాధితుడు, నీరజ్ కుమార్, ప్రియాంకరెడ్డి కలిసి 12 ట్రేడ్లు నిర్వహించారు. 13వ ట్రేడ్ పూర్తయిన తర్వాత, హర్షవర్ధన్ అత్యధిక కమీషన్ డిమాండ్ చేయగా, బాధితుడు తక్షణమే చెల్లించలేనని, తన ట్రేడింగ్ వాలెట్‌లో ఉన్న నగదు నుంచి కమీషన్, పెనాల్టీ కట్ చేయాలని కోరాడు. అయితే కంపెనీ నిబంధనలు అనుమతించవని నిందితులు నిరాకరించారు. అదే సమయంలో నీరజ్ కుమార్, ప్రియాంకరెడ్డి కమీషన్లు చెల్లించలేమని చెబుతూ ట్రేడింగ్ నిలిపివేశారు. తదనంతరం ట్రేడింగ్ వెబ్‌సైట్లు పని చేయకుండా పోవడంతో పాటు, హర్ష వర్ధన్ ఫోన్ నంబర్లు కూడా పనిచేయకుండా పోయాయి. ఈ విధంగా ముగ్గురు నిందితులు కలిసి ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో బాధితుడిని మోసం చేసినట్లు విచారణలో తేలింది. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు ఈ నెల 23న సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సైబర్ పోర్టల్‌లో కూడా ఫిర్యాదు నమోదు చేశారు. ఈ మోసంలో బాధితుడు మొత్తం రూ.81 లక్షల 20 వేల నష్టం చవిచూశారు. కోర్టు ఆదేశాలతో గుంటూరు సైబర్ సెల్ చేపట్టిన దర్యాప్తు ద్వారా ఇప్పటివరకు రూ.20 లక్షల 49 వేలను రికవరీ చేసి, బుధవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా బాధితుడికి తిరిగి చెల్లించినట్లు సైబర్ క్రైమ్ సీఐ నిస్సార్ బాషా తెలిపారు. మిగిలిన మొత్తాన్ని రికవరీ చేయడానికి చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. అనుమానాస్పద ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లను నమ్మి పెట్టుబడులు పెట్టవద్దని, టెలిగ్రామ్ ఆన్‌లైన్ ట్రేడింగ్ గ్రూపులో చేరవద్దన్నారు. అధిక లాభాలు ఆశ చూపే స్కీమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



కౌన్సెలింగ్

వెన్ను నొప్పి తగ్గేదెలా?

డాక్టర్ తరచూ వెన్ను నొప్పి వేధిస్తోంది. దాంతో రోజువారీ పనులు చేసుకోలేకపోతున్నాను. ఇది జీవనశైలికి సంబంధించిన సమస్యా లేక వెన్నుపాముకు సంబంధించిన సమస్యా అనేది తెలియడం లేదు. ఒకవేళ వెన్ను సమస్య అయితే, సర్జరీతో ఫలితం ఉంటుందా? సర్జరీ ఎంతవరకూ సురక్షితం?

- ఓ సోదరి, హైదరాబాద్.

ఎక్కువ సమయంపాటు కుర్చీలో ఒకే భంగిమలో కూర్చుని పని చేయడం వల్ల, స్థూలకాయులు ఎక్కువ సమయం పాటు నిలబడి పని చేయడం వల్ల శరీర భారం వెన్ను మీద పడి, నొప్పి మొదలవవచ్చు. ఈ నొప్పుల బారిన పడకుండా ఉండాలంటే జీవనశైలిలో, అలవాట్లలో, శరీర భంగిమల్లో మార్పులు చేసుకోవాలి. అలాగే బరువులు ఎత్తేటప్పుడు మోకాళ్లను వంచి, బరువులు లేపాలి. స్థూలకాయులైతే అధిక బరువు తగ్గించుకోవాలి. ఎక్కువ సమయం కుర్చీలో కూర్చుని పని చేసే ఉద్యోగస్తులైతే, తరచూ లేచి పది నిమిషాలు నడుస్తూ ఉండాలి. ఒకవేళ వెన్ను సమస్య జీవనశైలి మార్పులతో సరి అయ్యేది కాదని తేలితే, 'స్పైన్ ఎండోస్కోపీ' శస్త్రచికిత్సను ఆశ్రయించవచ్చు. వెన్ను నొప్పి, డిస్క్ ప్రొలాప్స్ సమస్యలకు పూర్వం వెన్ను ప్రదేశంలో గాటు పెట్టి సర్జరీ చేసేవారు. కానీ ఇప్పుడు అత్యాధునిక స్పైన్ ఎండోస్కోపీ సహాయంతో గాటుతో పని లేకుండా, వెన్ను కండరాలకు నష్టం కలగకుండా, రోగి త్వరగా కోలుకునేలా స్పైనల్ సర్జరీ ముగించే వీలుంది. ఈ సర్జరీలో సమస్యకు కారణమైన ప్రదేశాన్ని వైద్యులు తెరకగా, స్పష్టంగా గుర్తించి సరిదిద్దే వీలుంటుంది. కాబట్టి వెన్ను నొప్పికి కారణాలను పరిశీలించుకుని, తగిన చికిత్స ద్వారా సమస్యను శాశ్వతంగా అధిగమించే వీలుంది.

డాక్టర్ సుకుమార్ సూర
సీనియర్ స్పైన్ అండ్ న్యూరో సర్జన్,
హైదరాబాద్.

స్ఫూర్తి

పేదరికం తలుపు తట్టినా.. వివక్ష ఎదురు నిలిచినా వెనకడుగు వేయలేదు ఆ ఆరుగురు యువతులు. మగవారికి మాత్రమే సాధ్యమనుకున్న భారీ వాహనాల స్టీరింగ్‌ను చేతబూని చరిత్ర పుటల్లోకి పింక్ బస్సులను పరుగులెత్తిస్తున్నారు.

అణచివేతను దాటి ఆకాశమే హద్దుగా



గులాబీ రంగులో మెరిసిపోతున్న ఆ 22 సీట్ల బస్సు డోర్ తీసి డ్రైవర్ సీట్లో రాజసం ఉట్టిపడేలా కూర్చుంది 22 ఏళ్ల అనితాకుమారి. సైడ్ మిర్రర్ సర్దుతున్న సహాయకుడికి సూచన ఇస్తూనే ఒకసారి అద్దంలో చూసుకుని తాపీగా యాక్సిలరేటర్ నొక్కింది. అప్పటి వరకు అవరజల్లో నిక్కబుగా ఉన్న ఆ భారీ వాహనం అనిత చేతుల్లో పసిపాపలా కదిలింది. ఇది కేవలం ఒక బస్సు ప్రయాణం కాదు.. తరతరాల సామాజిక అణచివేతను దాటుకుంటూ సాగుతున్న ఆత్మగౌరవ ప్రయాణం. బీహార్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ చరిత్రలో తొలిసారిగా ఆరుగురు మహిళలు డ్రైవర్లుగా బాధ్యతలు చేపట్టారు. అనితతోపాటు బేబీ కుమారి (22), గాయత్రి (22), ఆర్తి(21), సరస్వతి (21), రాణికి కుమారి (21).. ఈ ఆరుగురు యువతులు డ్రైవర్లు మాత్రమే కాదు.. బీహార్‌లోనే అత్యంత వెనుకబడిన 'ముసహర్' సామాజిక వర్గానికి బ్రాండ్ అంబాసిడర్లు.



అవమానపుమాటలు అధిగమిస్తూ

నిజానికి వీరి ప్రయాణం పూలబాట ఏమీకాదు. ఐదడుగుల కంటే తక్కువ ఎత్తుండే బేబీ కుమారిని చూసి 'నీ వల్లేం అవుతుంది' అని వెక్కిరించిన వారే ఎక్కువ. కానీ బేబీ గట్టి పట్టుదలతో నిలబడింది. గతంలో కనీసం సైకిల్ కూడా తొక్కడం రాని ఆమె నేడు భారీ ట్రక్కులను, బస్సులను అవలీలగా రివర్స్ గేర్‌లో పార్క్ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఒకప్పుడు తన ఎత్తు గురించి ఇతరులు చేసే కామెంట్లకు బాధపడే బేబీ.. ఇప్పుడు స్టీరింగ్ పట్టుకుంటే తన ధైర్యం హిమాలయమంత ఎత్తుకు చేరుకుంటుందని చెబుతోంది. ఈ వృత్తి తనలో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపిందని గర్వంగా చెప్పింది.

ముళ్లబాటలో పూల ప్రయాణం

ఈ మహిళా డ్రైవర్ల వెనక 'సుధా దీదీ'గా పిలిచే సామాజిక కార్యకర్త సుధా వర్గీస్ కృషితోపాటు ప్రభుత్వ సహకారం కూడా ఉంది. పౌష్టికాహార లోపం, పేదరికం తాండవించే ముసహర్ కుటుంబాల్లోని ఆడపిల్లలు చదువు మధ్యలోనే ఆపేసి పెళ్లిళ్లు చేసుకునే సంప్రదాయాన్ని సుధా వర్గీస్ మార్చాలనుకున్నారు. వారిని డ్రైవింగ్ వైపు మళ్లించడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారు. అయితే సమాజం నుంచి ఎదురైన సవాళ్లు తక్కువేం కాదు. వివాహిత అయిన సరస్వతీ కుమారికి అత్తమామలను ఒప్పించడం 'పెద్ద సవాలుగా' మారింది. 'బస్సు నడిపితే లోకం ఏమనుకుంటుంది' అన్న వారి భయాలను దాటుకుని, నేడు తన భర్త గర్వంగా పదిమందికీ చెప్పుకునేలా ఆమె తనను తాను నిరూపించుకుంది.

రిపబ్లిక్ డే పరేడ్‌లో మెరుపులు

వీరంతా 2023లో చిన్న వాహనాల లైసెన్స్, 2024లో భారీ వాహనాల లైసెన్స్ పొంది ఔరంగాబాద్‌లోని ఐడీటీఆర్ సంస్థలో వృత్తిపరమైన శిక్షణ పూర్తిచేసుకున్నారు. కేవలం బస్సు నడపడమే కాకుండా ఇంజిన్ మెకానిజం, చిన్నచిన్న రిపేర్లు కూడా నేర్చుకున్నారు. ప్రస్తుతం పాట్నా వీధుల్లో ప్రాక్టీస్ చేస్తున్న వీరిని చూసి ప్రయాణికులు ఆశ్చర్యంగా ఆగి చూస్తున్నారు. ఈ ఏడాది రిపబ్లిక్ డే పరేడ్‌లో గవర్నర్ ఎదుట తమ పింక్ బస్సులతో పరేడ్ నిర్వహించారు. ఒక కాలి కూతురిగా పుట్టి గాంధీ మైదానంలో రాష్ట్ర ప్రముఖుల ముందు బస్సు నడపడం తమ జీవితకాల స్వప్నమని ఆర్తి కుమారి ఉద్వేగంగా చెప్పింది.

> **గమ్యం వైపు దూసుకుపోతూ..**
>
> బీహార్ రోడ్లపై ప్రస్తుతం 100కుపైగా పింక్ బస్సులు నడుస్తున్నాయి. ఇప్పటి వరకు పురుషులే వీటిని నడిపేవారు. కానీ ఇప్పుడు ఈ ఆరుగురు వీరనారీలు ఆ బాధ్యతను పంచుకున్నారు. మరో 13 మంది యువతులు కూడా ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. డిగ్రీలు పూర్తి చేసినా ఉద్యోగాలు లేవని డీలా పడిపోకుండా, ఈ సమాజంలో తమకుంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలన్న వీరి తపన ఎందరో యువతులకు స్ఫూర్తిదాయకం.

వేదిక



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ వివాదం మరోసారి తెరమీదకు వచ్చింది. దీనిపై భిన్నాభిప్రాయాలు, భిన్న వాదనలు సామాజిక మాధ్యమాల వేదికగా వెలువడుతున్నాయి. తెలుగు సినిమా రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక దాడి లాంటి సమస్యలపై అధ్యయనం చేసిన 'తెలంగాణ మహిళా ట్రాన్స్‌జెండర్ జాయింట్ యాక్షన్ కమిటీ' ప్రతినిధుల్లో ఒకరైన **అచ్యుత సునీత** ఈ సందర్భంగా పలు విషయాలు 'నవ్య'తో పంచుకున్నారు. '2022లో మహిళా సంఘాలు ప్రాతినిధ్యం వహించి, ఇచ్చిన సబ్ కమిటీ నివేదికను బహిర్గతం చేయకపోవడానికి కారణం ఏమిటి?' అని ఆ కమిటీలో భాగమైన తెలుగు సినిమా పెద్దలను, తెలంగాణ ప్రభుత్వాన్ని ఆమె నిలదీస్తున్నారు.

ఈ గోప్యత ఏ గుట్టు దాచడానికి?

"తెలుగు చలనచిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ అత్యంత బలంగా వేళ్లూనుకొని ఉంది. అది ఎన్నో విధాలుగా సర్వసాధారణంగా కొనసాగుతోంది. ఆ హింసను భరించలేక ఎవరైనా ఒకరిద్దరు ధైర్యం చేసి ఫిర్యాదు ఇస్తే.. వాళ్లకు ఇక ఆ పరిశ్రమలో పని దొరకకుండా చేస్తున్న దుర్భర పరిస్థితులు చూస్తున్నాం. దానికితోడు బాధితురాలి మీదే బండలు వేస్తున్న ఉదంతాలు మనిస్తే.. కేవలం తెలుగు సినిమా రంగానికే పరిమితమైన సమస్య కాదు ఇది. హాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్, శాండల్‌వుడ్... ఇలా ప్రతిచోటా మహిళలు ఎదుర్కొంటున్న శ్రమ దోపిడి, వివక్ష, లైంగిక హింసపై పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తున్నాయి. తెలుగు సినీ పరిశ్రమ అంతా ఒకే కుటుంబమనీ, ఇక్కడ అలాంటి వేధింపులకు ఆస్కారమే లేదని అనుకోవడం ఉత్త వంచనే. సమాజంలో అన్ని రంగాల్లో ఉన్నట్టే సినీ పరిశ్రమలోనూ మహిళల అభ్యున్నతికి అవరోధాలు ఉన్నాయనే వాస్తవాన్ని మొదట సినిమా పెద్దలు అంగీకరించాలి. 'మహిళా శరీరాలు తమకు లోబడి ఉండాలి. ఎవరైనా దాన్ని ధిక్కరిస్తే, వారి మీద రకరకాల నిందలు మోపి, ఆత్మన్యూనతలోకి నెట్టేయాలి. అంతిమంగా భవిష్యత్తు లేకుండా చేయాలి' లాంటి మగస్వామ్య భావాలు బలంగా నాటుకుని ఉన్న సినీ రంగంలో మార్పు మొదలు కావాలంటే సమస్యలను గుర్తించకుండామాత్రం సాధ్యం కాదు.

విచారణలో విస్తుగొల్పే విషయాలు...

ఒకరిద్దరు బాధితురాళ్లు సినిమా పరిశ్రమలోని అవమానాలను బహిర్గతం చేసిన సమయంలో... తెలంగాణ మహిళా ట్రాన్స్‌జెండర్ ఉమ్మడి కార్యాచరణ వేదిక (జాక్) వారికి అండగా నిలిచింది. ఈ సమస్యపై క్షేత్రస్థాయి అధ్యయనం ప్రారంభించింది. విచారణ ద్వారా జూనియర్, డైలాగ్ ఆర్టిస్టులతో సన్నిహితంగా చర్చించింది. ఆ క్రమంలోనే 'జాక్'లో భాగమైన మేమంతా సమస్య తీవ్రతను అర్థం చేసుకున్నాం. దీనిపై న్యాయస్థానాన్ని, జాతీయ మానవహక్కుల వేదిక, మహిళా కమిషన్లను సైతం ఆశ్రయించాం. 'మహిళా, ట్రాన్స్‌జెండర్ జాక్' ఒత్తిడితోనే నిర్మాతలు, దర్శకులు, స్టూడియో అధినేతలతో పాటు సామాజికవేత్తలు మొత్తం 44 మందితో హైపవర్ కమిటీని 2019లో తెలంగాణ ప్రభుత్వం నియమించింది. అందులోని పెద్దలు ఎక్కువ సమయం కేటాయించలేకపోవడంతో... నాతో పాటు భూమిక సత్యవతి, అంకురం సుమిత్ర, బి.గిరిజ, న్యాయవాది వసుధ నాగరాజ్, సినీ, టెలివిజన్ రంగాలు నుంచి యూనిస్ ప్రతినిధులతో పాటు పోలీసు, మహిళా, కార్మిక తదితర ప్రభుత్వ శాఖల బాధ్యులతో కలిపి సబ్ కమిటీ ఏర్పాటైంది. మేమంతా 16 క్రాఫ్ట్‌లకు చెందిన వివిధ యూనియన్ల బాధ్యులు, జూనియర్, డైలాగ్ ఆర్టిస్టులు, నిర్మాతలు, ఇతర గ్రామీణులతో నిరంతర సమావేశాలు నిర్వహించాం. ఒక్క యూనియన్‌లోనూ అంతర్గత ఫిర్యాదుల కమిటీ లేదని మాకు అప్పుడు తెలిసింది. 'కమిట్‌మెంట్' అనే పేరుతో కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు క్యాస్టింగ్ కౌచ్ ఎంత బలంగా వ్యవస్థీకృతమైందో మాకు అర్థమైంది. నటీనటుల కో-ఆర్డినేటర్ వ్యవస్థ ప్రవేశం తర్వాత అది ఎంతగా వికృత రూపం దాల్చిందో కూడా కొంతమంది బాధితులు మాకు ఉదాహరణలతో సహా వివరించారు. ఆడిషన్‌కు పిలిచి అత్యాచారం చేసిన ఘటనలు న్నాయి. బూతుల సంస్కృతి, అవమానకరంగా మాట్లాడడం లాంటివి కూడా ఇంకా ఆ పరిశ్రమలో కొనసాగుతోన్న దోపిడీ తాలూకు రూపాలు ఒకటా, రెండా... బహిర్గతం చేయలేని విస్తుగొల్పే విషయాలెన్నో మా దృష్టికి వచ్చాయి. కుటుంబాన్ని దిక్కరించి మరీ ప్రతిభావంతులైన అమ్మాయిలు అభిరుచితో ఇక్కడకు వచ్చినా... అవమానాలు, హింస భరించలేక వెనక్కి వెళ్లిపోతున్నారు.

> **నిర్ణయాధికారంలో ఒక్కరూ లేరు**
>
> సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్టులు, యూనియన్లలో సైతం నిర్ణయాధికారాల్లో అరకొర మినహా మహిళలు లేకపోవడం ఆ రంగంలోని మగస్వామ్యానికి నిదర్శనం. డ్యాన్స్, మేకప్, ఇతర యూనియన్ బాధ్యుల్లోని మగవాళ్ల దయాదాక్షిణ్యాల ఆధారంగా మహిళలకు పని అవకాశాలు వస్తాయి. అన్యాయాన్ని ప్రశ్నిస్తే భవిష్యత్తు ప్రశ్నార్థకమే. చిత్రీకరణ ప్రదేశాల్లో దుస్తులు మార్చుకోవడానికి అనువైన గది, మరుగుదొడ్లు లాంటి కనీస వసతులను కూడా ఏర్పాటు చేయరు. వీటన్నిటిమీదా క్షుణ్ణంగా పరిశీలించిన సబ్ కమిటీ 50 పేజీలకుపైగా నివేదికను తయారు చేసి హైపవర్ కమిటీలోని వారందరితో పాటు అప్పటి ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి, మిగతా శాఖల అధికారులకు 2022లో అందించాం. ఇప్పటివరకు దాని ఊసేలేదు.

సినీ పరిశ్రమ అతీతమా?

సినిమా, టెలివిజన్ రంగంలోని ప్రతి స్టూడియో, యూనియన్, ప్రొడక్షన్ యూనిట్లతో సహా అన్ని విభాగాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆ నివేదికలో స్పష్టం చేశాం. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టానికి సినిమా, టెలివిజన్, మీడియా పరిశ్రమ అతీతమా? చలనచిత్ర రంగంలోని మహిళల సమస్యలపై చర్చించడానికి సినిమా పెద్దలకే ఆసక్తి లేదని మాకు అర్థమవుతుంది. లేకపోతే, నాలుగేళ్ల కిందట తెలంగాణ మహిళా ట్రాన్స్‌జెండర్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు ఇచ్చిన నివేదికను ఇంతవరకు బహిర్గతం చేయపోవడం వెనుక మతలబు ఏంటి? ఇంతవరకు నివేదికపై కనీసం వారైనా అంతర్గతంగా చర్చించకపోవడం శోచనీయం. మేము ఆ నివేదికను జనబాహుళ్యంలో పెట్టకపోవడానికి ప్రధాన కారణం... గోప్యతకు భంగం కలిగించారన్న నెపంతో ప్రభుత్వం, సినిమా రంగ పెద్దలు ఎక్కడ ఆ నివేదికను బుట్టదాఖలు చేస్తారన్న ఆందోళనే! ఇంకెంతకాలం సమస్యను గుప్పెట దాచి ఉంచుతారు? ఇప్పటికైనా నివేదికను ప్రభుత్వం బహిర్గతం చేయాలి. దీనిమీద చర్చించాలని సినీ పెద్దలకు నా సూచన."

• సాంత్వన్

బరువు తగ్గాలా..!

కొత్త సంవత్సర వేడుకలు, సెలవుల్లో రకరకాల వంటకాలు, స్వీట్లు లాగించేసి ఉంటారు. దీనివల్ల బరువు పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే కఠినమైన డైటింగ్‌లు, ఖరీదైన సప్లిమెంట్లు అక్కర్లేదు. మన వంటింట్లో లభించే వాటితోనే సులభంగా బరువు తగ్గొచ్చు. అదెలాగో చూద్దాం.

వాముమీరు: జీర్ణక్రియను మెరుగుపరచడంలో వాముకు మించింది లేదు. ఉదయాన్నే పరగడుపున గోరువెచ్చని వామునీరు తాగితే మెటబాలిజం పెరుగుతుంది. ఇది పొట్ట ఉబ్బరాన్ని తగ్గించడమే కాకుండా కొవ్వు కరగడానికి సాయపడుతుంది.

జీలకర్ర-సోంపు: జీలకర్ర, సోంపు రెండూ శరీరంలోని మలినాలను బయటకు పంపుతాయి. గ్లాసు నీటిలో చెంచా జీలకర్ర, సోంపు వేసి మరిగించి రోజంతా అప్పుడప్పుడు తాగుతుంటే శరీరంలో అదనపు నీరు చేరకుండా ఉంటుంది. తద్వారా బరువు తగ్గుతారు.

నానబెట్టిన మెంతులు: మెంతుల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. రాత్రంతా నానబెట్టిన మెంతులను ఉదయాన్నే తిన్నా లేదంటే ఆ నీటిని తాగినా ఆకలి అదుపులో ఉంటుంది. ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచి కొవ్వు కణాలను కరిగిస్తుంది.

త్రిఫలచూర్ణం: ఆయుర్వేదంలో త్రిఫల చూర్ణానికి ప్రత్యేక స్థానం ఉంది. రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని నీటిలో ఒక చెంచా త్రిఫలచూర్ణం కలిపి తీసుకుంటే పేగులు శుభ్రపడి జీర్ణక్రియ వేగవంతమవుతుంది. బరువు తగ్గడానికి శుభ్రమైన జీర్ణవ్యవస్థ చాలా ముఖ్యం.

వేడినీటితో తేనె, నిమ్మరసం: ఇది అందరికీ తెలిసిన చిట్కానే. అత్యంత ప్రభావవంతమైనది. రోజూ ఉదయం గోరువెచ్చని నీటిలో నిమ్మరసం, కొద్దిగా తేనె కలిపి తాగితే శరీరంలోని వ్యర్థాలు పోయి కొవ్వు కరగడం వేగవంతమవుతుంది.

అల్లం టీ: గ్రీన్‌టీకి కొద్దిగా అల్లం కలిపితే అది పవర్‌ఫుల్‌లా పనిచేస్తుంది. అల్లం ఆకలిని తగ్గించి, జీవక్రియను పెంచుతుంది. అల్లం అరుగుదలకు సాయపడటమే కాకుండా రోగ నిరోధకశక్తిని పెంచుతుంది.



సంకల్పం

ఇన్‌స్టాలోకి వెళ్లినా... ఫేస్‌బుక్ పేజీలు తిప్పినా... మనకు తరచూ కనిపించేవి... 'నాడు- నేడు' చిత్రాలు. సరదాకు కొందరు... అపురూపంగా కొందరు... తమను తాము 'పాత- కొత్త'లతో పోల్చుకొని మురిసిపోతుంటారు. కానీ మరికొందరు... నాడు రగిలించిన సామాజిక చైతన్యాన్ని... నేడూ కొనసాగిస్తూ... అదే స్ఫూర్తిని నింపుతుంటారు. అప్పుడు... ఇప్పుడు... మార్పు కోసం పరితపించే అలాంటి ఇద్దరు అమ్మాయిల పరిచయమే ఇది.





నాడు... నేడు మార్పే వారి మంత్రం

జన్నత్.. దాల్ లేక్ కోసం

చిన్న వయసు... పెద్ద ఆలోచనలు. జన్నత్ చిన్నప్పుడు ప్రయాణం ఆరంభించిన సామాజిక అంశాలతోనే ముడిపడి సాగుతోంది. భూతల స్వర్గం కశ్మీర్‌లో పుట్టిన జన్నత్... అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ పెరిగింది. నాలుగేళ్ల వయసు నుంచి పడవలో తండ్రి పక్కన కూర్చుని ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన దాల్‌లేక్ సరస్సులో విహరించింది. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్న సరస్సును చూసి, సరస్సుల నుంచి కాపాడుకోవడమే బాధ్యతగా తన తండ్రితో కలిసి తన వంతు ప్రయత్నం మొదలుపెట్టింది. పడవలో కూర్చుని వలతో నీటిలోని వ్యర్థాలను బయటకు తీసిన ఆ చిన్నారి... తరువాత కూడా ఆ కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే ఉంది. తోటి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపింది. అలనాటి చిత్రాన్ని జీవితం తన ఇన్‌స్టాలో పోస్టు చేసింది జన్నత్. జతగా ఇప్పటి ఫొటో కూడా పంచుకుంది.

నేడూ అదే చైతన్యం...

పదేళ్లు గడిచిపోయాయి... జన్నత్ జీవితంలో. కానీ ఆమె సంకల్పం చెక్కు చెదరలేదు. పర్యావరణ పరిరక్షణ కోసం జన్నత్ చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రధాని మోదీ నుంచి గౌరవ పురస్కారం సైతం అందుకుంది. అయినా ఇసుమంతైనా గర్వం లేదు ఆమెలో. నేటికీ అదే అంకితభావం... ఉత్సాహం. ఎదుగుతున్నా... ప్రతి ఆదివారం మాత్రం దాల్ లేక్ ముందు వాలిపోతుంది. దాని ఒడ్డున ఒక వల పట్టుకుని... చిన్న పడవ ఎక్కి... అందులోని



వ్యర్థాలను తొలగించే పనిలో నిమగ్నమైపోతుంది. ప్రజల్లో చైతన్యం రగిలించి... వారిని కూడా ఆ దిశగా అడుగులు వేయిస్తుంది. అవగాహన సదస్సులు నిర్వహించి... సామాన్యులతో పాటు ప్రభుత్వ యంత్రాంగాన్నీ కదిలించింది. దాల్‌లేక్ పరిరక్షణను ఒక ఉద్యమంలా ముందుకు నడిపిస్తోంది. 'మాతృభూమిని ప్రేమించండి. మాటలతో కాదు... మీ చేతలతో' అంటూ నాడు తండ్రి నింపిన స్ఫూర్తితో నేటికీ జన్నత్ ఇందరిని నడిపిస్తోంది.

చరణ్య.. సంస్కృతి పరిచయం

పదేళ్ల కిందటి తన ఫొటోను... తాజా చిత్రంతో కలిపి ఇన్‌స్టాలో పెట్టింది చరణ్య కుమార్. ఈ దశాబ్ద కాలంలో ఆమె జీవితంలో ఎన్నో మార్పులేమీ జరగలేదు. కానీ తన చుట్టూ ఉన్నవారిలో మార్పు తేవడంలో సఫలమయ్యారు. అమూల్యమైన భారతీయ సంస్కృతిని భావితరాలకు అందించే బృహత్తర కార్యక్రమానికి నాడు శ్రీకారం చుట్టిన ఆమె... నేడు దాన్నొక పెద్ద వ్యవస్థగా మార్చారు. 'చిత్రమ్' పేరుతో పర్యావరణహిత విద్యా, వినోద స్టార్టప్‌ను తీసుకువచ్చారు. పిల్లలు, పెద్దలు కలిసి ఆడే పజిల్‌లు రకాల బోర్డ్, కార్డ్ గేమ్స్, యాక్టివిటీ కిట్లను సంస్థ పరిచయం చేసింది. వీటన్నిటినీ సాంస్కృతిక, ఆధ్యాత్మిక విద్యను సరదాగా, అదే సమయంలో అర్థవంతంగా బోధించే సాధనాలుగా రూపొందించింది. అంతే కాదు... పాఠశాలలకు వెళ్లి అక్కడి పిల్లలతో ఆటలు ఆడిస్తూ, అవగాహన కల్పిస్తున్నారు చరణ్య. ఇందుకుగాను ఆమె పలు పురస్కారాలు, ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు.

భావితరాలకు అందించాలని...

బాల్యం నుంచి భారతీయ సంస్కృతి, చరిత్ర పట్ల ఆసక్తి కనబరిచిన చరణ్య... తోటి పిల్లలకు అందులోని కథలూ చెప్పింది. అమెరికాలోని నార్త్ కరోలినా యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఎంఎస్ చేసిన ఆమె... 2014లో 'ఇన్‌సీడ్ బిజినెస్ స్కూల్'లో ఎంబీయే చదివింది. భారత్‌కు తిరిగి వచ్చాక బెంగళూరులోని వివిధ సంస్థల్లో ఉద్యోగం చేసింది 2021లో 'గురుకుల్ ఫన్ స్టార్టప్'ను నెలకొల్పింది. తరువాత ఆ సంస్థ నుంచి బయటకు వచ్చి మూడున్నరేళ్ల కిందట స్వస్థలం చెన్నైలో 'చిత్రమ్'ను ప్రారంభించింది. ఇప్పుడు ప్రముఖ సంస్థలతో కలిసి తన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుంటున్నారు చరణ్య. లక్ష్యం... డబ్బు సంపాదన ఒక్కటే కాదు. భారతీయ మూలాలను భావితరాలకు అందించాలన్న బలమైన ఆకాంక్ష కూడా.



స్లైడింగ్ ట్రాక్‌లు ఇలా శుభ్రం

వార్ రోబ్‌లు, కిటికీలు, బాల్కనీలు, గది లేదా ఆఫీస్ డివైడర్లు, భద్రత వర్ణర్లు, గిడ్డంగులు, క్యాబినెట్‌లు తలుపులు తెరవడానికి మూయడానికి ఉపయోగించే స్లైడింగ్ ట్రాక్‌లలో తరచూ దుమ్ము, మురికి చేరుతూ ఉంటాయి. వీటిని సులువుగా శుభ్రం చేసే చిట్కాలు...

- వ్యాక్యూమ్ క్లీనర్‌కు సన్నని నాజిల్‌ను అమర్చి దానితో స్లైడింగ్ ట్రాక్‌లో ఉండే దుమ్ము, ధూళిని సులభంగా వ్యాక్యూమ్ చేయవచ్చు.
- ట్రాక్‌లో బేకింగ్ సోడా చల్లి దానిపైన కొద్దిగా వెనిగర్‌ను చిలకరిస్తే నురుగు ఏర్పడుతుంది. ఇది మొండి మురికిని కరిగిస్తుంది. పది నిమిషాల తరువాత పాత గుడ్డ లేదా బ్రష్‌తో తుడిచేస్తే ట్రాక్ శుభ్రమవుతుంది.
- సబ్బు నీళ్లలో ముంచిన స్పాంజ్‌ను ట్రాక్‌పై ఉంచి నొక్కుతూ గట్టిగా తుడవాలి. పెన్ లేదా కర్ర సహాయంతో స్పాంజ్‌ను లోపలికి నెట్టి ముందుకు జరుపుతూ తుడిస్తే ట్రాక్‌లో పేరుకున్న మురికి తొలగిపోతుంది. లేదంటే స్పాంజ్ మధ్యలో ట్రాక్ ఆకారంలో పొడవుగా కత్తిరించుకుని చేసి వాటి సహాయంతో అన్ని వరుసలను ఒకేసారి శుభ్రం చేయవచ్చు.
- చిన్న సైజు పెయింటింగ్ బ్రష్‌తో ట్రాక్‌లో చేరిన దుమ్మును దులపవచ్చు. తరువాత తడిగుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది.
- హెయిర్ డ్రైయర్ సహాయంతో ట్రాక్‌లోని దుమ్మును ఒక మూలకు చేర్చాలి. తరువాత తడి గుడ్డతో దాన్ని తీసివేయాలి.



- అర గ్లాసు నీళ్లలో రెండు చుక్కల డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లను స్ప్రే బాటిల్‌లో పోసి స్లైడింగ్ ట్రాక్ లోపల స్ప్రే చేయాలి. పది నిమిషాల తరువాత టిష్యూ పేపర్‌తో తుడిచేస్తే ట్రాక్ క్లీన్‌గా మారుతుంది.



స్వియటెక్ అవుట్



రిబకినా చేతిలో పరాజయం

- సినర్, జొకోవిచ్ ముందుకు
- ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ప్రపంచ టెన్నిస్ నెంబర్ టూ క్రీడాకారిణి ఇగా స్వియటెక్‌కు మరోసారి చుక్కెదురైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ సాధించాలన్న ఆమె కల భగ్నమైంది. కెరీర్‌లో ఇప్పటికే నాలుగు ఫ్రెంచ్ ఓపెన్, ఓ వింబుల్డన్, యూఎస్ ఓపెన్ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఈ పోలెండ్ స్టార్‌ను మెల్‌బోర్న్ ట్రోఫీ మాత్రం ఊరిస్తూనే ఉంది. ఈసారి ఎలాగైనా టైటిల్ గెలుస్తానని టోర్నీ ఆరంభానికి ముందు ధీమా వ్యక్తం చేసిన స్వియటెక్‌కు క్వార్టర్‌ఫైనల్లో ఎలెనా రిబకినా (కజకిస్థాన్) ఝలకిచ్చింది. మాజీ ఫైనలిస్టు, ఐదోసీడ్ రిబకినా 7-5, 6-1తో రెండో సీడ్ స్వియటెక్‌ను వరుస సెట్లలో చిత్తు చేసింది. కెరీర్‌లో ఏకైక గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్‌ను 2022లో అందుకున్న 26 ఏళ్ల రిబకినా.. ఇక్కడ 2023లో రన్నరప్‌గా నిలిచింది. ఆ తర్వాత ఈ వేదికపై ఆమెకిదే అత్యుత్తమ ప్రదర్శన. గురువారం జరిగే సెమీఫైనల్లో ఆరో సీడ్ జెస్సికా పెగులాతో రిబకినా అమీతుమీ తేల్చుకోనుంది. క్వార్టర్స్‌లో పెగులా (అమెరికా) 6-2, 7-6 (7-1)తో తన దేశానికే చెందిన నాలుగో సీడ్ అమండా అనిసిమోవాను ఓడించింది. మహిళల మరో సెమీస్‌లో టాప్‌సీడ్ సబలెంకతో 12వ సీడ్ స్విటోలినా తలపడనున్న సంగతి తెలిసిందే.

సెమీస్‌లో ఎవరెవరు?
పురుషుల సింగిల్స్
అల్కారజ్ x జ్వెరెవ్
సినర్ x జొకోవిచ్
మహిళల సింగిల్స్
సబలెంక x స్విటోలినా
రిబకినా x పెగులా

జొకో..హమ్మయ్య!

రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలోవున్న జొకోవిచ్.. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అదృష్టం వరించడంతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. అందుకేనేమో.. జొకోవిచ్ కూడా 'నేను చాలా లక్కీ' అని క్వార్టర్స్ పోరు తర్వాత వ్యాఖ్యానించాడు. ప్రీక్వార్టర్స్ బరిలో దిగకుండానే ప్రత్యర్థి నుంచి వాకోవర్ అందుకున్న నాలుగోసీడ్ జొకో.. క్వార్టర్స్ పోరులో మైదానంలో కాసేపు తలపడ్డాక ప్రత్యర్థి, 5వ సీడ్ ముసెట్టి (ఇటలీ) గాయంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. అయితే, ఆ సమయానికి రెండు సెట్లను 4-6, 3-6తో కోల్పోయిన నొవాక్.. మూడో సెట్‌లో మాత్రం 3-1తో ఆధిక్యంలో ఉన్నాడు. ఇక, సెమీస్‌లో సినర్‌తో జొకో అమీతుమీ తేల్చుకోనున్నాడు. మరో క్వార్టర్స్‌లో రెండో సీడ్ సినర్ (ఇటలీ) 6-3, 6-4, 6-4తో బెన్ షెల్టన్ (అమెరికా)ను ఓడించాడు. రెండో సెమీస్‌లో టాప్‌సీడ్ అల్కారజ్, మూడో సీడ్ జ్వెరెవ్ ఢీకొంటారు.

దూబే.. దంచేసినా

నాలుగో టీ20లో భారత్‌పై కివీస్ విజయం

● సీఫెర్ట్ అర్ధ శతకం ● తిప్పేసిన శాంట్నర్


శివం దూబే (23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 65)


టిమ్ సీఫెర్ట్ (36 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 62)

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆల్‌రౌండర్ శివం దూబే (23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 65) ధనాధన్ అర్ధశతకంతో అదరగొట్టినా.. మిగతా బ్యాటర్ల వైఫల్యంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. బుధవారం జరిగిన నాలుగో టీ20లో టీమిండియా 50 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చేతిలో ఓడింది. తొలుత కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో 215/7 స్కోరు చేసింది. టిమ్ సీఫెర్ట్ (36 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 62) అర్ధ శతకం సాధించగా.. కాన్వే (44), డారెల్ మిచెల్ (39 నాటౌట్) రాణించారు. అర్ష్‌దీప్, కుల్దీప్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఛేదనలో భారత్ 18.4 ఓవర్లలో 165 పరుగులకు కుప్పకూలింది. రింకూ సింగ్ (39), సంజూ శాంసన్ (24) ఫర్వాలేదనిపించారు. శాంట్నర్ మూడు వికెట్లు పడగొట్టగా.. జాకబ్ డఫీ, ఇష్ సోధీ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో న్యూజిలాండ్ 1-3తో భారత్ ఆధిక్యాన్ని తగ్గించింది. ఫిటెనెస్ లోపంతో ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. సీఫెర్ట్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఆరంభంలోనే తడ'బ్యాటు'..

ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ అభిషేక్ శర్మ (0) డకౌట్ కాగా.. రెండో ఓవర్లో సూర్య కుమార్ (8)ను డఫీ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు.. 9 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన తరుణంలో శాంసన్, రింకూ మూడో వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. దీంతో భారత్ ఆరు ఓవర్లకు 53/2తో నిలిచింది. అయితే, శాంసన్, హార్దిక్ పాండ్యా (2)ను శాంట్నర్, తర్వాత రింకూను ఫోక్స్ ఎల్బీ చేశారు. అయితే ఈ దశలో ఒక్కసారిగా విజృంభించిన దూబే.. విజయంపై ఆశలు రేపాడు. సోధీ వేసిన 12వ ఓవర్‌లో దూబే రెండు ఫోర్లు, మూడు సిక్స్‌లతో కలిపి 29 పరుగులు పిండుకోవడంతో స్కోరు బోర్డు ఊపందుకొంది. ఈ క్రమంలో రాణా (9)తో కలసి దూబే ఆరో వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. కానీ, దూబే రనౌట్ కావడంతో టీమిండియా పరాజయం లాంఛనమే అయింది. విజయానికి చివరి 30 బంతుల్లో 71 పరుగులు కావల్సి ఉండగా.. హర్షిత్, అర్ష్‌దీప్ (0), బుమ్రా (4), కుల్దీప్ (1) పెవిలియన్‌కు క్యూ కట్టారు.

చెలరేగిన ఓపెనర్లు..

ఓపెనర్లు కాన్వే, సీఫెర్ట్ పవర్‌ప్లేలో అదరగొట్టడంతో.. న్యూజిలాండ్ భారీ స్కోరు చేసింది. తొలి వికెట్‌కు వీరిద్దరూ 100 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ట పునాది వేశారు. టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఆరంభం నుంచే భారత బౌలర్లపై విరుచుకుపడింది. ముఖ్యంగా సీఫెర్ట్ ఎడాపెడా షాట్లతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో పవర్‌ప్లేను కివీస్ 71/0తో ముగించింది. 9వ ఓవర్‌లో కాన్వేను అవుట్ చేసిన కుల్దీప్ జట్టుకు తొలి బ్రేక్ అందించాడు. ఆ వెంటనే రచిన్ (2)ను బుమ్రా వెనక్కి పంపాడు. ఇక సీఫెర్ట్‌ను అర్ష్‌దీప్ క్యాచవుట్ చేశాడు. ఫిలిప్స్ (24)ను కుల్దీప్.. చాప్‌మన్ (9)ను బిష్ణోయ్ పెవిలియన్‌కు చేర్చారు. కెప్టెన్ శాంట్నర్ (11)ను పాండ్యా అద్భుత త్రోతో రనౌట్ చేయగా..ఫోక్స్(13)ను అర్ష్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. కానీ, డెత్ ఓవర్లలో మిచెల్ ధాటిగా ఆడడంతో టీమ్ స్కోరు 200 పరుగుల మార్క్ దాటింది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్: కాన్వే (సి) రింకూ (బి) కుల్దీప్ 44, సీఫెర్ట్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 62, రచిన్ (సి అండ్ బి) బుమ్రా 2, ఫిలిప్స్ (సి) రింకూ (బి) కుల్దీప్ 24, చాప్‌మన్ (సి) హర్షిత్ (బి) బిష్ణోయ్ 9, మిచెల్ (నాటౌట్) 39, శాంట్నర్ (రనౌట్/పాండ్యా) 11, ఫోక్స్ (సి) రింకూ (బి) అర్ష్‌దీప్ 13, హెన్రీ (నాటౌట్) 6; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 215/7; వికెట్ల పతనం:** 1-100, 2-103, 3-126, 4-137, 5-152, 6-163, 7-182; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-33-2, హర్షిత్ రాణా 4-0-54-0, బుమ్రా 4-0-38-1, బిష్ణోయ్ 4-0-49-1, కుల్దీప్ 4-0-39-2.

భారత్: అభిషేక్ (సి) కాన్వే (బి) హెన్రీ 0, శాంసన్ (బి) శాంట్నర్ 24, సూర్య కుమార్ (సి అండ్ బి) డఫీ 8, రింకూ సింగ్ (ఎల్బీ) ఫోక్స్ 39, హార్దిక్ (సి) ఫోక్స్ (బి) శాంట్నర్ 2, దూబే (రనౌట్/హెన్రీ) 65, హర్షిత్ రాణా (సి) రచిన్ (బి) సోధీ 9, బిష్ణోయ్ (నాటౌట్) 10, అర్ష్‌దీప్ (సి) శాంట్నర్ (బి) సోధీ 0, బుమ్రా (సి) సోధీ (బి) శాంట్నర్ 4, కుల్దీప్ (సి) సీఫెర్ట్ (బి) డఫీ 1; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 18.4 ఓవర్లలో 165 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-9, 3-55, 4-63, 5-82, 6-145, 7-157, 8-157, 9-162, 10-165; **బౌలింగ్:** హెన్రీ 3-0-24-1, డఫీ 3.4-0-33-2, ఫోక్స్ 3-0-29-1, సోధీ 4-0-46-2, శాంట్నర్ 4-0-26-3, ఫిలిప్స్ 1-0-7-0.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

బెంగళూరు x యూపీ (రా. 7.30)



రో-కో దిగితే రూల్స్ మార్చాల్సిందే!

ప్రసార నిబంధనల సవరణ దిశగా బోర్డు

న్యూఢిల్లీ: జాతీయ జట్టు మ్యాచ్‌లు లేని సమయాల్లో కేంద్ర కాంట్రాక్టులో ఉన్న క్రికెటర్లంతా దేశవాళీ పోటీల్లో ఆడాల్సిందేనని బీసీసీఐ కొన్ని సంవత్సరాల కిందట ఆదేశించింది. స్టార్ క్రికెటర్లు దేశవాళీ పోటీల్లో పాల్గొంటే అభిమానులు కూడా స్టేడియాలకు పెద్ద సంఖ్యలో వస్తారనేది బీసీసీఐ ఆలోచన. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇటీవల విజయ్‌హజారే మ్యాచ్‌ల్లో తమ దేశవాళీ జట్లతరపున బరిలోకి దిగినపుడు ఫ్యాన్స్ భారీగా తరలి రావడమే దీనికి చక్కటి ఉదాహరణ. ఈ ఇద్దరు స్టార్ల మ్యాచ్‌లకు హాజరు కాలేకపోయిన ఫ్యాన్స్..వారి ఆటను టీవీలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించలేక పోయినందుకు సోషల్ మీడియా వేదికగా బీసీసీఐపై ఆగ్రహం ప్రకటించారు. ఈక్రమంలో దేశవాళీ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాలకు సంబంధించి బీసీసీఐ తన విధానాన్ని పునఃసమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజీత్ సైకియా కూడా అంగీకరించారు. '100 దేశవాళీ మ్యాచ్‌లు మాత్రమే ప్రత్యక్షం ప్రసారం చేసేలా టెలివిజన్ సంస్థతో బీసీసీఐ ఒప్పందం కుదుర్చుకుంది. కానీ ఇప్పుడు ఆ ఒప్పందాన్ని సవరించాలని బోర్డు భావిస్తోంది. 'స్టార్ క్రికెటర్లు ఆడుతున్నందున 100 మ్యాచ్‌లకు మించి ప్రత్యక్ష ప్రసారం చేసేలా చర్యలు తీసుకుంటాం' అని దేవజీత్ చెప్పుకొచ్చారు.

టాప్-10లో సూర్య

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్

దుబాయ్: ప్రస్తుత న్యూజిలాండ్ సిరీస్‌తో ఫామ్‌లోకొచ్చిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ర్యాంకింగ్స్‌లోనూ దూసుకెళ్లాడు. బుధవారం ప్రకటించిన టీ20 బ్యాటర్ల జాబితాలో సూర్య ఏకంగా ఐదు స్థానాలు ఎగబాకాడు. తద్వారా ఏడో ర్యాంక్‌తో టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. ఇక, అభిషేక్ శర్మ నెంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా, తిలక్ వర్మ మూడో స్థానంలో మార్పు లేదు. మిగతా బ్యాటర్లలో శివమ్ దూబే 58వ, ఇషాన్ కిషన్ 64వ, రింకూ సింగ్ 68వ ర్యాంకుల్లో ఉన్నారు. బౌలర్ల జాబితాలో బుమ్రా నాలుగు స్థానాలు మెరుగై 13వ, రవి బిష్ణోయ్ 13 స్థానాలు ఎగబాకి 19వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. వరుణ్ చక్రవర్తి టాప్ ర్యాంక్‌ను పదిలపరుచుకున్నాడు.

జ్యోతికి ఇంటిస్థలం, ఉద్యోగం

రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం



అమరావతి (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజీ ప్రతిభకు ప్రోత్సాహకం లభించింది. జ్యోతికి విశాఖపట్నంలో 500 గజాల ఇంటి స్థలంతో పాటు డిగ్రీ పూర్తయ్యాక గ్రూప్-1 ఉద్యోగాన్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుమతిస్తూ రాష్ట్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా జ్యోతికి అండగా నిలిచిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు మంత్రివర్గ సభ్యులకు శాప్ చైర్మన్ రవి నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

షట్లర్ కృష్ణప్రసాద్‌పై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ: డబుల్స్ స్పెషలిస్టు కృష్ణప్రసాద్ గరగపై నాలుగేళ్ల నిషేధాన్ని జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ఎత్తివేసింది. కాకినాడకు చెందిన 25 ఏళ్ల కృష్ణప్రసాద్ 2022లో థామస్ కప్ స్వర్ణం గెలిచిన భారత జట్టులో సభ్యుడు. అయితే డోపింగ్ ఆరోపణలతో 2024లో అతడిపై నిషేధం విధించారు.

దేశమే గొప్ప.. ఎంపీలంతా ఏకమవ్వాలి

- వికసిత్ భారత్ లక్ష్యంగా కలిసి పనిచేయాలి : రాష్ట్రపతి
- పార్లమెంటులో ఉభయసభలనుద్దేశించి ప్రసంగించిన ముర్ము

న్యూఢిల్లీ, జనవరి 28: వికసిత్ భారత్ లక్ష్యంగా పార్లమెంటు సభ్యులందరూ ఏకతాటిపై నిలిచి పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. విభేదాలకు అతీతంగా స్వదేశీ వస్తువుల వినియోగం, దేశ భద్రత వంటి అంశాల్లో కలిసి పనిచేయాలని కోరారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఆమె ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. విభిన్న అభిప్రాయాలు, వేర్వేరు దృక్కోణాలు ఉన్నప్పటికీ దేశం విషయంలో మాత్రం అంతా ఏకమవ్వాలని.. దేశం కంటే గొప్పదేమీ లేదని ముర్ము చెప్పారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజమని.. కొన్ని అంశాల్లో మాత్రం వాటికి తావుండకూడదని, ఇదే విషయాన్ని మహాత్మా గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, వల్లభాయ్ పటేల్, జయప్రకాశ్ నారాయణ్, రామ్‌మనోహర్ లోహియా, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వాజ్‌పేయిలూ విశ్వసించారని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల విషయంలో ఎంపీలందరూ ఐక్యంగా నిలబడాలన్నారు. కాగా రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన తర్వాత లోక్‌సభ, రాజ్యసభల్లో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇక రాష్ట్రపతి ప్రసంగంపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. ఆమె ప్రసంగం నిస్సారంగా ఉందని ఆరోపించింది.

ఢాకాలో డ్రోన్ల తయారీ కేంద్రం!

- చైనాతో బంగ్లాదేశ్ రక్షణ ఒప్పందం

ఢాకా, జనవరి 28: బంగ్లాదేశ్ రక్షణ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా డ్రోన్ల (యూఏవీ) తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చైనాతో రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మంగళవారం ఢాకాలో జరిగిన సమావేశంలో బంగ్లాదేశ్ వైమానిక దళం (బీఏఎఫ్), చైనాకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ 'చైనా ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్ (సీఈటీసీ) ప్రతినిధులు ఈ ఒప్పందంపై సంతకాలు చేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. ఈ ఒప్పందం ప్రకారం, బీఏఎఫ్, సీఈటీసీ సంయుక్తంగా అత్యాధునిక డ్రోన్ల తయారీ, అసెంబ్లింగ్ కేంద్రాన్ని బంగ్లాదేశ్‌లో నెలకొల్పుతాయి. కేవలం యంత్రాలను సరఫరా చేయడమే కాకుండా, చైనా ఈ ప్రాజెక్టు ద్వారా కీలకమైన సాంకేతికతను బంగ్లాకు బదిలీ చేస్తుంది. దీనివల్ల దీర్ఘకాలంలో బంగ్లాదేశ్ ఎవరిపైనా ఆధారపడకుండా స్వయంగా డ్రోన్లను నిర్మించుకునే సామర్థ్యాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని సాధిస్తుంది.

పనిమనుషులుగా చేరి 18కోట్లు కొట్టేశారు!

- బిల్డర్ ఇంటిని లూటీ చేసిన నేపాల్ దంపతులు, మరో ముగ్గురు .. బెంగళూరు యమలూరులో ఘటన

బెంగళూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో భారీ చోరీ జరిగింది. మారతహళ్లి కెంపాపుర రోడ్డులోని యమలూరులో రియల్టర్, బిల్డర్ శివకుమార్ ఇంట్లో రూ.18కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలు, వెండి సామగ్రి, నగదును ఎత్తుకుపోయారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో పని మనుషులైన నేపాల్ దంపతులు, మరో ముగ్గురు కలిసి ఈ చోరీ చేసినట్టు గుర్తించారు. ఆదివారం ఈ ఘటన జరిగింది. శివకుమార్ కుటుంబీకులు యమలూరులోని ఏఎస్‌కే లేక్ గార్డెన్‌లో నివసిస్తున్నారు. వీరి ఇంట్లో సిద్దరాజు, అంబిక వంట మనుషులు. నేపాల్‌కు చెందిన దినేశ్ (32), కమల (25) అనే దంపతులు వికాస్, మాయ విష్ణు అనే ఇద్దరి ద్వారా 20 రోజుల క్రితం పనికి చేరారు. శివకుమార్ ఆదివారం ఉదయం ఊరికి వెళ్లారు. ఆయన కుమారుడు, భార్య, తల్లి బంధువుల ఇంట పూజా కార్యక్రమానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దినేశ్, కమల మరో ముగ్గురిని రప్పించుకున్నారు. మొదటి అంతస్తులోని అల్మారాను ధ్వంసం చేసి అందులోని 11.5కేజీల బంగారం, వజ్రాభరణాలు, 5కేజీల వెండి, రూ.11.50 లక్షల నగదును దోచుకున్నారు. వంట మనిషి అంబిక యజమానులకు ఫోన్ చేసి.. దినేశ్, కమల దంపతులు లాకర్లలోని ఆభరణాలు, నగదుతో పరారైనట్లు చెప్పారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమెరికాతోనే గాజాలో శాంతి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో 'భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి' రూవెన్ అజర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



న్యూఢిల్లీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనాలో హమాస్‌ను అంతమొందించి, శాంతిని, అభివృద్ధిని నెలకొల్పే అమెరికా శాంతి ప్రణాళిక విజయవంతమవుతుందనే భరోసాను భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ వ్యక్తం చేశారు. పాలస్తీనీయులపై ఇజ్రాయెల్ ఊచకోతకు పాల్పడుతోందనేది దుష్ప్రచారమని, యుద్ధంలో సాధారణ జనం మరణించకుండా తాము పలు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. ఐక్యరాజ్యసమితిపై తమకు నమ్మకం లేదని, ఆ సంస్థలో అనేక హమాస్ శక్తులు చేరాయన్నారు. భారత్, ఇజ్రాయెల్.. రెండూ ఉగ్రవాద సమస్యను ఎదుర్కొంటున్నాయని, ఇరు దేశాలు కలిసికట్టుగా ఉగ్రవాదుల పీచమణచాలన్నారు. ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి దావోస్‌లో ఇజ్రాయెల్ సంస్థలతో జరిపిన చర్చలు ఫలవంతం అవుతాయని భావిస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఎ.కృష్ణారావుకు రూవెన్ అజర్ ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు.

ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య శాంతి నెలకొల్పేందుకు అమెరికా రూపొందిస్తున్న ప్రణాళిక విజయవంతమవుతుందా? దీనిపై అనుమానాలున్నాయి.

ఈ ప్రణాళికలో అమెరికా నాయకత్వం పాలుపంచుకోవడం మాకు చాలా ముఖ్యమైన విషయం. ఎందుకంటే మా ప్రాంతంలో కొందరు తమ సైనిక ఓటమిని కూడా దౌత్య విజయంగా మార్చేందుకు ప్రయత్నిస్తుంటారు. కాబట్టి, మాకు సైనిక విజయాన్ని దౌత్య విజయంగా మార్చడం అవసరం. యుద్ధం దౌత్యానికి కొనసాగింపు అంటారు. దౌత్యం కూడా యుద్ధానికి కొనసాగింపు. మా జీవితాల్లోంచి ఉగ్రవాద ముప్పును శాశ్వతంగా తొలగించడం ఎలా అన్నదే మాకు ప్రధానం. అమెరికా ప్రణాళిక విజయవంతమవుతుందని మేం విశ్వసిస్తున్నాం.

అమెరికా ప్రణాళికకు ప్రాధాన్యం ఉందా?

హమాస్ వద్ద చిక్కుకుపోయిన మా బందీలందర్నీ వెనక్కి తీసుకురాగలిగాం. నిన్ననే చివరి బందీ శవమై తిరిగి వచ్చాడు. మేము హమాస్ సైనిక యంత్రాంగాన్ని ధ్వంసం చేయగలిగినా, ఆ సంస్థ మళ్లీ నిలదొక్కుకుని మాపై దాడిచేసే ప్రమాదం ఉంది. దౌత్య మార్గాల్లో హమాస్‌ను ధ్వంసం చేయడమే అమెరికా శాంతి ప్రణాళిక ప్రయత్నం. గాజాలో సగానికిపైగా ఇజ్రాయెల్ ఆధీనంలో ఉంది. అయినప్పటికీ, గాజాలో అత్యధిక జనాభా నివసించే ప్రాంతం హమాస్ నియంత్రణలో ఉన్నది. హమాస్, ఫతాల పాత్రలేని కొత్త ప్రభుత్వాన్ని ఏర్పర్చడమే అమెరికా ప్రణాళిక లక్ష్యం.

అసలు అమెరికా ఎందుకు చొరవ తీసుకుంటోంది? ఐక్యరాజ్యసమితి ఉంది కదా. ట్రంప్ ఐక్యరాజ్యసమితి ఉనికే లేనట్లుగా వ్యవహరిస్తున్నారని చాలా దేశాలు కూడా విమర్శిస్తున్నాయి.

ఐరాస భద్రతా మండలి అమెరికా 20 సూత్రాల ప్రణాళికను సమర్థిస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. అంటే మాకు భద్రతా మండలి మద్దతున్నట్లే కదా. ఐరాస (యూఎన్) పాత్ర మరింత ఉండాలని మేం కోరుకోవడం లేదు. ఎందుకంటే కొన్ని యూఎన్ ఏజెన్సీలు హమాస్‌తో కుమ్మక్కయ్యాయి. ప్రధానంగా యూఎన్ శరణార్థుల సహాయ సంస్థ. 1948లో ఏర్పడ్డ ఈ సంస్థ ఘర్షణ నిరంతరం కొనసాగేలా చేస్తోంది. పాలస్తీనా శరణార్థులకు పునరావాసం లభించకుండా ఉండటమే దాని లక్ష్యం. ఈ సంస్థలో హమాస్ సీనియర్ అధికారులు ఉన్నారు. అందువల్లే మేం శాంతి ప్రణాళిక విషయంలో ఐరాసను నమ్మటం లేదు.

పాలస్తీనాలో ఇజ్రాయెల్ ఊచకోతకు పాల్పడుతోందన్న ఆరోపణల్లో నిజం లేదా?

ఐరాసలో అనేక ప్రతికూల దేశాలు అంతర్జాతీయ చట్టాల్ని తిరగరాయాలని చూస్తున్నాయి. ఇజ్రాయెల్ కావాలనే పాలస్తీనా పిల్లల్ని ఆకలితో మాడేలా చేస్తోందని, ఊచకోత కోస్తోందని చిత్రిస్తున్నారు. గాజాలో ప్రపంచ ఆరోగ్య సంస్థ టీకాలు వేసిన పిల్లల సంఖ్య.. యుద్ధానికి ముందున్న పిల్లల సంఖ్య కంటే ఎక్కువగా ఉంది. మరెక్కడ వారు ఆకలితో మరణించినట్లు? నిజానికి, యుద్ధంలో ప్రజలు మరణించకుండా ఇజ్రాయెల్ చేయగలిగినంతా చేసింది. ఈ యుద్ధంలో మరణించిన సాధారణ ప్రజల సంఖ్య ఎంతో తక్కువ.

ఇజ్రాయెల్ దాడుల్లో 70 వేల మంది మరణించారని చెబుతున్నారు.. అది తక్కువా?

అది నిజం కాదు. ఈ 70 వేలమందిలో 11 వేల మంది సహజంగా మరణించారు. మామీద హమాస్ ప్రయోగించిన రాకెట్లు విఫలమై 5 వేలమంది దాకా మరణించారు. మృతుల్లో కనీసం 25 వేలమంది హమాస్ ఉగ్రవాదులు ఉంటారు. నగరాల్లో జరిగే యుద్ధాల్లో జననష్టం అధికంగా ఉంటుంది. మరణించే సైనికులతో పోల్చితే అది 1:4 లేదా 1:5 నిష్పత్తిలో ఉంటుంది. కానీ, ఈ యుద్ధంలో మరణించిన ప్రజల సంఖ్య తక్కువే. అయితే ఒక్కరైనా మరణించడం విషాదకరమే.

కానీ, ఇజ్రాయెల్ దురాక్రమణదారు అని, పాలస్తీనా ప్రజలపై మారణ హోమం జరుపుతోందని భారత్‌లో ఎక్కువ మంది అనుకుంటున్నారు.

అవును. ఈ కథనాన్ని మార్చాలి. వాస్తవాలను వక్రీకరిస్తూ తమవైన కట్టుకథలను వ్యాపింపజేసే ఐరాస సభ్య దేశాలు, ఖతార్ నుంచి అల్‌జజీరా, టర్కీ నుంచి టీఆర్‌టీ, ముస్లిం దేశాలను సమర్థించే కొన్ని మీడియా సంస్థలు కూడా ఈ కథనాన్ని నడిపిస్తున్నాయి. పాలస్తీనా ఉగ్రవాదసంస్థలకు అండగా నిలిచే ప్రజలతో పోలిస్తే మాది చాలా తక్కువ జనాభా ఉన్న యూదు దేశం. అందువల్ల సాధారణ మీడియాలో మీరు చెప్పినట్లుగానే పరిస్థితులున్నాయి.

పాలస్తీనాకు అనుకూలంగా మా దగ్గర కవిత్వం, సాహిత్యం కూడా వస్తోంది. ఇజ్రాయెల్‌పై కవిత్వం ఎవరూ రాయరు కదా..

ఈ పరిస్థితిని మార్చడం మాకు నిజంగానే ఒక సవాలు. వాస్తవానికి ఇజ్రాయెల్ చాలా దేశాల కంటే ఎక్కువగా ఉన్నత ప్రమాణాలను పాటిస్తోంది. మా మీద హమాస్ మాత్రమే కాదు ఏడు వైపుల నుంచి ప్రత్యర్థులు దాడులు చేశారు. ఇరాన్ పరోక్షంగా, ప్రత్యక్షంగా మద్దతునిచ్చింది. లెబనాన్‌లోని హిజ్బుల్లా, సిరియా, ఇరాక్, ఎమెన్‌లోని మిలీషియాలు, సమారియాలోని ఉగ్రవాద సంస్థలు దీనివెనుక ఉన్నాయి. రెండేళ్లపాటు పాటు మేము అసాధారణమైన ప్రయత్నాలు చేశాం. సహజంగానే మాకు అనుకూలంగా కథనాలను సృష్టించడానికి మావద్ద వనరులు లేవు. ఇజ్రాయెల్ అన్ని రంగాల్లో భద్రతను పునరుద్ధరించగలిగింది. పా లస్తీనా ప్రజలకోసం ఉజ్వల భవిష్యత్‌ను ఆశిస్తున్నాం.

నా చిన్నప్పటి నుంచి పాలస్తీనా సమస్య గురించి వింటూనే ఉన్నాము. జిమ్మీ కార్టర్ నుంచి ట్రంప్ వరకు అమెరికా అధ్యక్షులు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఈసారి విజయవంతమవుతుందా?

శాంతి ఏర్పడుతుందనే విశ్వాసం నాకు కూడా లేదు. అయితే, అందుకోసం బాగా కష్టపడాలి. కొంత మంది అమెరికా అధ్యక్షులు తమ ప్రయత్నాల్లో విజయం సాధించారు. ఈజిప్టులో, జోర్డాన్‌లో శాంతి ఏర్పడింది. నాలుగు అరబ్ దేశాలతో ఒప్పందాలను కుదుర్చుకున్నాం. ప్రయత్నాలు కొనసాగాల్సిందే. మాకు శాంతి చాలా ముఖ్యం. మా పొరుగుదేశాలతో మంచి సంబంధాలున్నాయి. పాలస్తీనీయులు కూడా శాంతి ఏర్పర్చుకునేందుకు ఎన్నో అవకాశాలు ఇచ్చాం.

అరాఫత్ లాంటి నేత ఉన్నప్పుడే ఏమీ చేయలేకపోయారు కదా..

వారు ఒక దేశంగా ఉండవచ్చని 2000లో మేము ప్రతిపాదించాం. కానీ, అరాఫత్ నిరాకరించారు. కొంత విరామం తర్వాత ఆయన రెండవ ఇంతిఫదా పేరుతో మరో యుద్ధాన్ని ప్రారంభించారు. 2007, 2008లో కూడా రెండుసార్లు వారు దేశంగా ఏర్పడవచ్చని ప్రతిపాదించాం. 2005లో గాజా నుంచి ఉపసంహరించుకున్నాం. కానీ, ఎప్పటికప్పుడు ఉగ్రవాద సంస్థలు ఈ అవకాశాల్ని ఉపయోగించుకుని ఇజ్రాయిల్‌పై దాడులు చేశాయి. అందుకే ఇకపై అలాంటి వాటిని మేము అనుమతించదలుచుకోలేదు.

శాంతి మండలిలో పాకిస్థాన్‌ను అమెరికా ఎలా చేర్చింది? పాక్ స్వయంగా భారత్‌పై ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుంది కదా.. మీరెలా మద్దతునిస్తారు?

శాంతి మండలిలో ఎవర్ని తీసుకోవాలో ట్రంప్ నిర్ణయిస్తారు. దౌత్యానికి సంబంధించిన నిబంధలను మేం నిర్దేశించలేం కదా. భద్రతా ప్రయోజనాల విషయంలో మాత్రం మేము పట్టుదలతో ఉంటాం. హమాస్ యంత్రాంగాన్ని కుప్పకూల్చేంతవరకూ మేము గాజా నుంచి ఉపసంహరించుకోం.

భారత్‌పై పాక్ ఉగ్రవాద దాడుల మీద మీ అభిప్రాయం? పహల్గామ్ దాడిని ఖండించారు కదా..

ఎక్కడైనా ఉగ్రవాదం ఉగ్రవాదమే. యుద్ధతంత్రంలో దాన్ని ప్రయోగించడకూడదు. ప్రజలను లక్ష్యంగా పెట్టుకోకూడదు. ఉగ్రవాదం ఒక అంతర్జాతీయ యుద్ధం. భారత్, ఇజ్రాయిల్ కలిసి అందులో పాల్గొనాలి. సైనికంగా మాత్రమే కాదు, దౌత్యపరంగా కూడా.

నిజంగానే శాంతి ఏర్పడితే ట్రంప్‌కు నోబెల్ బహుమతి వచ్చినట్లేనా?

(నవ్వి) ఏం జరుగుతుందో చూద్దాం.

భారతదేశంతో మీ సంబంధాల గురించి చెప్పండి

మాపై హమాస్ దాడి, పహల్గామ్ దాడి అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్-ఇజ్రాయెల్ మధ్య ప్రత్యేక సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ స్నేహాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలి. రక్షణ రంగంలో ఒప్పందాలు కుదిరాయి. పారిశ్రామిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు మరో ఒప్పందంపై చర్చలు జరుగుతున్నా యి. స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందం విధి విధానాలపై మేం సంతకం చేశాము. ఈ ఏడాది చివరకు ఈ ఒ ప్పందం పూర్తవుతుంది. 2025లో ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయ ఉద్యోగులు, కార్మికుల సంఖ్య రెట్టింపు అయింది. నిర్మాణరంగంలో అత్యంత నైపుణ్యంకల భారతీయ కార్మికులతో మాకెంతో ప్రయోజనం కలుగుతోంది. ఇజ్రాయెల్ కంపెనీలు ఇండియన్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో పెట్టుబడులు పెట్టేందుకు చర్చలు జరుగుతున్నాయి.

ఏపీ, తెలంగాణలో ఇజ్రాయెల్ పాత్ర ఏమిటి?

ఇటీవల దావోస్‌లో ఏపీ సీఎం చంద్రబాబ మా ఆర్థిక మంత్రి నీర్ బర్కత్‌ను కలిసి ఏపీలో ఇజ్రాయిల్ పారిశ్రామిక పార్క్ ప్రతిపాదన చేశారు. ఈ ప్రతిపాదన ముందుకు వెళ్తుందని ఆశిస్తున్నాం. నేను తెలంగాణలో పర్యటించాను. డీఆర్‌డీవోకు ఇజ్రాయెల్‌లోని సంబంధిత రక్షణ సాంకేతిక సంస్థకు సహకారంపై కసరత్తు జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌లో ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీతో ఏఐ, వ్యవసాయం, వాతావరణ మార్పులు, డీప్ టెక్ రంగాల్లో భాగస్వామ్యం గురించి మాట్లాడారు. ఇవి సఫలీకృతమవుతాయని ఆశిస్తున్నా.

బిజినెస్



2044 నాటికి భారత్‌కు 3,300 విమానాలు అవసరం

కొత్తగా 45,000 మంది పైలెట్లు కావాలి

ఏటా 7% పెరగనున్న విమాన ట్రాఫిక్

బోయింగ్ వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌తో పాటు దక్షిణాసియాలో ఏటా విమాన ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని అమెరికా విమాన తయారీ సంస్థ బోయింగ్ వెల్లడించింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా 2044 నాటికి కొత్తగా 3,300 విమానాలు అవసరమని బుధవారం నాడిక్కడ వింగ్స్ ఇండియా 2026లో కమర్షియల్ మార్కెట్ అవుట్‌లుక్ (సీఎంఓ) పేరుతో విడుదల చేసిన నివేదికలో తెలిపింది. ఈ సందర్భంగా బోయింగ్ ఎండీ (కమర్షియల్ మార్కెటింగ్ యురేషియా, ఇండియా) అశ్విన్ నాయుడు మాట్లాడుతూ.. భారత్‌లో మెరుగైన ఆర్థిక వృద్ధితో పాటు మధ్యతరగతి ప్రజానీకం పెరగటం సహా విమానాశ్రయాల కనెక్టివిటీ కోసం పెట్టుబడులు పెరుగుతుండటంతో వచ్చే 20 ఏళ్లలో విమాన ట్రాఫిక్ ఏటా 7 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అందుకుతగ్గట్టుగా కొత్త విమానాల అవసరం నాలుగింతలు పెరగనుందని ఆయన పేర్కొన్నారు. ఈ విమానాల్లో కూడా 90 శాతం వాటా న్యారో బాడీ జెట్స్‌దే ఉండనుందన్నారు. దేశీయంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విమాన సేవలు విస్తరిస్తుండటంమే ఇందుకు ప్రధాన కారణమని అన్నారు. గడచిన 20 ఏళ్లలో భారత్ సహా దక్షిణాసియాలో మొత్తం విమానాల సంఖ్య 795 నుంచి 2,925కి పెరగటమే ఇందుకు నిదర్శనమని అశ్విన్ పేర్కొన్నారు.

కొత్తగా 45,000 మంది టెక్నీషియన్లు

దక్షిణాసియా రీజియన్‌లో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా వచ్చే 20 ఏళ్లలో కొత్తగా 45,000 మంది పైలెట్లు, 45,000 మంది టెక్నీషియన్స్‌తో పాటు 51,000 మంది క్యాబిన్ క్రూ కావాల్సి ఉంటుందని అశ్విన్ వెల్లడించారు. అంతేకాకుండా ఏవియేషన్ సర్వీసెస్ కోసం దాదాపు 19,500 కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సర్వీసుల్లో మెయింటెనెన్స్, రిపేర్, మార్పులు, డిజిటల్ సేవలు, శిక్షణ వంటివి ఉంటాయన్నారు. అలాగే ఈ-కామర్స్ రంగ వృద్ధితో పాటు ఫార్మా ఎగుమతులు పెరుగుతుండటంతో కార్గో విమానాలకు డిమాండ్ పెరగనుందన్నారు.

వెండి @ 4,00,000

హైదరాబాద్‌లో జీవితకాల గరిష్ఠ ధర.. 28 రోజుల్లోనే రూ.1.44 లక్షలు పెరుగుదల



న్యూఢిల్లీ:దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో వెండి, బంగారం ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాయి. అప్పుడప్పుడూ దూకుడుకు స్వల్ప విరామం ఇచ్చినా నూతన సంవత్సరం ప్రారంభం నుంచి బులియన్ మార్కెట్లో బుల్స్ చెలరేగిపోతున్నాయి. తాజాగా బుధవారం హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.4 లక్షలకు చేరింది. మంగళవారం నాటి ధర తో పోల్చితే రూ.13,000 పెరిగింది.

గత 28 రోజుల్లోనే ధర రూ.1.44 లక్షలు పెరిగింది. ఎంసీఎక్స్‌లో సైతం మార్చి నెల ఫ్యూచర్ కాంట్రాక్టుల ధర 5.62% పెరిగి రూ.3,79,300 (పన్నులతో కలిపి) పలికింది. ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర రూ.15,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.3.85 లక్షలకు చేరింది. ఇక్కడ రెండు రోజుల్లోనే ధర రూ.55,500 పెరిగింది.

ఇంకా పైపైకే: కామెక్స్‌లో ఔన్సు (31.10 గ్రాములు) వెండి ధర 115.42 డాలర్లు పలికింది. ఈ ధర 106.55-113 డాలర్ల వద్ద కన్సాలిడేట్ అవుతోంది. మరింతగా దూసుకుపోయే మొగ్గుతో ధర అన్ని చలన సగటు స్థాయిల కన్నా పైనే కదలాడుతోంది. స్పాట్ వెండి ధర సైతం 0.12% పెరిగి 112.22 డాలర్ల వద్ద స్థిరపడింది. ఔన్సు ధర 118.50-120 డాలర్లు దాటినట్లయితే 125-140 డాలర్లకు దూసుకుపోయే అవకాశం ఉన్నదని మార్కెట్ విశ్లేషకులంటున్నారు.

బంగారం రూ.5,000 పెరుగుదల: బులియన్ మార్కెట్లో వరుసగా ఎనిమిదో రోజు కూడా బంగారం ధర కూడా రికార్డు స్థాయిలకు దూసుకుపోయింది. బుధవారం ఢిల్లీ మార్కెట్లో రూ.5,000 పెరిగిన 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.71 లక్షల వద్ద స్థిరపడింది.

సెప్టెంబరులో తొలి మేకిన్ ఇండియా సీ295 విమానం డెలివరీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తొలి మేకిన్ ఇండియా సీ-295 విమానం డెలివరీని చేపట్టనున్నట్లు ఎయిర్‌బస్ ఇండియా, దక్షిణాసియా డిఫెన్స్, స్పేస్ హెడ్ వెంకట్ కట్యూరి తెలిపారు. భారత్ నుంచి మొత్తం 56 సీ-295 విమానాలకు ఆర్డర్ అందుకోగా అందులో 16 విమానాలను స్పెయిన్, సెవెల్లీలోని ఫైనల్ అసెంబ్లీ లైన్ నుంచి డెలివరీ చేసినట్లు చెప్పారు. కాగా మరో 40 విమానాలను భారత్‌లోనే తయారు చేసి భారత్‌కు అందించాలని నిర్ణయించామన్నారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్)తో కలిసి ఈ విమానాన్ని దేశీయంగా తయారు చేస్తున్నట్లు చెప్పారు. గుజరాత్, వడోదరలోని ఎయిర్‌బస్-టాటా సీ-295 ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్) నుంచి డెలివరీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

హెరిటేజ్ ఆదాయం రూ.1,127 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఆదాయం రూ.1,126.9 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి నమోదైన రూ.1,042.26 కోట్ల రెవెన్యూతో పోలిస్తే 8.2 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ3లో కంపెనీ ఏకీకృత నికర లాభం రూ.34.5 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో నమోదైన రూ.43 కోట్ల లాభంతో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గింది. వ్యాపార నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరగడంతో పాటు పాల సరఫరా తగ్గడం, పాల సేకరణ ఖర్చు పెరగడం ఇందుకు కారణమైందని కంపెనీ వెల్లడించింది.

రెండో రోజూ మార్కెట్లో ర్యాలీ

ముంబై: భారత-యూరోపియన్ యూనియన్ దేశాల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఇచ్చిన ఉత్తేజంతో ఈక్విటీ మార్కెట్ రెండో రోజు కూడా ర్యాలీని కొనసాగించింది. సెన్సెక్స్ 487.20 పాయింట్ల వృద్ధితో 82,344.68 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సూచీ 646.49 పాయింట్ల వరకు లాభపడింది. నిఫ్టీ 167.35 పాయింట్లు పెరిగి 15,342.75 వద్ద క్లోజైంది.

ఎయిర్ ఇండియాతో హెచ్ఐఈటీ జట్టు

హిందుస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ (హెచ్‌జీఐ) అనుబంధ సంస్థ హిందుస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (హెచ్ఐఈటీ).. ఎయిర్ ఇండియా లిమిటెడ్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ (ఏఎంఈ) క్యాడెట్‌ను ప్రోగ్రామ్‌ను ప్రారంభించనుంది.

బీఎస్ఎన్ఎల్‌తో వయాశాట్ ఒప్పందం

విమానాల్లో డైరెక్ట్ టు డివైస్ సేవలందించేందుకు ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్‌తో జట్టు కట్టినట్లు అంతర్జాతీయ శాటిలైట్ కమ్యూనికేషన్స్ సేవల సంస్థ వయాశాట్ వెల్లడించింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం 60కి పైగా విమానయాన సంస్థలకు సంబంధించి రోజుకు 14,000 విమానాల్లో ఇన్‌ఫ్లయిట్ కనెక్టివిటీ సేవలందిస్తున్నట్లు సంస్థ ఇండియా ఎండీ గౌతమ్ శర్మ తెలిపారు. భారత్‌లో తమకు 4 గ్రౌండ్ స్టేషన్లు ఉండగా హైదరాబాద్, చెన్నైల్లో 350 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నట్లు చెప్పారు.

ఆక్సీ స్కైషిప్పర్ కార్గో డ్రోన్

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఆక్సీ ఏరోస్పేస్ గ్రూప్.. కార్గో డ్రోన్ స్కైషిప్పర్‌ను విడుదల చేసింది. వాణిజ్య, మెడికల్, ఇండస్ట్రియల్ లాజిస్టిక్స్ అవసరాల కోసం ఈ డ్రోన్‌ను తీసుకువచ్చినట్లు కంపెనీ తెలిపింది. హైదరాబాద్ సమీపంలోని ప్లాంట్‌లో ఈ డ్రోన్స్‌ను తయారు చేస్తున్నట్లు కంపెనీ పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,65,170 ▲	1,51,400 ▲	4,00,000 ▲
విజయవాడ	1,70,500 ▲	1,58,000 ▲	3,70,250 ▲
విశాఖపట్నం	1,70,269 ▲	1,53,150 ▲	4,00,000 ▲
రాజమండ్రి	1,67,070 ▲	1,53,150 ▲	3,63,000 ▲
ప్రొద్దుటూరు	1,71,000 ▲	1,57,320 ▲	3,73,000 ▲
ముంబై	1,64,635 ▲	1,50,806 ▲	3,58,267 ▲

2032 నాటికి 100 హెలీకాప్టర్లు

రూ.3,000 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమానాలు, హెలీకాప్టర్లను వివిధ సంస్థలకు లీజుకు ఇచ్చే స్కైపల్స్ సొల్యూషన్స్ ఐఎఫ్ఎస్‌సీ లిమిటెడ్ తన కార్యకలాపాలను భారీగా విస్తరిస్తోంది. కంపెనీ ప్రస్తుతం ఎనిమిది హెలికాప్టర్లు, రెండు విమానాలను వివిధ సంస్థలకు లీజుకు ఇచ్చింది. 2032 నాటికి లీజుకు ఇచ్చే హెలికాప్టర్ల సంఖ్యను 100కు పెంచనున్నట్టు కంపెనీ వ్యవస్థాపకులు శశాంక్ సింఘాల చెప్పారు. ఇందుకోసం దాదాపు రూ.3,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు తెలిపారు. ఈ నిధులు సమకూర్చేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. విమానాలు, హెలీకాప్టర్లను లీజుకు ఇస్తున్న తొలి భారతీయ కంపెనీ తమదేనని శశాంక్ చెప్పారు.

తెలుగు రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై స్కైపల్స్ సొల్యూషన్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో గాయపడే వారిని వేగంగా ఆస్పత్రులకు తరలించి అత్యవసర వైద్య సాయం అందించే సంస్థలకు తన హెలీకాప్టర్లను లీజుకు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ప్రతి 50 కిలోమీటర్లకు ఒక హెలీకాప్టర్‌ను అందుబాటులో ఉంచడం తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ఈ ప్రతిపాదనపై రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలతో పాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అత్యంత ఆసక్తి చూపిస్తున్నట్టు శశాంక్ చెప్పారు.



విమానయానానికి భవిష్యత్ భేష్

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌లో విమానయానానికి మంచి భవిష్యత్ ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. వింగ్స్ ఇండియా 2026 ఏవియేషన్ సమ్మిట్‌ను ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడుతూ.. విమాన విడిభాగాలు, ఉత్పత్తుల ఎగుమతుల్లోనూ మన కంపెనీలు సత్తా చాటాలని కోరారు. ఇందుకు అనువైన సానుకూల పరిస్థితులు కల్పించేందుకు ప్రభుత్వ పరంగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయంలో ప్రధాన అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగే సత్తా మన దేశానికి ఉందన్నారు.

వేగంగా అభివృద్ధి: ప్రస్తుతం మన వైమానిక రంగంలో ఉన్నంత వృద్ధి రేటు మరే దేశంలోనూ లేదని రామ్మోహన్ నాయుడు చెప్పారు. పెరుగుతున్న ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దేశీయ విమానయాన కంపెనీలు ఇప్పటికే 1,500కు పైగా విమానాలకు బోయింగ్, ఎయిర్‌బస్, ఎంబ్రాయర్ కంపెనీలకు ఆర్డర్ పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో దేశీయంగా వైమానిక ఉత్పత్తుల తయారీకి మరింత ప్రోత్సాహం లభించనుందన్నారు. బోయింగ్, ఎయిర్‌బస్ కంపెనీలు ఇప్పటికే మన దేశం నుంచి ఏటా 200 కోట్ల డాలర్ల (సుమారు రూ.18,300 కోట్లు) విలువైన విమాన విడిభాగాలను దిగుమతి చేసుకుంటున్నట్టు మంత్రి తెలిపారు.

అన్ని లగ్జరీ కార్ల ధరలు తగ్గవు

ఈయూ ఒప్పందంలోని కోటాలు, ధరల పరిమితులు వర్తిస్తాయి



న్యూఢిల్లీ: దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమపై భారత్-ఈయూ (యూరోపియన్ యూనియన్) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ప్రభావం క్రమంగా బోధపడుతోంది. ఈ ఒప్పందంతో దిగుమతయ్యే బీఎండబ్ల్యూ, మెర్సిడెజ్ బెంజ్, స్కోడా, లంబోర్ఘిని వంటి లగ్జరీ కార్ల ధరలు భారీగా తగ్గుతాయని సంబరపడిన వారి సంతోషం ఒక్క రోజుకే పరిమితమైంది. కోటాలు, ధరల పరిమితికి లోబడి మాత్రమే ఈ కార్ల దిగుమతులపై సుంకాల భారం తగ్గనుంది.

ప్రస్తుత పరిస్థితి: ప్రస్తుతం ప్రభుత్వం 40,000 డాలర్ల (సుమారు రూ.36.8 లక్షలు) వరకు ధర ఉన్న దిగుమతయ్యే కార్లపై 70 శాతం, అంతకు మించిన ధర ఉన్న కార్లపై 110 శాతం దిగుమతి సుంకం విధిస్తోంది. భారత-ఈయూ ఎఫ్‌టీఏతో ఇది వెంటనే 40 శాతానికి, తరువాత దశలవారీగా 10 శాతానికి తగ్గనుంది. దీంతో చాలా మంది సంబరపడి పోయారు. దిగుమతైన బీఎండబ్ల్యూ, మెర్సిడెజ్ బెంజ్, స్కోడా వంటి లగ్జరీ కార్లను చౌకగా కొనేయవచ్చని ఆశ పడ్డారు.

అసలు మతలబు: సుంకాల పోటు తగ్గిస్తూనే ప్రభుత్వం ఈయూ కార్ల దిగుమతులకు రెండు కీలక షరతులు పెట్టింది. అందులో ఒకటి ఈయూ నుంచి దిగుమతయ్యే లగ్జరీ కార్ల ధర కనీసం 15,000 యూరోల (సుమారు రూ.16.5 లక్షలు) పైన ఉండాలి. ఇంకో ప్రధాన షరతు ఈ లగ్జరీ కార్ల వార్షిక దిగుమతులు 2.5 లక్షలు మించకూడదు. అంతకు మించితే 110 శాతం దిగుమతి సుంకం తప్పదు. అంటే భారత-ఈయూ ఎఫ్‌టీఏతో దేశంలో లగ్జరీ కార్లు తయారు చేస్తున్న బీఎండబ్ల్యూ, స్కోడా, మెర్సిడెజ్ బెంజ్ వంటి కంపెనీల అమ్మకాలకు, 'భారత్‌లో తయారీ'కి పెద్దగా వచ్చే ముప్పేమీ లేదని పరిశ్రమ వర్గాల అంచనా. ఇప్పటికే మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, స్కోడా, ఆడి వంటి లగ్జరీ కార్ల తయారీ సంస్థలు భారత్‌లో కార్ల తయారీ ప్లాంట్లను కలిగి ఉన్నాయి. ఈ సంస్థలు చాలా వరకు తమకు కావాల్సిన కాంపోనెంట్స్‌ను దేశీయంగానే సమకూర్చుకుంటున్నాయి.

మూడేళ్లలో ఎస్‌జే-100 విమానం

» నాసిక్ ప్లాంటులో తయారీ

» హెచ్ఏఎల్ సీఎండీ డీకే సునీల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) పౌర విమానాల తయారీకి సిద్ధమవుతోంది. ఇందుకోసం రష్యా కేంద్రంగా పనిచేసే యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ) కంపెనీతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా సూపర్ జెట్ 100 (ఎస్‌జే 100) అనే పౌర విమానాన్ని తన నాసిక్ ప్లాంటులో తయారు చేయనుంది. ప్రధాన విమాన భాగాలను రష్యా నుంచి దిగుమతి చేసుకుని నాసిక్‌లోని తన యూనిట్‌లో అసెంబుల్ చేస్తుంది. ఇలా తయారైన విమానాన్ని మూడేళ్లలో దేశంలోని ప్రాంతీయ విమానయాన సంస్థలకు అందజేస్తామని హెచ్ఏఎల్ సీఎండీ డీకే సునీల్ చెప్పారు. ఈ లోపు 10-12 ఎస్‌జే 100 విమానాలను నేరుగా దిగుమతి చేసుకుని కొన్ని ప్రాంతీయ విమానయాన సంస్థలకు లీజుకు ఇచ్చే విషయాన్ని కంపెనీ పరిశీలిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ కేంద్రంగా పనిచేసే కొన్ని కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్టు సునీల్ చెప్పారు. మన దేశ ప్రాంతీయ విమానయాన రంగంలో ఉన్న విమానయాన సంస్థల నుంచి 200 వరకు ఎస్‌జే 100 విమానాలకు గిరాకీ ఉంటుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం హెచ్ఏఎల్ ఆదాయంలో పౌర విమానాల వాటా నాలుగు నుంచి ఐదు శాతం మాత్రమే. వచ్చే పదేళ్లలో దీన్ని 25 శాతానికి పెంచుకుంటామని సునీల్ చెప్పారు.

ఈ సంవత్సరం 56 కొత్త విమానాలు

ఇండిగో సీఈఓ పీటర్

ఇండిగో విమానయాన సంస్థ తన విస్తరణ కొనసాగిస్తోంది. ఈ సంవత్సరం కొత్తగా 52 నుంచి 56 విమానాలు అందుబాటులోకి వస్తాయని కంపెనీ సీఈఓ పీటర్ ఎల్బర్స్ చెప్పారు. అందులో సుదూర ప్రయాణాలకు అవసరమైన తొమ్మిది ఎయిర్‌బస్ 321 ఎక్స్‌ఎల్ఆర్ విమానాలు కూడా ఉంటాయన్నారు. 2030 నాటికి తమ అంతర్జాయ విమాన సర్వీసుల్లో 40% ఈ విమానాలే ఉంటాయన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	550
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	విజయవాడ	143
వరంగల్	135	గుంటూరు	143
కరీంనగర్	135	ఒంగోలు	143
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	124
కర్నూలు	135	నెల్లూరు	129
విశాఖపట్నం	135	అనంతపురం	129
గోదావరి	143		

చిత్రజ్యోతి

SINCE 1965

నాన్న ఆటో బయోగ్రఫీ పనులు ప్రారంభమయ్యాయి

సౌందర్య రజనీకాంత్



రజనీకాంత్ జీవితంపై ఓ పుస్తకం తయారవుతోందంటూ ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై సూపర్‌స్టార్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ ఓ ఇంటర్వ్యూలో స్పష్టత ఇచ్చారు. తన తండ్రి ఆటో బయోగ్రఫీ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని వెల్లడించారు. ఆయన ప్రస్తుతం ఈ పుస్తకాన్ని రాస్తున్నారని తెలిపారు. ఈ పుస్తకం విడుదలైన వెంటనే ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుందని తెలిపారు. ఇందులో సాధారణ బస్ కండక్టర్‌గా జీవితం ప్రారంభించిన ఒక వ్యక్తి, తన స్వశక్తితో సూపర్‌స్టార్‌గా ఎదిగిన క్రమాన్ని హృద్యంగా ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. రజనీకాంత్ జీవితం గురించి ఎవ్వరికీ తెలియని ఆసక్తికర విషయాలను ఈ పుస్తకం తెలియజేయనుందని పేర్కొన్నారు. 'కొచ్చాడయాన్', 'వీఐపీ 2' చిత్రాలను తెరకెక్కించారు సౌందర్య. తాజాగా 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు అభిషన్ జీవింత్ హీరోగా నటించిన 'విత్ లవ్' చిత్రాన్ని నిర్మించారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం విడుదలవుతోంది. 'విత్ లవ్' ప్రమోషన్స్‌లో భాగంగానే ఈ పుస్తకం గురించి అప్డేట్ ఇచ్చారు సౌందర్య.

తార ఆగమనం



వరుస విజయాలతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తాజా చిత్రం 'ఆకాశంలో ఒక తార'. విలక్షణ కథలతో మెప్పించే పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో శ్రుతిహాసన్ కీలకపాత్రలో నటిస్తున్నారు. మంగళవారం ఆమె పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. శ్రుతిహాసన్ ఈ చిత్రంలో చాలా శక్తిమంతమైన పాత్రలో కనిపించబోతున్నారు. పోస్టర్‌లో ఆమె కళ్ళకు అద్దాలు పెట్టుకొని, పెదవులపై సిగరెట్‌తో సీరియస్‌గా చూస్తూ కనిపించారు. కథను మలుపుతిప్పే పాత్రను ఆమె పోషిస్తున్నారని యూనిట్ పేర్కొంది. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా వంటి ప్రతిష్ఠాత్మక బ్యానర్లు సమర్పిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్న ఈ చిత్రంలో దుల్కర్ సరసన సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతున్నారు.

నవ్వుల జాతర



వైవిధ్యమైన సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో సుహాస్. ఈ సారి పూర్తిస్థాయి వినోదంతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యారు. ఆయన హీరోగా, శివాని నగరం హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'హే భగవాన్'. గోపీ అచ్చర దర్శకత్వంలో బి. నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి సమర్పిస్తున్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఫిబ్రవరి 20న సినిమాను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ "హే భగవాన్' చిత్రంలో నా పాత్ర ఆద్యంతం నవ్విస్తుంది. నా కెరీర్‌లో ఇదో బెస్ట్ ఫిల్మ్‌గా నిలుస్తుంది' అని చెప్పారు. ఈ సినిమాలో కొత్త సుహాస్‌ను చూస్తారు అని వంశీ నందిపాటి అన్నారు.

అటవీ నేపథ్యంలో శబార



దీక్షిత్ శెట్టి, మిషా నారంగ్, కృతిక సింగ్ యాదవ్ ప్రధాన పాత్రల్లో ప్రేమ్‌చంద్ కిలారు తెరకెక్కిస్తున్న చిత్రం 'శబార'. హర్షిత చదలవాడ, దుర్గా చంచు, రమాదేవి కిలారు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను 'హర్ట్ బీట్ ఆఫ్ శబార' పేరుతో మేకర్స్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ 'శబార' అంటే ప్రపంచం. ప్రేమ్‌చంద్ సృష్టించిన ప్రపంచం. అడవిలోనే కథ మొత్తం సాగుతుంది' అని చెప్పారు. 'నేను ఇప్పుడేం మాట్లాడను. ఈ సినిమానే అంతా మాట్లాడుతుంది' అని ప్రేమ్‌చంద్ తెలిపారు.

హారర్ థ్రిల్లర్‌గా హ్రీం



హారర్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన చిత్రం 'హ్రీం'. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మిస్తున్నారు. రావూరి రాజేశ్ దర్శకుడు. పవన్, డాక్టర్ చమిందా వర్మ జంటగా నటిస్తున్నారు. తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, బెనర్జీ కీలకపాత్రలు పోషిస్తున్నారు. యథార్థ గాథ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని శివ మల్లాల తెలిపారు. ఇప్పటివరకూ తెలుగులో రాని విభిన్న కథ, కథనాలతో ఆ సినిమా రూపొందుతోంది. 'హారర్, సస్పెన్స్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి అని దర్శకుడు తెలిపారు.

ఎక్సైజ్ కస్టడీకి రాజేశ్, అన్బరసు

» ములకలచెరువు నకిలీ మద్యం కేసులో కోర్టు ఉత్తర్వులు

» 'ఇబ్రహీంపట్నం' కేసులో ఐదుగురికి బెయిల్

ములకలచెరువు/విజయవాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులోని నకిలీ మద్యం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న రాజేశ్(ఏ5), అన్బురసు అలియాస్ బాబు(ఏ19)ను ఎక్సైజ్ కస్టడీకి అప్పగిస్తూ తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. మదనపల్లె సబ్‌జైలులో ఉన్న ఆ ఇద్దరినీ ఎక్సైజ్ పోలీసులు గురువారం ఉదయం కస్టడీలోకి తీసుకోనున్నారు. గురు, శుక్రవారాలు వీరిని మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్‌లో విచారించనున్నారు. తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జిగా ఉంటూ సస్పెండైన దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేసిన రాజేశ్‌ను గతనెల 9న, జయచంద్రారెడ్డి ఇంట్లో పనిచేసిన అన్బరసును గత నెల 10న అరెస్టు చేశారు. వీరి ద్వారా విచారించి కీలక విషయాలు రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేయడంతో కోర్టు అనుమతించింది. కాగా, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో నమోదైన నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులు సయ్యద్ హాజీ, కట్టరాజు, అంతా దాస్, మిథున్ దాస్, అల్లా బక్షలకు బెజవాడ కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ ఐదుగురూ నెల్లూరులోని కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. బెయిల్ కోసం విజయవాడలోని ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో వీరు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగియడంతో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, ములకలచెరువులో నమోదైన కేసులోనూ ఈ ఐదుగురు నిందితులుగా ఉన్నారు. ఆ కేసులో బెయిల్ రాకపోవడంతో వీరు జైల్లోనే ఉండనున్నారు.

మిషన్ కర్మయోగిలో ఏపీ టాప్

» 80 లక్షల కోర్సులు పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా రికార్డు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిషన్ కర్మయోగి కార్యక్రమాన్ని వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. ఐజీఓటీ కర్మయోగి డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌పై రాష్ట్రం నుంచి కోటి మంది కోర్సుల నమోదు చేసుకోగా, 80 లక్షల కోర్సులు పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. ఈ వేదిక ద్వారా అధికారులు, ఉద్యోగులు పాలనా నైపుణ్యాలు, డిజిటల్ నిర్వహణ వంటి కీలక రంగాల్లో శిక్షణ పొందుతున్నారు.

థాయ్‌లాండ్ బీచ్ కుస్తీ పోటీలకు గురుకుల విద్యార్థి

» శివమల్లికార్జునను అభినందించిన మంత్రి డోలా

అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్‌లో మార్చిలో జరగనున్న బీచ్ కుస్తీ పోటీలకు దేశం తరఫున ఏపీ నుంచి ఎంపికైన గురుకుల విద్యార్థిని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అభినందించారు. పల్నాడు జిల్లా యడ్లపాడు అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో శివమల్లికార్జున 9వ తరగతి చదువుతున్నాడు. జనవరి 23 నుంచి 26 వరకు విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి బీచ్ కుస్తీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్, జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించి, థాయ్‌లాండ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం సచివాలయంలో శివమల్లికార్జునను మంత్రి స్వామి అభినందించారు.

ఆర్టీసీకి 200 కోట్ల ఆదాయం

» స్త్రీశక్తి ద్వారా 40 కోట్ల మంది ప్రయాణం: మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విజయవాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ ప్రస్తుతం గాడిలో పడిందని, టికెట్ ఆదాయం మాత్రమే కాకుండా కార్గో సర్వీసుల ద్వారా సంస్థ సుమారు రూ. 200 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్త్రీ శక్తి పథకం కింద ఇప్పటివరకు 40 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని చెప్పారు. ఆర్టీసీ రాష్ట్రవ్యాప్త డీపీటీఓల సమీక్షా సమావేశం బుధవారం విజయవాడలో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి 2025-26 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు వరకు వచ్చిన ఆదాయ, వ్యయాలు ఇతర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెడికల్లీ అన్‌ఫిట్ ఉద్యోగుల విషయంలో ఇప్పటి వరకు 51 మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించామని, 149 మందికి ఆర్థిక సహాయం అందించామన్నారు.

సకాలంలో జీతాలిచ్చేది మా ప్రభుత్వమే

» డైరీ ఆవిష్కరణలో మంత్రులు గొట్టిపాటి, ఫరూక్

అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఎలక్ట్రిసిటీ ముస్లిం, అండ్ మైనార్టీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ 2026ను మంత్రి రవికుమార్, సహచర మంత్రి ఫరూక్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘ నేతలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నింటినీ సీఎం దృష్టికి తీసుకు తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇచ్చేది కూటమి ప్రభుత్వమేనని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. మైనార్టీ సంక్షేమ బోర్డును మొదటిసారి ఏర్పాటు చేసింది టీడీపీ ప్రభుత్వమేనని ఫరూక్ అన్నారు.

విజయవాడకు ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భాగవత్



గన్నవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధ్యక్షుడు మోహన్ భాగవత్ విజయవాడ వచ్చారు. బెంగళూరు నుంచి ఇండిగో విమానంలో బుధవారం రాత్రి గన్నవరం విమానాశ్రయానికి విచ్చేయగా, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆదిత్య, దుర్గాప్రసాద్ తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసు బందోబస్తు మధ్య, రోడ్డు మార్గాన తాడేపల్లి వెళ్లారు. కాగా, మోహన్ భాగవత్ రెండు రోజులపాటు విజయవాడలో ఉంటారని తెలిసింది. కార్యక్రమ వివరాలను గోప్యంగా ఉంచారు.

పీఏసీఎస్ కమిటీల గడువు పెంపు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 2,024 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)లకు అధికార, అధికారేతర పర్సన్ ఇన్‌చార్జి కమిటీ గడువును ప్రభుత్వం ఈ నెల 31 నుంచి జూలై 30 వరకు (ఆరు నెలలు) పొడిగించింది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 1,903 పీఏసీఎస్‌లకు ప్రస్తుత అధికారేతర పర్సన్ ఇన్‌చార్జి కమిటీలను పొడిగించగా, కొన్ని పీఏసీఎస్‌లకు అధికారులను కొనసాగిస్తూ, కొన్ని కమిటీల్లో స్వల్పమార్పు చేర్పులు చేశారు. కాగా ప్రస్తుత రబీ మార్కెటింగ్ సీజన్‌లో కనీస మద్దతు ధరకు వివిధ పంట ఉత్పత్తుల సేకరణకు ప్రభుత్వం నోడల్ ఏజెన్సీలను నియమించింది. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల తరుపున వేరుశనగ సేకరణకు ఏపీ ఆయిల్ ఫెడ్, శనగలు, కందులు, మినుములు, పెసలు కొనుగోలుకు ఏపీ మార్క్‌ఫెడ్‌ను రాష్ట్రస్థాయి నోడల్ ఏజెన్సీగా నియమించింది. రాష్ట్రంలో కోకో పంటకు ధరల నిర్ణయానికి ఉద్యాన శాఖ డైరెక్టర్ అధ్యక్షతన కమిటీని నియమించింది. సీనియర్ అధికారులతోపాటు, కేఎల్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ జాకబ్ విక్టర్‌ను సభ్యులుగా నియమించింది.

తక్కువ ధరకు బంగారం పేరిట మోసం!

» తాడిపత్రి పోలీసుల అదుపులో నిందితుడు

తాడిపత్రి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానంటూ వ్యాపారుల నుంచి రూ.12 కోట్లకుపైగా వసూలు చేశాడు. బంగారం ఇవ్వకపోవడంతో బాధితులు నిలదీయగా ఆత్మహత్యకు యత్నించాడు. అనంతపురం జిల్లా తాడిపత్రి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కడప జిల్లాకు చెందిన ఆరీఫ్ గతంలో గల్ఫ్‌లో మోసాలకు పాల్పడి కడపకు తిరిగి వచ్చాడు. అక్కడ పలువురిని మోసగించి, నాలుగేళ్ల క్రితం తాడిపత్రికి వచ్చాడు. తాడిపత్రిలోని ఓ బంగారం దుకాణంలో గుమాస్తాగా చేరి, ఇతర దుకాణాల యజమానులతో పరిచయాలు పెంచుకున్నాడు. సొంతంగా బంగారం వ్యాపారం మొదలుపెట్టాడు. దీంతో ఆరీఫ్‌ను నమ్మి ఒక్కొక్కరు కనీసం రూ.20 లక్షలు ఇచ్చారు. ఇలా రూ. 12 కోట్లకుపైగా కాజేశాడు. బాధితుల నుంచి ఒత్తిడి ఎక్కువవడంతో ఆత్మహత్యకు యత్నించాడు. మంగళవారం బైక్‌పై వంగనూరు-రేగడిపల్లికి వెళ్లాడు. అక్కడ బైక్ ఆపి రైల్వేట్రాక్‌పైకి చేరుకున్నాడు. గ్యాంగ్‌మన్ గమనించి రైతుల సాయంతో ఆరీఫ్‌ను పక్కకు తీసుకువచ్చారు. అనంతరం తాడిపత్రి పట్టణ పోలీసులకు అప్పగించారు.



తెలంగాణలోని మేడారం మహాజాతర గద్దెల ముఖద్వారం.. జాతరకు హాజరైన భక్తులు

గద్దెపైకి సారలమ్మ

ప్రశాంతంగా జాతర తొలిఘట్టం

నేడే గద్దెపైకి సమ్మక్క తల్లి ..

మేడారం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లక్షలాది మంది భక్తులు నిలువెల్లా కనులై ఎదురుచూస్తున్న సారలమ్మ బుధవారం ఆదివాసీ సంప్రదాయాల మధ్య అట్టహాసంగా మేడారంలోని గద్దెపైకి చేరుకుంది. దీనితో మహా జాతర తొలిఘట్టం ప్రశాంతంగా పూర్తయినట్టయింది. కన్నెపల్లిలోని గుడి నుంచి సారలమ్మ బుధవారం రాత్రి 7.38 గంటలకు బయలు దేరింది. జంపన్నవాగు వద్దకు 8.48 గంటలకు చేరుకున్నది. అక్కడి నుంచి అశేష భక్తజనం నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి మేడారంలోని గద్దెపై ప్రతిష్ఠించారు. అమ్మను పూజారులు మేడారంలోని గద్దెకు తరలించే ఘట్టం భక్తులను దివ్యానుభూతికి లోను చేసింది. పూజారి సారయ్య సారలమ్మ తల్లి రూపాన్ని తలకెత్తుకొని గుడిబయట అడుగు పెట్టగానే భక్తుల కేరింతలతో తల్లికి స్వాగతం పలికారు. దారికి అడ్డంగా పడుకున్న మహిళలపై పసుపు కుంకుమలు, అక్షింతలు, శుద్ధ జలాన్ని చల్లుతూ వారిని దాటుకుంటూ సారయ్య.. తల్లితో ముందుకు సాగారు. సారలమ్మ మేడారంవైపు సాగివస్తుండగా.. కన్నెపల్లి గ్రామస్థులు ఎదురెళ్లి హారతులు ఇచ్చారు. తమ ఇళ్ల ముందు నిల్చొని స్వాగతం పలికారు. మహిళలే తల్లి ప్రయాణించే మార్గంలో అడుగడుగునా నీళ్లారబోశారు. కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. మొక్కులను సమర్పించుకున్నారు. "సారలమ్మ తల్లీ.. మమ్మల్ని చల్లంగ చూడ"ంటూ వేడుకున్నారు. కోట్లాది మంది ఎంతో ఆత్రుతతో ఎదురుచూస్తున్న వనదేవత సమ్మక్క గురువారం మేడారంలోని గద్దెపైకి రానున్నది.

బొర్రాలో మరో అందమైన గుహ

కిలోమీటరుకు పైగా విస్తరించిన వైనం

అనంతగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని బొర్రా గుహలకు రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ గుహలకు అనుసంధానంగా ఉన్న మరో కొత్త గుహను స్థానిక ఔత్సాహికులు కనిపెట్టారు. పాత గుహ సుమారు ఒకటిన్నర కిలోమీటరు మేర విస్తరించి ఉంటే... కొత్తది సుమారు కిమీ పరిధిలో విస్తరించి ఉందని చెబుతున్నారు. ఈ రెంటినీ అనుసంధానిస్తే.. మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే అవకాశాలు మెండుగా ఉన్నాయంటున్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన కూటమి ప్రభుత్వం బొర్రా గుహలపై కూడా దృష్టి పెడితే... మరింత ఆదాయం సమకూరుతుందని, విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించే హంగులు దీనికి ఉన్నాయని అభిప్రాయపడుతున్నారు.



2022లో బొర్రా గుహలను సందర్శించిన అప్పటి పర్యాటక శాఖ ఎండీ కన్నబాబుకు మరో గుహ వివరాలను తెలియజేస్తున్న గైడ్లు (ఫైల్)

ఇదో భూ విజ్ఞాన అద్భుతం

150 మిలియన్ ఏళ్ల క్రితం సహజ సిద్ధమైన అనేక రసాయనిక, భౌగోళిక చర్యల ఫలితంగా ఏర్పడిన భూ విజ్ఞాన అద్భుతమే ఈ బొర్రా గుహలు. ఈ గుహల పైనుంచే కొత్తవలస - కిరండోల్ రైల్వే లైను వెళుతుంది. ఈ గుహలను ఆనుకుని గోస్తనీ జీవనది ప్రవహిస్తూ ఉంటుంది. ఈ నది సమీపంలోని కటిక గ్రామం వద్ద 50 అడుగుల ఎత్తు నుండి పడుతుంది. కటిక జలపాతంగా పిలిచే ఇది నయనానందాన్ని కలిగిస్తుంది. ప్రస్తుతం పర్యాటకులు చూస్తున్న గుహలకు అనుసంధానమై మరో గుహ పర్యాటకులకు అత్యంత సురక్షితమైనది. సుమారు నాలుగేళ్ల క్రితం అప్పటి పర్యాటక శాఖ ఎండీ కన్నబాబు బొర్రా గుహలను సందర్శించినప్పుడు రెండో గుహను స్థానికులు, గైడ్లు ఆయన దృష్టికి తెచ్చారు. దానిని పరిశీలించిన ఆయన... టర్కీ దేశంలోని టాప్‌డెక్, సయాహత్ కేవ్ రెస్టారెంట్లు మాదిరి పర్యాటకులకు మధురానుభూతి కలిగేలా ఏర్పాటు చేయడానికి ఏమైనా అవకాశం ఉందా?... అన్న కోణంలో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. కన్నబాబు ఆదేశాల మేరకు రెండో గుహను పరిశీలించిన అధికారులు దానిని అందుబాటులోకి తీసుకొని రావడానికి, ప్రస్తుతమున్న బొర్రా గుహలను మరింత విస్తృతపర్చడానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇదే కాదు... లోపల మరో గుహ కూడా ఉందని, అయితే దానిలో ప్రయాణం అత్యంత సంక్షిప్తంగా ఉంటుందని, అది నేరుగా గోస్తనీ ప్రవాహం వద్దకు దారి తీస్తుందని స్థానికులు చెపుతారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలో కూడా దానిలోని నిజానిజాలను నిర్ధారణ చేయాలన్న ఆలోచన కూడా ఇంత వరకూ పర్యాటక శాఖ చేయలేదు. పర్యాటకులు వెళ్లడానికి అనువుగా ఉండే రెండో గుహ ముఖద్వారం వద్ద ఉన్న పూడికను తొలగించి, లోపల పర్యాటకుల నడకకు అనువైన నిర్మాణాలు చేపడితే ఇప్పుడు వస్తున్న పర్యాటకులకు రెట్టింపు మందిని ఆకర్షించవచ్చని పలువురు స్పష్టం చేస్తున్నారు. గతంలో కన్నబాబు సూచించినట్లు గుహ లోపల రెస్టారెంటు వంటి దానిని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తే అంతర్జాతీయ పర్యాటకులను కూడా ఆకర్షిస్తుందని స్థానిక గైడ్లు వివరిస్తున్నారు.

జైళ్ల ఆధునికీకరణకు 950 కోట్లు



వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జైళ్ల శాఖ ఉన్నతాధికారులతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

» ఖైదీల సంక్షేమం కోసం మరో 161 కోట్లు: కేంద్ర మంత్రి బండి సంజయ్

» విశాఖలో ప్రారంభమైన జైళ్ల శాఖ 9వ జాతీయ సదస్సు

విశాఖపట్నం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): 'దేశవ్యాప్తంగా జైళ్ల ఆధునికీకరణకు కేంద్రం రూ.950 కోట్లు కేటాయించింది. ఖైదీల సురక్ష, సంక్షేమం కోసం మరో రూ.161 కోట్లు కేటాయించాం' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. జైళ్ల శాఖ 9వ జాతీయ సదస్సును బుధవారం విశాఖలో ఆయన ప్రారంభించారు. 'వాస్తవంగా జైళ్లు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నప్పటికీ నిర్వహణలో సహాయంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్రం నిధులు కేటాయించాలని నిర్ణయించింది. కొందరు ఖైదీలు కోర్టు విధించే జరిమానా చెల్లించలేకపోవడంతో జైళ్లలోనే మగ్గిపోవాల్సి వస్తోంది. అలాంటి వారికోసం 'నిర్ధన్ ఖైదీ సహాయత యోజన' కింద ఏటా రూ.20 కోట్లు కేంద్రం కేటాయిస్తోంది. జైలు అంటే భయపడే పరిస్థితి కాకుండా, మార్పునకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించాలి. ఖైదీల్లో పరివర్తన తీసుకురావడంతో పాటు వారికి నైపుణ్య శిక్షణ అందేలా చూడాలి. దీనివల్ల శిక్షాకాలం తర్వాత ఖైదీలు బయటకు వచ్చి గౌరవంగా బతికే పరిస్థితి ఏర్పడుతుంది' అని కేంద్ర మంత్రి అన్నారు. సదస్సుకు హాజరైన అధికారులతో మంత్రి సంజయ్ గ్రూపు ఫొటో దిగారు. తర్వాత వివిధ రాష్ట్రాల జైళ్లలో ఉన్న ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తులతో కూడిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సదస్సులో ఏపీ జైళ్ల శాఖ డీజీపీ అంజనీకుమార్, బీపీఆర్ అండ్ డీ డైరెక్టర్ జనరల్ అలోక్‌రంజన్, ఉత్తరప్రదేశ్ జైళ్ల శాఖ డీజీపీ పీసీ మీనా, తెలంగాణ జైళ్లశాఖ డీజీపీ సౌమ్యమిశ్రా, ఏపీ జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్‌తోపాటు పలు రాష్ట్రాల జైళ్ల శాఖ డీజీలు, ఐజీలు పాల్గొన్నారు.

గూఢచర్యం కేసులో నిందితుడికి ఐదున్నరేళ్ల జైలు

» విశాఖపట్నం ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు తీర్పు

విశాఖపట్నం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గూఢచర్యం కేసులో నిందితుడికి ఐదున్నరేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ విశాఖపట్నంలోని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. భారతీయ జాలర్లు కొందరు పాకిస్థాన్ జలాల్లోకి ప్రవేశించగా, పాక్ నేవీ అధికారులు అరెస్టు చేసి, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్లలోని సిమ్ కార్డులను 2021లో అల్తాఫ్ హుసేన్ అలియాస్ షకీల్ ఉపయోగించుకొని భారతదేశంలో గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడ్డాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు. కోర్టులో నేరం నిర్ధారణ కావడంతో ఒక సెక్షన్ కింద ఐదున్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా, మరో సెక్షన్ కింద రెండున్నరేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించింది.

హైకోర్టు న్యాయమూర్తిగా న్యాయవాది మెడమల్లి బాలాజీ

» కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు



అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా న్యాయవాది మెడమల్లి బాలాజీని నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం బుధవారం సమావేశమై ఆయన పేరుకు ఆమోదం తెలిపింది. నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 32గా ఉంది. కొలీజియం సిఫారసును కేంద్రం ఆమోదిస్తే బాలాజీతో కలిపి ఆ సంఖ్య 33కి చేరుతుంది.

బాలాజీ నేపథ్యమిదీ.. మెడమల్లి బాలాజీది వ్యవసాయ నేపథ్య కుటుంబం. లక్ష్మీనరసమ్మ, సుబ్బయ్యనాయుడు దంపతులకు 1972 మే 29న జన్మించారు. ఆయన స్వస్థలం కడప జిల్లా రాజంపేట మండలంలోని శేషన్నగారిపల్లి గ్రామం. తండ్రి సుబ్బయ్య నాయుడు సహకార సెంట్రల్ బ్యాంకులో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు. పాఠశాల విద్యను రాజంపేటలో పూర్తిచేసిన బాలాజీ తిరుపతి శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కాలేజీ నుంచి డిగ్రీ పట్టా పొందారు. హైదరాబాద్‌లోని పడాల రామిరెడ్డి న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1998 ఏప్రిల్ 9న న్యాయవాదిగా బార్‌కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయ్యారు. రాజ్యాంగ సంబంధ అంశాలు, సివిల్, క్రిమినల్, సర్వీసు, కమర్షియల్ కేసులు వాదించడంలో ఆయనకు అపార అనుభవం ఉంది. 2004 నుండి 2006 వరకు అడ్వకేట్ జనరల్ (ఏజీ) కార్యాలయానికి అనుబంధంగా ఏజీపీగా సేవలు అందించారు. 2018-19 మధ్య విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు స్టాండింగ్ కౌన్సిల్‌గా పని చేశారు. వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థలు, బ్యాంకులకు స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలు అందించారు.

ఏఐ వినియోగంలో అప్రమత్తం

» దిగువ కోర్టులకు హైకోర్టు సూచన

» నైతిక విచక్షణ, సాక్ష్యాధారాలను విశ్లేషించే సామర్థ్యం ఏఐకి ఉండదు

» మానవ మేధస్సుకే ప్రాధాన్యం ఇవ్వాలి

» ఉనికిలో లేని తీర్పులను సృష్టించిన ఏఐ

» వాటిని ఉత్తర్వుల్లో ప్రస్తావించిన జడ్జి

» ఏఐ వల్ల తప్పు జరిగిందని వివరణ

» సివిల్ రివిజన్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ(ఏఐ) వినియోగంలో దిగువ కోర్టులను రాష్ట్ర హైకోర్టు అప్రమత్తం చేసింది. తీర్పులలో ఏఐ సాధనాలు ఉపయోగించేప్పుడు అత్యంత జాగ్రత్తగా, అప్రమత్తతో వ్యవహరించాలని సూచించింది. ఏఐ కంటే మనవ మేధస్సుకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలంది. కేవలం సాంకేతికతపై ఆధారపడకుండా, న్యాయపరమైన విచక్షణ ప్రదర్శించాలని స్పష్టం చేసింది. తీర్పులు చట్టబద్ధమైన సూత్రాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలంది. ప్రస్తుతం ఏఐ అభివృద్ధి దశలో ఉందని, సమాచారాన్ని సమకూర్చడానికి ఉపయోగపడే సాధనంగానే దానిని చూడాలని పేర్కొంది. ఏఐకి ఎలాంటి స్పృహ, నైతిక విచక్షణ, సాక్ష్యాధారాలను విశ్లేషించే సామర్థ్యం, మానవ ప్రవర్తనలో ఉండే సూక్ష్మ భేదాలను అర్థం చేసుకునే సామర్థ్యం ఉండదని తెలిపింది. ఏఐ సాధనాలు ఉనికిలో లేని తీర్పులను సృష్టిస్తున్నాయని, ఈ విషయం ఆందోళనకరమని తెలిపింది. ఏఐ ఇచ్చిన సమాచారాన్ని యథాతథంగా తీసుకోవద్దని హెచ్చరించింది. ప్రస్తుత కేసులో ట్రయల్ కోర్టు న్యాయాధికారి ఇచ్చిన ఉత్తర్వుల్లో ఉనికిలో లేని తీర్పులు ప్రస్తావించినందున ఉత్తర్వులను కొట్టివేయాలని పిటిషనర్లు కోరారని గుర్తు చేసింది. ఉనికిలో లేని తీర్పులను ఉత్తర్వులలో ఉదహరించినంత మాత్రాన అవి చెల్లకుండా పోవని స్పష్టత ఇచ్చింది. ఉత్తర్వులలో న్యాయాధికారి సరైన న్యాయసూత్రాన్నే అన్వయించారని తెలిపింది. ప్రస్తుత కేసులో ట్రయల్ కోర్టు అధికార పరిధి దాటి వెళ్లలేదని, అలాగే ఉత్తర్వుల్లో ఎలాంటి చట్టపరమైన లోపాలు లేనందున తాము జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. సివిల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి ఇటీవల తీర్పు ఇచ్చారు.



ఇదీ కేసు..

ఓ సివిల్ వివాదంలో విజయవాడ కోర్టు ఆదేశాల మేరకు అడ్వొకేట్ కమిషనర్ నివేదిక సమర్పించారు. ఆ నివేదికపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, దానిని రద్దు చేయాలని గుమ్మడి ఉషారాణి, సునీత అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయాధికారి అడ్వొకేట్ కమిషనర్ నివేదిక కేవలం సాక్ష్యం మాత్రమేనని, దానిపై అభ్యంతరం ఉంటే ట్రయల్ విచారణలో క్రాస్ ఎగ్జామినేషన్ ద్వారా తేల్చుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనుబంధ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఆగస్టు 19న ఉత్తర్వులు ఇచ్చారు. దీనిలో 4 తీర్పులను ఉదహరించారు. అయితే.. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఉషారాణి, సునీత హైకోర్టులో సివిల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ రవినాథ్ తిల్హరి విచారణ జరిపారు. ఉషారాణి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ట్రయల్ కోర్టు న్యాయాధికారి ఇచ్చిన ఉత్తర్వుల్లో ప్రస్తావించిన 4 తీర్పులు ఉనికిలో లేవని, ఉత్తర్వులను రద్దు చేయాలని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి.. న్యాయాధికారి నుండి నివేదిక కోరారు. దీంతో న్యాయాధికారి నివేదిక ఇచ్చారు. దీనిలో తాను మొదటిసారి ఏఐని వినియోగించానని, అది చూపిన తీర్పులు సరైనవేనని నమ్మి ఉత్తర్వుల్లో చేర్చానని అంగీకరించారు. భవిష్యత్తులో జాగ్రత్తగా ఉంటానని కోర్టుకు తెలిపారు. అయితే, ఉత్తర్వుల్లో వాడిన న్యాయసూత్రం సరైనదేనని, చెల్లుబాటు అవుతుందని పేర్కొన్నారు. నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి.. సివిల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టివేశారు.

నిందితుల పరేడ్‌ను అడ్డుకోండి

» హైకోర్టులో పిల్ దాఖలు

వివిధ కేసుల్లో నిందితులను వీధుల్లో నడిపిస్తూ పరేడ్ నిర్వహించడం, మీడియా ముందు ప్రవేశపెట్టడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ, ఎన్విరాన్‌మెంటల్ సంస్థ అధ్యక్షుడు పరసా సురేశ్ కుమార్ దీన్ని దాఖలు చేశారు. నిందితులను వీధుల్లో నడిపించడం వారి హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. పోలీసుల చర్య సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు విరుద్ధమని తెలిపారు. హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ఎస్పీలను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

ఎట్టకేలకు గ్రూప్-2 ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ఆగమేఘాలపై కదలిక వచ్చింది. ఫలితాల విడుదలలో జాప్యంపై 'గ్రూప్-2పై నత్తనడక' శీర్షికతో మంగళవారం కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు ఆరా తీశారు. అభ్యర్థుల్లో ఆందోళన పెరుగుతోందని గుర్తించిన అధికారులు ఫలితాలు ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో అప్పటికప్పుడు ఫలితాల విడుదల ప్రక్రియను కమిషన్ ప్రారంభించి పూర్తి చేసింది. దీనిపై అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 905 పోస్టులకు గాను కోర్టు ఆదేశాలతో రెండు పోస్టులను రిజర్వ్ చేశారు. న్యాయశాఖ ఏఎస్‌వో, ఎక్సైజ్ ఎస్ఐ పోస్టులు మినహాయించి మిగిలిన వాటికి ఫలితాలు ఇచ్చేందుకు సన్నద్ధమయ్యారు. కొన్ని కేటగిరీల్లో అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో 891 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. రిజర్వ్ చేసిన రెండు కాకుండా మరో 12 పోస్టులు మిగిలిపోయాయి. వాటిని తర్వాత నోటిఫికేషన్లలో క్యారీ ఫార్వార్డ్ పోస్టులుగా గుర్తిస్తారు. మున్సిపల్ గ్రేడ్-3 కమిషనర్ పోస్టులకు నలుగురు, సబ్‌రిజిస్ట్రార్ పోస్టులకు 16 మంది, డిప్యూటీ తహసీల్దార్ పోస్టులకు 84 మంది, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పోస్టులకు 28 మంది, సహకార సొసైటీల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ పోస్టులకు 16 మంది, పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులకు ఇద్దరు, ఎక్సైజ్ ఎస్ఐ పోస్టులకు 150 మంది, సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(జీఏడీ) పోస్టులకు 218 మంది, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(లా) పోస్టులకు 11 మంది, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(లెజిస్లేచర్) పోస్టులకు 15 మంది, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్(ఆర్థిక) పోస్టులకు 29 మంది, సీసీఎల్‌ఏలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు 31 మంది, వైద్య ఆరోగ్య శాఖలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు 19 మంది, ప్రభుత్వ పరీక్షల విభాగంలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు 19 మంది, ఇతర శాఖల్లో ఉద్యోగాలకు అభ్యర్థులను ఏపీపీఎస్సీ ఎంపిక చేసి తుది ఫలితాలు విడుదల చేసింది.

హైకోర్టు తుది తీర్పు షరతుతో..

హైకోర్టులో ఉన్న కేసులపై వచ్చే తుది తీర్పునకు అనుగుణంగా ఉండాలనే షరతుతో ఏపీపీఎస్సీ ఫలితాలు విడుదల చేసింది. న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం ఇద్దరు అభ్యర్థులకు క్రీడా కోటా పోస్టులను రిజర్వ్ చేసింది. ఆ ఇద్దరు కేసుల్లో గెలిచి ఆ ఉద్యోగాలు సాధిస్తే రోస్టర్ ఇలాగే కొనసాగుతుంది. ఒకవేళ వారు కేసుల్లో ఓడిపోతే కొన్ని పోస్టులు మారిపోతాయి. మరోవైపు నోటిఫికేషన్‌లోని రోస్టర్‌పై మళ్లీ దాఖలైన రిట్ బుధవారం విచారణకు వచ్చింది. ఈ మూడు కేసులపై వచ్చే తుది తీర్పులకు అనుగుణంగా ఈ పోస్టింగులు ఉంటాయని ఏపీపీఎస్సీ తెలిపింది.

తెల్లవారుజాము వరకు ఉత్కంఠ

2024లో వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలను ఇలాగే అర్ధరాత్రి తర్వాత విడుదల చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కూడా అదే సీన్ రిపీట్ అయ్యింది. ఫలితాల విడుదలపై ముందుగానే అభ్యర్థులకు సమాచారం అందడంతో తెల్లవారుజాము వరకు నిద్రపోకుండా ఉత్కంఠగా ఎదురుచూశారు.

టీచర్లకు గ్రూప్-2 కొలువులు

పాఠశాల విద్యాశాఖలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న మోతుకూరి రవీంద్ర గ్రూప్-2 ఫలితాల్లో ఉద్యోగం సాధించారు. అందులోనూ కీలకమైన గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్ ఉద్యోగానికి ఆయన ఎంపికయ్యారు. పోలియోతో చిన్నతనంలోనే దివ్యాంగుడైన రవీంద్ర 2001 డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా నాగులుప్పాడలోని ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. రెంటచింతలకు చెందిన మరో టీచర్ సురేశ్‌కు సబ్‌రిజిస్ట్రార్ ఉద్యోగం వచ్చింది. ఇంకా పలు శాఖల్లో చిన్నపాటి ఉద్యోగాలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-2 ఉద్యోగాలు సాధించారు.

రైల్వే కనెక్టివిటీ పెరగాలి

- దేశంలోని మార్కెట్లకు ఉద్యాన ఉత్పత్తుల రవాణా
- ఆ దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయండి
- 2027 నాటికి 73 అమృత్ రైల్వేస్టేషన్లు అభివృద్ధి
- రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష



రైల్వే ప్రాజెక్టులపై జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబుకు మొక్కను అందజేస్తున్న అధికారులు

విజయవాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టుల విషయంలో ఏపీని బెంచ్‌మార్క్‌గా నిలపాలని రైల్వే అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న 225 లక్షల టన్నుల ఉద్యాన ఉత్పత్తులను దేశంలోని వివిధ మార్కెట్లకు రవాణా చేసేలా ఏపీలో రైల్వే కనెక్టివిటీ పెరిగే దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై సచివాలయంలో సీఎం బుధవారం సమీక్ష నిర్వహించారు. పొరుగు రాష్ట్రాల్లోని హింటర్‌ల్యాండ్‌ను ఏపీ పోర్టులు అన్నింటితో అనుసంధానించేలా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి ఏపీ పోర్టులకు రైలు రవాణాకు నెలకొన్న అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు, ఫిషింగ్ హార్బర్లు వస్తున్నాయని.. మూలపేట, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులతో ప్రధాన లైన్లను త్వరితగతిన అనుసంధానం చేయాలని సీఎం పేర్కొన్నారు. తిరుపతి- రేణిగుంట ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా తయారవుతోందని, దీనిని ప్రధాన రైల్వే మార్గాలతో అనుసంధానిస్తే పారిశ్రామిక ఉత్పత్తులను వేగంగా, తక్కువ వ్యయానికే రవాణా చేసేందుకు వీలుంటుందని చెప్పారు. ఇచ్ఛాపురం- తడ మధ్య నాలుగు వరుసల రైల్వేలైన్ల నిర్మాణం వచ్చే మూడేళ్లలో కార్యరూపం దాల్చేలా డీపీఆర్ తయారు చేయాలని రైల్వే అధికారులను ఆదేశించారు. అవసరమైన భూమి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైల్వే ప్రాజెక్టుల పర్యవేక్షణ, భూసేకరణ తదితర ప్రక్రియలకు రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజకవర్గాల వారీగా డిప్యూటీ తహసీల్దార్లను నియమించాలని ఆదేశించారు. రాష్ట్రంలో అమృత్ పథకం కింద ఎంపికైన 73 రైల్వేస్టేషన్లను 2027 నాటికి అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. అలాగే రాయలసీమ- కోస్తాంధ్రలోని వివిధ ప్రాంతాల మధ్య కనెక్టివిటీ పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ, విజయవాడ, గుంతకల్, గుంటూరు, రేణిగుంట తదితర రైల్వే జంక్షన్లలో రద్దీని తగ్గించడంపైనా చర్చించారు. రాజధాని అమరావతిని కలుపుతూ ఎర్రుపాలెం-నంబూరు కొత్త రైల్వేలైన్ నిర్మాణ ప్రతిపాదనను త్వరగా పట్టాలెక్కించాలని సూచించారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై సహా అన్ని ప్రధాన నగరాలను అమరావతి కోర్ కేపిటల్‌తో కలిపేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రతిపాదించారు. గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌ను పూర్తిగా ఆధునీకరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు రైల్ కనెక్టివిటీ పెంచడంపైనా, విజయవాడ బైపాస్, భద్రాచలం రోడ్- కొవ్వూరు సహా రాష్ట్రంలో వివిధ రైల్వే మార్గాలపైనా సమీక్షించారు. హైదరాబాద్- చెన్నై, చెన్నై- బెంగళూరు, హైదరాబాద్- బెంగళూరు లైన్లను హైస్పీడ్ రైల్వే కారిడార్లుగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. 864 కిలోమీటర్ల పొడవున చేపట్టే ఈ కారిడార్ కోసం రూ.1,90,907 కోట్ల వ్యయం అవుతుందని సీఎంకు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2,318 కిలోమీటర్ల పొడవున రూ.34,310 కోట్లతో 39 కొత్త రైల్వే లైన్ల ప్రాజెక్టులు చేపట్టామని వివరించారు. ఈ సమీక్షలో దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల జనరల్ మేనేజర్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

గంజాయి, డ్రగ్స్‌పై కఠిన చర్యలు

- కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్-ఫ్రీ కరిక్యులం
- మంత్రుల ఉపసంఘం భేటీలో మంత్రి లోకేశ్ ఆదేశాలు



సచివాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యల పట్ల 70 శాతం ప్రజలు సంతృప్తిగా ఉన్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ ముప్పును అరికట్టేందుకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, ప్రణాళికలపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన అమరావతి సచివాలయంలో బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన కఠినచర్యలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. పూర్తిగా అరికట్టే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్జీవోల ఆధ్వర్యంలో డీ అడిక్షన్ కేంద్రాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించాలన్నారు. కేజీ నుంచి పీజీ వరకు డ్రగ్ ఫ్రీ ఏపీ కరిక్యులమ్ అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈగల్ యాప్‌ను లీప్ యాప్‌కు అనుసంధానించాలని లోకేశ్ నిర్దేశించారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను ఈ సమావేశంలో అధికారులు వివరించారు. జీరో గంజాయి సాగు రాష్ట్రంగా ఏపీ మారిందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు చిన్నారులను దూరంగా ఉంచాల్సిందే

- విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే నేరగాళ్లపై కఠిన చర్యలు
- ఇందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేకాధికారి
- అధికారులకు మంత్రుల ఆదేశం.. లోకేశ్ అధ్యక్షతన సమావేశం

అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత వయసు లోపు మైనర్లను సోషల్ మీడియాకు దూరంగా ఉంచే విషయంపై విధి విధానాలను రూపొందించాలని మంత్రి లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సోషల్ మీడియా జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంపై బుధవారం అమరావతి సచివాలయంలో ఏర్పాటు చేసిన మంత్రుల బృందం సమావేశానికి లోకేశ్ అధ్యక్షత వహించారు.చిన్నారులపై సోషల్ మీడియా నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేసియా, ఫ్రాన్స్‌లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాల్సిందిగా లోకేశ్ సూచించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. మలేసియాలో 16 సంవత్సరాలు దాటిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని తెలిపారు.చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్న విషయంపై మంత్రుల బృంద సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పోస్టు చేసే వారితోపాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే నేరగాళ్లను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు కొలుసు పార్థసారథి, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.



14న రాష్ట్ర బడ్జెట్!

11 నుంచి మార్చి 12 వరకూ అసెంబ్లీ సమావేశాలు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11 నుంచి జరగనున్నాయి. 11వ తేదీ ఉదయం 10 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం అవుతాయని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. 12న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ఆ రోజంతా తీర్మానంపై చర్చ ఉంటుంది. 13న ధన్యవాద తీర్మానంపై సీఎం చంద్రబాబు మాట్లాడుతారు. 14న 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెడతారు. అదే రోజు సభలో వ్యవసాయ బడ్జెట్‌ను వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశపెడతారు. బడ్జెట్ సమావేశాలను నాలుగు వారాల పాటు నిర్వహించనున్నారు. మార్చి 12 వరకు సమావేశాలు జరగనున్నాయి.

తప్పు చేసి బుకాయింపు!

- వైసీపీ నేరప్రవృత్తి ఇదే: చంద్రబాబు
- వాళ్లు తప్పుచేసి మన మీదకు నెట్టేస్తారు
- లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు లేదని సిట్ పేర్కొన్నట్లు వైసీపీ దుష్ప్రచారం
- ఆ నివేదిక బయటకు వచ్చాక ప్రజలకు వాస్తవాలు వివరించాలి
- విమర్శించాలని విమర్శిస్తే లాభం లేదు:సీఎం



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మంత్రులు నిమ్మల, ఆనం, అనగాని, డోలా, కందుల, సవిత, కొండపల్లి

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తప్పు చేయడం.. బుకాయించడం.. వారు చేసిన తప్పును మన మీదకు నెట్టేయడం వైసీపీ వారికి అలవాటేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. కోడి కత్తి దాడి, బాబాయి హత్య, గులకరాయి డ్రామా, పరకామణి చోరీ ఇవన్నీ వారి నేరప్రవృత్తికి అద్దం పట్టేవేనని స్పష్టంచేశారు. తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా ఉదంతంలోనూ.. ముందు అసలు కల్తీయే జరగలేదని బుకాయించారని, ఆ తర్వాత సీఐడీ విచారణపై తమకు నమ్మకం లేదంటూ కోర్టుకు వెళ్లారని.. చివరికి సీబీఐ ఆధ్వర్యంలో సిట్ వేస్తే తన పేరు పత్రికల్లో రాయకుండా చూడాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కోర్టుకు వెళ్లారని.. వైసీపీ నాయకులందరి నైజం ఇలానే ఉంటుందని వ్యాఖ్యానించారు. బుధవారం సచివాలయంలో మంత్రివర్గ సమావేశం అనంతరం కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి సిట్ నివేదికపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఆ నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని సదరు నివేదికలో పేర్కొన్నారంటూ వైసీపీ చేస్తున్నదంతా దుష్ప్రచారమేనని సీఎం చెప్పారు. నివేదిక అధికారికంగా బయటకు వచ్చిన తర్వాత అందులోని వాస్తవాలతో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టాలని మంత్రులను ఆదేశించారు. కల్తీ నెయ్యి ఉదంతం గానీ.. మరే అంశంపై గానీ.. సరైన విషయ పరిజ్ఞానంతో మాట్లాడగలిగితే తప్పు చేసిన వారిని ఇరుకునపెట్టగలమన్నారు. విమర్శించాలనే ఉద్దేశంతో విమర్శించడం వల్ల.. మనం పలుచనవ్వడం తప్ప ఎలాంటి ప్రయోజనమూ ఉండదని చెప్పారు. సరైన సమాచారంతో చేసే విమర్శకు విలువ ఎక్కువ ఉంటుందని.. కల్తీ నెయ్యిపై సిట్ నివేదిక అధికారికంగా చేతికి వచ్చే వరకు వేచి ఉండి.. ప్రత్యర్థులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆధారసహితంగా ఎండగట్టాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెయ్యి కల్తీ జరిగిందనేది వాస్తవమని, ఇదే విషయాన్ని నివేదికలో కూడా పేర్కొన్నట్లు తెలుస్తోందని మంత్రులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. తిరుమలకు సరఫరా చేసిన నెయ్యి కల్తీ జరిగిందని ల్యాబ్ నివేదికలు స్పష్టంగా పేర్కొన్నాయని సిట్ నివేదికలో పేర్కొన్నట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రులు వ్యాఖ్యానించారు. వైవీ సుబ్బారెడ్డి పీఏ బ్యాంకు ఖాతాలో రూ.4.5 కోట్లు జమయిన విషయాన్ని కూడా సిట్ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోందని, అర్హత లేని డెయిరీలకు కాంట్రాక్టులను కట్టబెట్టారని, దీంతో ఆ డెయిరీలు రసాయనాల మిశ్రమంతో చేసిన నెయ్యిని తిరుమలకు సరఫరా చేశాయనికూడా స్పష్టం చేసినట్లు తెలిసిందని తెలిపారు.

మూడేళ్లలో ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలం

రాబోయే మూడేళ్లలో ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలం ఇవ్వాలన్న దానిపై మంత్రులు దృష్టి పెట్టాలని సీఎం మంత్రులను కోరారు. టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించడంపైనా క్యాబినెట్‌లో చర్చ జరిగింది.

అధికారంలోకి రాగానే రిలాక్స్

టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న ప్రతిసారీ నాయకులు మంచి విషయ పరిజ్ఞానంతో ప్రత్యర్థులపై దాడి చేస్తారని.. అధికారంలోకి వచ్చిన తర్వాత రిలాక్స్ అవుతారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. క్యాబినెట్ భేటీ ముగిసిన తర్వాత మంత్రులతో కలిసి భోజనం చేస్తూ ఆయన పలు అంశాలను వారితో పంచుకున్నారు.

టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్పీకర్లు సైతం మనల్ని గౌరవంగా చూసేవారని, శ్రీపాదరావు స్పీకర్‌గా ఉండగా.. తాను అసెంబ్లీకి రాగానే.. ఏం స్వామీ ఈ రోజు ఏమైనా ఇరుకునపెట్టే కార్యక్రమాలు ఉన్నాయా అని అడిగేవారని గుర్తు చేసుకున్నారు. సురేశ్‌రెడ్డి స్పీకర్‌గా ఉన్న సమయంలో.. ముందు ప్రతిపక్షంతో సత్సంబంధాలు కొనసాగించుకోవాలని.. అప్పుడే సభ సజావుగా సాగుతుందని కాంగ్రెస్ మంత్రులకు సలహా ఇచ్చేవారని తెలిపారు. 2008లో వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన సమయంలో మన పార్టీ వ్యవహరించిన తీరు ప్రతిపక్షాలన్నిటికీ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.

ప్రసాదం అపవిత్రం చేయడం క్షమించరాని నేరం: లోకేశ్

మహాపాపం చేసి కూడా బుకాయించడం జగన్‌కే చెల్లిందని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. బుధవారం మంత్రివర్గ సమావేశానికి ముందు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రులకు ఆయన అల్పాహార విందు ఇచ్చారు. పవిత్రమైన తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా.. సిట్ నివేదికలోని అంశాలను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు.

వాసంశెట్టిపై సీరియస్

మంత్రి వాసంశెట్టి సుభాష్ రికార్డింగ్ డ్యాన్సు చేశారని వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శల విషయం ప్రస్తావనకు రాగా.. తాను ఆడవాళ్లతో డ్యాన్సులు వేయలేదని, జబర్దస్త్ షోలో ఆడవేషం వేసే మగ వ్యక్తితోనే డ్యాన్సు చేశానని ఆయన వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అలా అయినా ఎందుకు చేశారని లోకేశ్ ప్రశ్నించారు.



కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో డిప్యూటీ సీఎం పవన్ ఆలింగనం

అండగా నిలవండి

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులు, పరిపాలనాపరమైన అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కాకినాడ జిల్లాలోని ఉప్పాడ సముద్ర తీర కోతను అరికట్టేందుకు ప్రతిపాదించిన 'సీ ప్రొటెక్షన్ వాల్'పై ప్రత్యేకంగా చర్చించారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) టెక్నికల్ అడ్వైజరీ కమిటీ ముందు ఈ ప్రతిపాదనను ఉంచేందుకు కాకినాడ జిల్లా పరిపాలనకు అవకాశం కల్పించాలని కోరారు. పవన్ ప్రతిపాదనకు అమిత్ షా అంగీకారం తెలిపారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినందుకు పవన్ ధన్యవాదాలు తెలిపారు.

మోడల్ రైల్వేస్టేషన్‌గా పిఠాపురం..

పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను పవన్ కల్యాణ్ కోరారు. పిఠాపురం ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణమని, రైల్వే స్టేషన్‌ను అమృత్ స్కీం కింద మోడల్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. అష్టాదశ శక్తిపీఠం, శ్రీపాద శ్రీ వల్లభస్వామి కొలువైన క్షేత్రం పిఠాపురంలో ఉన్నందున దర్శనం నిమిత్తం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని విన్నవించారు. సేతు బంధన్ పథకం కింద మంజూరు చేసిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకం పరిధిలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఇది 2030 జాతీయ రైల్ ప్రణాళికకు అనుగుణంగా లెవల్ క్రాసింగ్‌లు తొలగించేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు సహకరిస్తుందని తెలిపారు. వీటితో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టుల గురించి చర్చించారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినందుకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎక్స్ వేదికగా అమిత్ షా, వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పేదలందరికీ ఇళ్లు



(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 7.50 లక్షల మంది అర్హులు ఉండొచ్చని అంచనా. వీరందరికీ 2029 నాటికి శాశ్వత గృహాలు నిర్మించి ఇవ్వాలని, మిగిలిన 2.50 లక్షల మందికి స్థలాలు కేటాయించాలని క్యాబినెట్ నిర్ణయించింది" అని మంత్రి పేర్కొన్నారు.

క్యాబినెట్ ఆమోదించిన మరికొన్ని నిర్ణయాలు..

- పీఎంఏవై(అర్బన్) 1.0 కింద రాష్ట్రవ్యాప్తంగా హౌసింగ్ యూనిట్లు, మౌలిక సదుపాయాలకు హడ్కో నుంచి రూ.4,451 కోట్ల రుణం పొందేందుకు ఏపీ టిడ్కోకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందుకు సంబంధించి పురపాలక శాఖ జారీ చేసిన జీవోను క్యాబినెట్ ఆమోదించింది.
- పలమనేరులో ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన 33 ఎకరాల భూమిని అక్కడి వ్యవసాయ మార్కెట్ కమిటీ(కొత్త యార్డు)కి బదిలీ చేయడానికి ఆమోదం. ప్రస్తుత యార్డును రైతుబజార్ల సొసైటీకి అప్పగించి, ఆధునిక రైతుబజార్ అభివృద్ధి చేయాలని నిర్ణయం.
- పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి అదనపు సిబ్బంది కేటాయింపునకు ఆమోదం. పిడుగురాళ్లలోని 330 పడకల ఆస్పత్రిని 420 పడకల బోధనాస్పత్రిగా ప్రభుత్వం మార్పు చేసింది. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో 300మందికి పైగా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆ సంఖ్యను 600కు పెంచింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ జారీ చేసిన జీవోను మంత్రివర్గం ఆమోదించింది. అలాగే మార్కాపురం, మదనపల్లె, పులివెందుల, ఆదోని వైద్య కళాశాలలకు మంజూరు చేసిన పోస్టులు తిరిగి కేటాయించాలని నిర్ణయించారు.
- గుంటూరులోని శిల్పారామంలో సాంస్కృతిక కేంద్రం, వినోద జోన్ అభివృద్ధికి 1.47 ఎకరాలు కేటాయింపు. తిరుపతి శిల్పారామాన్ని కన్వెన్షన్ సెంటర్‌గా, విశాఖలో బొటీక్ హోటల్ అభివృద్ధికి జారీ చేసిన లెటర్ ఆఫ్ ఇండెంట్ రద్దుకు ఆమోదం.
- రాజధాని అమరావతిలో వీధి పోటుతో అభ్యంతరాలున్న 112 రిటర్నబుల్ ప్లాట్లను రద్దు చేసి, లాటరీ ద్వారా ప్రత్యామ్నాయ ప్లాట్లను కేటాయించే అధికారం సీఆర్‌డీఏకు ఇస్తూ నిర్ణయం. సదరు ప్లాటు థర్డ్ పార్టీకి బదిలీ కాలేదనే షరతుకు లోబడి ఈ అవకాశం కల్పిస్తారు.
- రాజధానిలో తల్లిదండ్రులు మరణించిన కుటుంబాల్లోని మైనర్లకు ల్యాండ్‌లెస్ పూర్ పెన్షన్‌ను బదిలీ చేసే అధికారాన్ని సీఆర్‌డీఏకు ఇస్తూ నిర్ణయం. వీరికి ఆధార్ ఆధారంగా చెల్లింపులు చేయడానికి ఆమోదం.
- టీటీడీ వైద్య విభాగంలో ల్యాబ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్, ఫిజియోథెరపిస్ట్ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్, చీఫ్ రేడియోగ్రాఫర్, చీఫ్ ఫిజియోథెరపిస్ట్ పోస్టులు సృష్టించడానికి అనుమతి.
- ఏపీ ఎలక్ట్రిసిటీ డ్యూటీ సవరణ బిల్లు-2026ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టడానికి ఆమోదం.
- హడ్కో నుంచి ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.900కోట్ల ప్రత్యేక గడువు రుణం పొందడానికి జారీ చేసిన ఉత్తర్వులను ఆమోదించారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమ కార్యక్రమాలకు అదనపు వనరుల సమీకరణ. రుణ పరిమితులను అదనంగా రూ.11,850 కోట్లకు పెంచి, ఎన్సీడీల జారీకి అనుమతి.
- పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల కోసం గతంలో తీసిన రాళ్లలో సగానికిపైగా పనికిరావని నిపుణులు తేల్చినందున మెతక రాళ్లను తొలగించి, హిల్ నం.902లో రాతి తవ్వకానికి ఆమోదం. ఎడమ ప్రధాన కాలువ అనుసంధాన పనుల్లో భాగంగా ప్యాకేజ్ నం.66లో దాదాపు 890 మీటర్ల పొడవు ఉన్న నావిగేషన్ గుహల నిర్మాణం, సాడిల్ డ్యాం కేవెల్ నిర్మాణంతో సహా ఆఫ్ టేక్ రెగ్యులేటర్ పనుల నిర్మాణానికి ఆమోదం.
- శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ చట్టాన్ని సవరించి, లెప్రసీ అనే పదాన్ని తొలగించే ముసాయిదా బిల్లుకు ఆమోదం.

పలు సంస్థలకు భూ కేటాయింపులు

- ద్వారకాతిరుమల మండలం రాఘవాపురంలో రెండెకరాల ప్రభుత్వ భూమిని షిర్డీ సాయి మందిర అభివృద్ధి కోసం ఎకరం రూ.30 లక్షల చొప్పున కేటాయింపునకు ఆమోదం.
- ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీ ప్రకారం ప్రభుత్వ భూమిని సోలార్ పవర్ కార్పొరేషన్‌కు 33ఏళ్ల పాటు లీజుకు కేటాయింపు. తాడిపత్రి మండలం తలారిచెరువులో 2,191.57 ఎకరాలు, అలూరులో 456.51 ఎకరాల ప్రభుత్వ భూమిని మార్కెట్ విలువపై 10శాతం చెల్లింపుతో కేటాయింపు. తలారిచెరువులో ఎకరానికి రూ.2.15 లక్షలు, అలూరులో రూ.2.50లక్షలు చొప్పున లీజుకు నిర్ణయం.
- గాలివీడు మండలం తూముకుంటలో 100 మెగావాట్ల అల్ట్రా మెగా సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు 52.99 ఎకరాలు ఎకరా రూ.31వేలు చొప్పున, రెండేళ్లకోసారి 5 శాతం పెంపుతో 30 ఏళ్ల పాటు లీజుకు కేటాయింపు.
- రామాయపట్నం పోర్టు దగ్గర ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ఏపీ మారిటైమ్ బోర్డుకు భూమి కేటాయించాలని నిర్ణయం.
- మదనపల్లె మండలం వలసపల్లిలో 6.09 ఎకరాల ప్రభుత్వ భూమిని కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఉచితంగా ఇవ్వడానికి అనుమతి..
- ఎమ్మిగనూరు మండలం బనవాసిలో 77.37 ఎకరాల ప్రభుత్వ భూమిని మెగా టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటుకు ఏపీఐఐసీకి ఉచితంగా కేటాయంపునకు ఆమోదం.
- అల్లూరి జిల్లా నందకోటలో 12.59 ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్యూజ్‌మెంట్ థీమ్ పార్కుతో కూడిన ఫైవ్‌స్టార్ రిసార్ట్ కమ్ కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధి కోసం ఏపీ టూరిజం అథారిటీకి కేటాయింపునకు అంగీకారం.
- రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ, మండల కేంద్రంలో జాతీయ పార్టీలు లేదా గుర్తింపు పొందిన రాష్ట్ర రాజకీయ పార్టీలకు సొంత భూమి లేకపోతే గరిష్ఠంగా 0.50ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించడానికి రెవెన్యూ చట్ట సవరణకు ఆమోదం. అరెకరానికి లీజు ఏడాదికి రూ.1,000గా నిర్ణయం.
- విశాఖ గ్రామీణ మండలం ఎండాడలో 9.04 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ, విద్య, పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ఏఐజీ హాస్పటల్స్ చైర్మన్‌కు కేటాయింపు. గజానికి రూ.44 వేలు లేదా ఎకరం రూ.5 కోట్లకు కేటాయింపు.
- కృష్ణపట్నం ఓడరేవు అవసరాలకు భూకేటాయింపులకు బదులుగా వరికుంటపాడులో 230 ఎకరాలు, పంగిలిలో 216 ఎకరాలు, ఎర్రబల్లిలో 468 ఎకరాలు, గుడినారవ, దేవరాజు-సూరాయపల్లిలో కొంత ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు బదిలీ చేయడానికి క్యాబినెట్ ఆమోదించింది.

రాష్ట్రంలో రాక్షస పాలన!

- జంగిల్ రాజ్‌కు బాబు, లోకేశ్ ప్రోత్సాహం
- వచ్చేది వైసీపీ ప్రభుత్వమే.. జగన్ 2.0 ఎలా ఉంటుందో చూస్తారు
- వైసీపీ అధినేత వార్నింగ్.. భీమవరం నేతలతో భేటీ



అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆరోపించారు. జంగిల్ రాజ్‌ను కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు, ఆయన కొడుకు లోకేశ్ ప్రోత్సహిస్తున్నారని అన్నారు. బుధవారం తాడేపల్లి ప్యాలెస్‌లో భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ ముఖ్య నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. పైన చంద్రబాబు మొదలుకొని కిందిస్థాయిదాకా అవినీతి విచ్చలవిడిగా సాగుతోందన్నారు. పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఏ వర్గానికీ న్యాయం జరగడం లేదని.. ప్రధానంగా మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ నుంచి కూన రవికుమార్ దాకా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని.. అరవ శ్రీధర్ అసలు మనిషేనా అని ప్రశ్నించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఏకంగా స్టేజ్‌పైనే అశ్లీల నృత్యాలు చేస్తున్నారని.. గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్ మహిళతో మాట్లాడుతూ అశ్లీల వీడియోలు చూశాడన్నారు. అధికారాన్ని ఉపయోగించుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు కేసులు కొట్టేయించుకుంటున్నారని ఆరోపించారు. సంక్రాంతి సంబరాలు ఎలా జరిగాయో సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నాయన్నారు. భీమవరం డీఎస్పీ సంక్రాంతి సమయంలో తనకు ఉత్సాహం లేదంటూ పోలీసు డ్రస్సులోనే వ్యాఖ్యానించారని.. చివరకు పులివెందులలోనూ కోడి పందాల సంస్కృతిని ఆర్గనైజ్డ్‌గా తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. తన నియోజకవర్గంలో కోడి పందాల నిర్వహణకు ఏకంగా వేలం పాటలు వేశారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకూ.. గతంలో వైసీపీ పాలనకూ మధ్య తేడాను ప్రజలకు వివరించాలని నేతలకు సూచించారు. కళ్లు మూసుకుంటే రెండేళ్లు పూర్తి కావస్తోందని.. మళ్లీ కళ్లు మూసుకుంటే మిగతా మూడేళ్లూ పూర్తవుతాయని తెలిపారు. ఏడాదిన్నర తర్వాత తాను 150 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తానని.. ప్రతి మూడు రోజులకోసారి ప్రజా ఉప్పెన మధ్య బహిరంగ సభ నిర్వహిస్తానని అన్నారు. భవిష్యత్‌లో వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. జగన్ 2.0 ఎలా ఉంటుందో చూస్తారని మాజీ సీఎం హెచ్చరించారు.

జగన్... అసెంబ్లీకి వెళ్లకపోతే రాజీనామా చెయ్యి

- సీమపై సభలో మాజీ సీఎం మాట్లాడాలి
- రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి

కర్నూలు న్యూసిటీ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్ బయట ఉంటూ మాట్లాడటం కాదు. అసెంబ్లీకి వెళ్లి గళమెత్తాలి. అసెంబ్లీకి వెళ్లకపోతే రాజీనామా చేయాలి' అని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు రాయలసీమకు వరప్రసాదం. దానిపై వైసీపీ నాయకులు, ఆ పార్టీ అధినేత జగన్ బయట నుంచి మాట్లాడటం సరికాదు. మాజీ సీఎంగా, ప్రతిపక్ష పార్టీ నేతగా జగన్ చేతులు ముడుచుకుని కూర్చోవడం విడ్డూరంగా ఉంది. సీమ లిఫ్ట్ ఇరిగేషన్ నిలుపుదల అంశంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేసి నెలరోజులవుతోంది. నేటికీ ఆ వ్యాఖ్యలను జగన్ ఖండించకపోవడం బాధాకరం. అసెంబ్లీకి వెళ్లి కూటమి ప్రభుత్వాన్ని నిలదీయకుండా రాయలసీమకు తీరని ద్రోహం చేస్తున్నారు. దమ్ముంటే అసెంబ్లీలో రాయలసీమ లిఫ్టు ప్రాజెక్టుపై జగన్ కూటమి ప్రభుత్వాన్ని నిలదీసి ప్రాజెక్టు పనులను పునరుద్ధరించేలా చొరవ తీసుకోవాలి. జగన్... అసెంబ్లీకి వెళ్తావా? రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళ్తావా? తేల్చుకో. వివిధ రంగాల్లో బడ్జెట్ కేటాయింపులను రాయలసీమ ప్రాంతాల్లో ఖర్చు చేయడం లేదు. అందువల్ల జనాభా ప్రాతిపదికన 42 శాతం బడ్జెట్ నిధులను రాయలసీమకు విడిగా కేటాయించాలి. కడప ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో పూర్తిచేయాలి. విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి' అని కుంచం కోరారు.

రాజధానిలో న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ

- రూ.100 కోట్లతో ప్రాంతీయ కార్యాలయ నిర్మాణం
- 200 మందికిపైగా ఉద్యోగావకాశాలు.. సీఆర్‌డీఏతో ఎంఓయూ

గుంటూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రాంతీయ కార్యాలయ ఏర్పాటుకు ది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ముందుకొచ్చింది. ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి పరిధిలో రూ.100 కోట్ల వ్యయంతో ఈ కార్యాలయాన్ని నిర్మించనుంది. ఈ మేరకు కంపెనీ చీఫ్ రీజినల్ మేనేజర్ వి.రాజా, సీఆర్‌డీఏ అధికారుల మధ్య బుధవారం ఒప్పందం కుదిరింది. అమరావతిలో టెక్నికల్, ఫైనాన్స్, మార్కెటింగ్, అడ్మినిస్ట్రేషన్ వంటి విభాగాల్లో 200 నుంచి 225 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అలాగే ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త ఇన్సూరెన్స్ ఉత్పత్తుల అభివృద్ధికి ఏఐ స్పెషలిస్ట్ అధికారులను కూడా నియమించనున్నామని చెప్పారు. గ్రామీణ, పట్టణ, కార్పొరేట్ రంగాలతో పాటు సాధారణ ప్రజలకు అవసరమైన అన్ని రకాల నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను అమరావతి ప్రాంతీయ కార్యాలయం ద్వారా అందిస్తామని పేర్కొన్నారు.

అప్పన్న సన్నిధిలో టీమిండియా

సింహాచలం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): భారత క్రికెట్ జట్టు(టీ-20) కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి బుధవారం సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంది. వారికి ఆలయ రాజగోపురం వద్ద భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద ఏఈవో తిరుమలేశ్వరరావు, ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు పూర్ణకుంభంతో లోపలికి తీసుకువెళ్లారు. క్రికెటర్ల గోత్రనామాలతో అర్చకులు అర్చన చేశారు. కప్పస్తంభం ఆలింగనం, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు అనంతరం పండితులు ఆశీర్వచనం పలికారు. ఏఈవో శాలువాలతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. అప్పన్నను దర్శించుకున్న వారిలో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, జట్టు సభ్యులు రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్ తదితరులు ఉన్నారు.



ఆలయంలోకి ప్రవేశిస్తున్న క్రికెటర్లు సూర్యకుమార్ యాదవ్, రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్, కోచ్ గౌతమ్ గంభీర్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలపై ప్రత్యేక దృష్టి

- సచివాలయంలో ముగ్గురు మంత్రుల భేటీ

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. మెనూ ప్రకారం ఆహారం అమలు, హాస్టళ్లలో పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్య భద్రతతో పాటు సాంకేతిక విద్య పక్కాగా అందించేలా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మంత్రులు సవిత, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎన్ఎండీ ఫరూక్ అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం భేటీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్య, ఆరోగ్య భద్రత అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు అన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. గురుకులాల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇన్సినరేటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంక్షేమ వసతి గృహాల తనిఖీకి ప్రత్యేక అధికారుల బృందాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ బృందాలు తరచూ హాస్టళ్లను సందర్శించి, పనితీరు మెరుగుకు కృషి చేస్తాయని మంత్రి సవిత వెల్లడించారు. ఈ సమావేశంలో ఆయా సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మీ రాక్షస పాలన తట్టుకోలేకే 11 సీట్లిచ్చారు: నిమ్మల

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జగన్ రాక్షస పాలనను తట్టుకోలేక 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఆయన పార్టీని 151 స్థానాల నుంచి 11 స్థానాలకు దించేశారని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్నికల ముందు నిర్మాణం పూర్తికాకుండానే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితమిచ్చి.. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలను ఆయన మోసగించారని ధ్వజమెత్తారు. ఈ మోసాన్ని గుర్తించే ఆయా జిల్లాల ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. బుధవారం ఆయన వెలగపూడి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏడాదిన్నరలో వెలిగొండ కోసం రూ.570.85 కోట్లు వ్యయం చేశామని తెలిపారు. ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులు, వాల్వ్‌ల కోసం రూ.456 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. వారం రోజుల్లో ప్రాజెక్టును ముఖ్యమంత్రి సందర్శిస్తారు. ఈ ఏడాది దానిని పూర్తిచేస్తామని స్పష్టం చేశారు.

అరవ శ్రీధర్‌పై ఆరోపణల విచారణకు కమిటీ

అమరావతి/రైల్వేకోడూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలు, ఓ మహిళ చేసిన ఆరోపణలపై విచారణ చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. ఈ అంశంపై ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించినట్లు పార్టీ అధ్యక్షుడి రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా టి.శివశంకర్, తంబళ్లపల్లి రమాదేవి, టి.సి.వరుణ్‌లను నియమించారు. ఎమ్మెల్యే శ్రీధర్ ఏడు రోజుల్లోగా కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టం చేశారు.

94,689 మందికి ఉచిత కళ్లజోళ్లు

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 94,689 మంది విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీకి ఆరోగ్యశాఖ సన్నద్ధమైంది. గుంటూరు జిల్లా తెనాలిలో ఫిబ్రవరి 3న మంత్రులు సత్యకుమార్, నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా దీనికి అనుగుణంగా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పంపిణీ జరుగుతుందని అధికారులు తెలిపారు.

వైసీపీ నాయకులు భయపడుతున్నారు: మాధవీరెడ్డి

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పంపిణీ చేస్తున్న పట్టాదారు పాసుపుస్తకాలపై ఉన్న రాజముద్రను చూసి వైసీపీ నాయకులు భయపడుతున్నారని కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 'ఆయుధం పిచ్చోడి చేతిలో ఉడడానికి, మంచోడి చేతిలో ఉండడానికి తేడా పట్టాదారు పాసుపుస్తకాలే. భూముల రీసర్వే పేరుతో జగన్ చేసిన దోపిడీలు, దుర్మార్గాలు, అక్రమాలు ప్రజలు మర్చిపోలేదు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూముల్ని జగన్ దోచుకున్నారు' అని మాధవీ రెడ్డి విమర్శించారు.

తల్లిపాలనూ కల్తీ చేయగలరు: మంత్రి డోలా

తల్లి పాలను కూడా కల్తీ చేయగల ఘనులు వైసీపీ నాయకులని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి విమర్శించారు. 'పాలు లేకుండా, వెన్న లేకుండా విష రసాయనాలతో కల్తీ నెయ్యి సృష్టించి అటు భక్తుల సెంటిమెంటుతోనూ, ఆరోగ్యాలతోనూ వైసీపీ నాయకులు చెలగాటమాడారు. జంతు కొవ్వు అవశేషాలు ఉన్నాయనేది స్పష్టం. సిట్ నివేదిక త్వరలోనే అధికారికంగా బయటకు వస్తుంది. వైసీపీ నాయకుల బండారం బయటపడుతుంది' అని మంత్రి డోలా అన్నారు.

కల్తీ జరిగిందా? లేదా? అన్నదే ముఖ్యం: కొలుసు



'గత ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూల తయారీకి వాడిన నెయ్యిలో కల్తీ జరిగిందా? లేదా? అన్నది ముఖ్యం. నెయ్యిలో వాడింది ఆవు కొవ్వా, పంది కొవ్వా అన్నది రిపోర్టులో తేలుతుంది. ప్రభుత్వానికి అధికారికంగా రిపోర్టు అందాల్సి ఉంది. పూర్తి రిపోర్టు సిట్ నుంచి వచ్చాక స్పష్టంగా మాట్లాడతాం' అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. 'కల్తీ నెయ్యి వాడకంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. కల్తీ జరిగిందా లేదా అన్నదే ముఖ్యం. దీనిపై ప్రతిపక్షం చిల్లర అల్లరి చేస్తోంది' అని మంత్రి మండిపడ్డారు. ఎమ్మెల్యే శ్రీధర్‌పై వచ్చిన లైంగికవేధింపుల ఆరోపణలను మీడియా ప్రస్తావించగా... 'అదేమైనా ప్రజల సమస్యా? ఆ విషయం నాకు తెలియదు' అన్నారు.

విశాఖకు ఆర్ఎంజెడ్ బృందం

భూములు పరిశీలన.. డేటా సెంటర్, జీసీసీ ఏర్పాటుకు దావోస్‌లో ఎంఓయూ



ఆనందపురం మండలం జగన్నాథపురంలో ఆర్ఎంజెడ్ బృందానికి భూముల గురించి వివరిస్తున్న ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్

విశాఖపట్నం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన ఆర్ఎంజెడ్ కార్పొరేషన్ ప్రతినిధులు విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఐటీ సంబంధిత పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఏపీఐఐసీ అధికారులు వారికి భూములు చూపించారు. రాబోయే ఐదారేళ్లలో ఏపీలో రూ.83 వేల కోట్ల పెట్టుబడులు పెడతామని ఇటీవల దావోస్‌లో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ఆర్ఎంజెడ్ గ్రూపు ఒప్పందం చేసుకుంది. అందులో భాగంగా విశాఖపట్నంలో ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్, 50 ఎకరాల్లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ తొలుత ఏర్పాటు చేస్తామని ప్రభుత్వానికి తెలిపింది. వాటికి అవసరమైన భూములు చూసుకోవడానికి ఆర్ఎండీ ఇన్‌ఫ్రా ప్రెసిడెంట్ దీపక్ ఛాబ్రియా, సూపర్‌వైజరీ బోర్డు చైర్ రాజ్ మెండా తదితరులు బుధవారం విశాఖపట్నం వచ్చారు. అధికారుల బృందం వారికి మూడు ప్రాంతాల్లో భూములు చూపించింది. విజయనగరంలో ఒకచోట, విశాఖ జిల్లా ఆనందపురం మండలం జగన్నాథపురం, విశాఖపట్నం నగర శివార్లలోని కాపులుప్పాడ ఐటీ లేఅవుట్‌లో భూములను చూపించారు. త్వరలోనే ఎక్కడ? ఎంతెంత? భూములు కేటాయించేదీ తెలుస్తుందని అధికార వర్గాలు తెలిపాయి.

వచ్చే నెలలో గూగుల్‌కు భూమి పూజ

- విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): డేటా సెంటర్ ఏర్పాటు నిమిత్తం ఆనందపురం మండలం తర్లువాడలో 308 ఎకరాలను వారం రోజుల్లో గూగుల్ కంపెనీకి అప్పగిస్తామని విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్ వెల్లడించారు. '51మంది డీపట్టా రైతుల్లో 49మంది భూములు అప్పగించేందుకు అంగీకారం తెలిపారు. మిగిలిన ఇద్దరు రెండు, మూడు రోజుల్లో ఇవ్వనున్నారు. రైతుల ఖాతాలకు దశలవారీగా సొమ్ము జమ అవుతుంది. తొలుత ఈ భూములను ఏపీఐఐసీకి బదలాయిస్తాం. ఆ తరువాత గూగుల్‌కు ఏపీఐఐసీ అప్పగిస్తుంది. భూముల్లో ఉన్న చెట్లు, పొదలు తొలగించే పనులు ఇప్పటికే మొదలయ్యాయి. భూముల అప్పగింత ప్రక్రియ పూర్తయిన తరువాత ఫిబ్రవరిలోనే డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ జరుగుతుంది' అని కలెక్టర్ వివరించారు. అడవివరంలో సింహాచలం దేవస్థానం నుంచి కొంత భూమి గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయింపుపై ప్రభుత్వానికి నివేదించామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకువెళతామని పేర్కొన్నారు.

వచ్చే నెల నుంచి ఏఐ వర్సిటీ కార్యకలాపాలు

- ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్
- దేశంలో ఇదే తొలిసారి అని వెల్లడి



సాగర్‌నగర్ (విశాఖపట్నం), జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ విశ్వవిద్యాలయం ఫిబ్రవరి 19 నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుందని ప్రభుత్వ ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ వెల్లడించారు. ఎన్‌విడియా భాగస్వామ్యంతో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటవుతున్నట్లు తెలిపారు. భారత్-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026కు ప్రీ సమ్మిట్ కార్యక్రమంగా ఏఐ ఫర్ పబ్లిక్ గుడ్ డెమో డే కార్యక్రమాన్ని బుధవారం గీతం విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాటంనేని భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ ఒక ఏఐ ఏజెంట్(టూల్)ను అందించే వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు చెప్పారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ ద్వారా ఏజెంట్ స్పేస్ పేరుతో రూపొందించిన ఈ ఏఐ ఆధారిత వర్క్ స్పేస్.. పాలనా ఉత్పాదకత సేవలను మరింత మెరుగు పరుస్తుందన్నారు. రానున్న కాలంలో పాలనతో పాటు వృత్తి రంగాల్లో ఏఐ ప్రభావం మరింత విస్తృతంగా ఉండనుందని పేర్కొన్నారు. యువత ఏఐ సంబంధిత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాలన, పౌర సేవల కోసం ఇప్పటికే అభివృద్ధి చేయబడి, పరీక్షించబడి అమలుకు సిద్ధంగా ఉన్న 10 ఏఐ వ్యవస్థలను ఈ డెమో డే కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించారు. ప్రజల జీవితాల్లో ప్రత్యక్షంగా ప్రభావం చూపే అంశాలకు ఎలాంటి పరిష్కారాలను చూపుతాయో వివరించారు. కార్యక్రమంలో గీతం ప్రో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జీఎస్ఐబీ డీన్ ప్రొఫెసర్ రాజాపణి పప్పు, వివిధ విభాగాల డీన్‌లు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ మెరిసిన 'కియ'

వరుసగా రెండోసారి 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' సర్టిఫికెట్

పెనుకొండ రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కార్ల ఉత్పత్తిలో దూసుకెళ్తూ.. మరోవైపు ప్లాంట్‌లో సానుకూల పని వాతావరణాన్ని కల్పిస్తున్న కియ కార్ల తయారీ సంస్థ వరుసగా రెండో ఏడాదీ 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం యర్రమంచి సమీపంలో ఏర్పాటైన కియ కార్ల తయారీ పరిశ్రమ.. ఈ ఏడాది కూడా ఈ సర్టిఫికెట్‌ను అందుకున్నట్లు కియ ఇండియా సీఈవో గ్వాంగ్ లీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలో ప్రముఖ మాస్ ప్రీమియం కార్ల తయారీ సంస్థల్లో కియ ఇండియా ఒకటి. 2017 ఏప్రిల్‌లో యర్రమంచి వద్ద ఈ ప్లాంట్ ప్రారంభమైంది. ఈ ప్లాంట్ నుంచి ఇప్పటివరకు తొమ్మిది రకాల వాహనాలను మార్కెట్‌లోకి తెచ్చామని గ్వాంగ్ లీ తెలిపారు. ఇప్పటివరకు సుమారు 15 లక్షల వాహనాలను ఉత్పత్తి చేయగా.. వాటిలో 12 లక్షల కార్లను విదేశాలకు ఎగుమతి చేశామని అన్నారు. ఈ నెల 26న గురుద్వారలో 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' సంస్థ సీఈవో బల్బీర్ సింగ్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నట్టు చెప్పారు.



గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికెట్‌ను అందుకుంటున్న కియ ఇండియా సీఈవో గ్వాంగ్

జీ రామ్ జీ అమల్లోనూ రాజీ లేదు!

- పక్కా ప్రణాళికలతో సిద్ధమైన సర్కారు
- బడ్జెట్‌లో రూ.9 వేలకోట్ల ప్రతిపాదన!
- కొత్త స్కీమ్ సద్వినియోగానికి కార్యాచరణ



అమరావతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వినియోగంలో రాష్ట్రం దేశంలోనే ముందు వరుసగా ఉంది. ఈ పథకం స్థానంలో ఇటీవల తెచ్చిన గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవిక మిషన్ గ్రామీణ్(జీ రామ్ జీ) పథకం నుంచీ గరిష్ఠ ప్రయోజనం పొందేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. కొత్త పథకం కొంతమేర రాష్ట్రాలకు భారమైనా, సమర్థవంతంగా అమలుచేస్తే మంచి ఫలితాలే సాధించవచ్చునన్న ధీమా వ్యక్తమవుతోంది. ఏపీకి అనువుగా జీ రామ్ జీని వినియోగించుకునేందుకుప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. వచ్చే బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.9వేల కోట్లు ప్రతిపాదించాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల నుంచి ఈ మేరకు ప్రతిపాదనలు అందాయి. మన రాష్ట్రంలో ఈ నెల 5న నిర్వహించిన గ్రామ సభల్లో జీ రామ్ జీ గురించి అవగాహన కల్పిస్తూ తీర్మానాలు చేశారు. ఈ ఏడాది మార్చికి ఉపాధి హామీ పథకం గడువు పూర్తికానుంది. దాని స్థానంలో ఏప్రిల్ 1 నుంచి కొత్త పథకం అమల్లోకి రానుంది. పాత పథకంలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు రాత్రింబవళ్లు పని చేస్తున్నారు. జీరామ్‌జీ పథకంపై చట్టమైతే చేశారుగానీ, ఇంకా ఆపరేషన్ మార్గదర్శకాలు విడుదల చేయలేదు. కొత్త పథకం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలపై భారం పడే మాట నిజమే. అయితే కొత్త పథకంలో ఒక్కో కుటుంబానికి పని దినాలను వంద రోజులకు బదులుగా 125 రోజులు ఇవ్వడం వల్ల రాష్ట్రానికి అదనపు పనిదినాలు వస్తాయి. దీంతో గతంలో మాదిరిగానే కేంద్రం నుంచి వచ్చే నిధులు ఏ మాత్రం తగ్గకుండా సమీకరించుకునే అవకాశముందని భావిస్తున్నారు.

అమలుపైనే దృష్టి..

జీ రామ్ జీ పథకం పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉంది. కేంద్రం కొత్త పథకంలో తెచ్చిన సంస్కరణలను మన రాష్ట్రానికి అనుకూలంగా మలుచుకుని ముందుకెళ్లాలని, ఆ మేరకు అధికారులు సైతం సిబ్బందిని సిద్ధం చేయాలని ప్రభుత్వం సంకేతాలను ఇస్తోంది. ఒక్కో కుటుంబానికి 125 రోజుల పనిదినాలు కొంత మెరుగైన అంశమైనప్పటికీ...ఏటా 100 రోజుల పైబడి పనుల్లో పాల్గొనే కుటుంబాలు 4 లక్షలకు మించి ఉండదు. గత పదేళ్లుగా మన రాష్ట్రానికి సుమారు 20 కోట్ల పనిదినాలు ఏటా లేబర్ బడ్జెట్ కింద కేంద్రం మంజూరుచేస్తోంది. గత ఏడాది ఈ కేటాయింపుల్లో కోత విధించి 18 కోట్లకే పరిమితం చేసింది. అంటే గతం కంటే పనిదినాలు తగ్గించేసింది. ఈ నేపథ్యంలో ఒక్కో జాబ్‌కార్డుకు 125 పనిదినాలు కల్పించే అవకాశం ద్వారా మన రాష్ట్రంలో లేబర్ బడ్జెట్ కూడా పెరిగే అవకాశముంది. ఒక్కో జాబ్‌కార్డుకు వంద పనిదినాలు చొప్పున కల్పిస్తూ 65 లక్షల జాబ్‌కార్డులు, 91 లక్షల శ్రామికులు ప్రస్తుత ఉపాధి పథకంలో పనిచేస్తున్నారు. మన రాష్ట్రానికి ఏటా 20 కోట్ల పనిదినాలు మంజూరుచేస్తున్నారు. ఇప్పుడు ఒక్కో కుటుంబానికి 125 రోజులకు పెరగడం వల్ల మరో 5 కోట్ల పనిదినాలు అదనంగా మంజూరయ్యే అవకాశముంది. దీంతో రాష్ట్రానికి వచ్చే కేటాయింపులు కూడా పెరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం మరింతగా శ్రామికులకు పనులు కల్పించాలన్న సంకల్పంతో అదనపు పనిదినాలు పొందే అవకాశం కూడా ఉంది. గతంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఈ నిధులు భరించేది. అయితే, దొంగ మస్టర్లను అరికట్టడంలో రాష్ట్రాల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో, అందులో సంస్కరణలు తెచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. రెండూ ఖర్చు భరించేలా విధానంలో మార్పులు తెచ్చింది. కొత్త పథకంలో అనుకూల అంశం ఏమిటంటే, గతంలో ఉపాధి పథకం వల్ల వ్యవసాయ సీజన్‌లో శ్రామికులు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలున్నాయి. రైతులు ఎంత గగ్గోలు పెట్టినా...అప్పట్లో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ దానిపై స్పందించలేదు. కొత్త పథకంలో ఆ డిమాండ్‌కు పరిష్కారం దొరికింది. ఆయా రాష్ట్రాల్లో 60 రోజులపాటు ఉపాధి హాలీడేను ప్రకటించుకునే వెసులుబాటు రాష్ట్రాలకు కొత్త పథకంలో కల్పించారు. అంటే ఏడాదిలో పది నెలలు మాత్రమే ఇక ఉపాధి పనులు జరిగే అవకాశముంది.

మంచిగా దుస్తులు ధరించాలని చెప్పడం తప్పా?

- కట్టుకోవద్దంటే కదా తప్పు: వెంకయ్య
- హైదరాబాద్‌లో వేటూరి సాహితీ మహోత్సవం



హైదరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): 'మంచిగా దుస్తులు కట్టుకోమని చెబితే కూడా వివాదాస్పదం అవుతోంది. దుస్తులు కట్టుకోవద్దు అంటే తప్పు కానీ మంచిగా దుస్తులు ధరించమని చెప్పడం కూడా తప్పు అవుతుందా? పైగా వాటి మీద వాద, ప్రతివాదనలు, వివాదాలు' అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. వేటూరి 90వ జయంతి సందర్భంగా వేటూరి సాహిత్యాభిమానుల సమితి (అమెరికా) నిర్వహణలో బుధవారం హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళా వేదికలో కవికులాలంకార వేటూరి సాహితీ మహోత్సవం జరిగింది. ముఖ్య అతిథి వెంకయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేటూరి సినీ, సినీయేతర సాహిత్యం 6 సంపుటాలను ఆవిష్కరించారు. ఆయనను పాటల తోటమాలిగా అభివర్ణించారు. పాత రోజుల్లో హీరో, హీరోయిన్ తాకకుండానే శృంగార సన్నివేశాలు పండించేవారన్నారు. ఇప్పటి సినిమాల్లో హీరో హీరోయిన్‌ను తాకినా, గోకినా సన్నివేశం పండడం లేదన్నారు. జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగుకు ప్రాచీన హోదా సాధన ఉద్యమానికి ఆద్యుడు వేటూరి అన్నారు. భారత ప్రభుత్వ చీఫ్ సైంటిఫిక్ సలహాదారు జి.సతీశ్ రెడ్డి మాట్లాడుతూ.. క్షిపణుల పరిశోధనల సమయంలో తీవ్ర ఒత్తిడికి లోనైనప్పుడు వేటూరి పాటలు విని ఉపశమనం పొందిన సందర్భాలెన్నో ఉన్నాయని చెప్పారు. తోటకూర ప్రసాద్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేటూరి సుందర రామమ్మూర్తి భార్య సీతామహాలక్ష్మి, పెద్ద కుమారుడు రవి ప్రకాశ్, సినీ నటుడు తనికెళ్ల భరణి, గేయ రచయితలు జొన్నవిత్తుల, చంద్రబోస్, సంగీత దర్శకులు మాదవపెద్ది సురేశ్, మణిశర్మ, కోటి, రామజోగయ్య శాస్త్రి, దర్శకుడు వీఎన్ ఆదిత్య, గాయకులు ఎస్పీ శైలజ, ఎస్పీ చరణ్ పాల్గొన్నారు.

కల్తీ.. కెమికల్ నెయ్యి

(మొదటి పేజీ తరువాయి)

ఏడాదికి కుదింపు, రోజుకు ఆవు పాల కొవ్వు సామర్థ్యం 12 టన్నుల నుంచి 8టన్నులకు తగ్గింపు, వార్షిక టర్నోవర్ రూ.250కోట్ల నుంచి రూ.150కోట్లకు తగ్గించడంతో సహకార డెయిరీలకు టెండర్లు దక్కకుండా పోయాయి. ప్రైవేటు డెయిరీలకు లాభం చేకూరింది. పాలు సేకరించని, కనీస అనుభవం లేని డెయిరీలు టెండర్లలో పాల్గొనడంతో నెయ్యి నాణ్యతపై ప్రతికూల ప్రభావం పడింది. ఫిబ్రవరి 2020లో ఇచ్చిన ఈ సడలింపులపై 2023లో బోర్డు సమీక్షించి చిన్న డెయిరీల నెయ్యివల్లే లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులు పెరిగాయని గుర్తించింది. కల్తీలేని నెయ్యి కోసం నిబంధనలను కఠినతరం చేయడంతో పరిస్థితి మెరుగుపడింది.

కుట్ర జరిగిందిలా..

భోలే బాబా సంస్థ డైరెక్టర్లు పోమిల్ జైన్(ఏ3), విపిన్ జైన్ (ఏ4)తో పాటు సారిక జైన్(ఏ 21), పూనమ్ జైన్(ఏ 22) 2019 నుంచి 2024 మధ్యలో టీటీడీకి నెయ్యి సరఫరాలో క్రిమినల్ కుట్రకు పాల్పడినట్లు సిట్ గుర్తించినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కొందరు టీటీడీ అధికారులు, ఇతర డెయిరీ సంస్థలతో కలిసి కల్తీనెయ్యి తయారీకి తెగబడింది. తమ సంస్థలైన హర్ష ట్రేడింగ్ కంపెనీ, హర్ష ఫ్రెష్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా కోల్‌కతాకు చెందిన బుజే బుజే రిఫైనరీస్ లిమిటెడ్, మరికొన్ని సంస్థల నుంచి పామోలిన్ కొనుగోలు చేశారు. ఈ సంస్థ కీలక ఉద్యోగులు హరి మోహన్ రాణా (ఏ 12), సంజయ్ చౌహాన్ (ఏ 13), ఆశిశ్ రోహిల్లాతో (ఏ 140) కలిసి పాలు లేదా వెన్న సేకరించకుండానే భోలే బాబా డెయిరీలో రిఫైన్డ్ పామ్ ఆయిల్, కర్నెల్ ఆయిల్, రిఫైన్డ్ ఓలీన్‌ను అతి తక్కువ పరిమాణంలో ఉన్న నెయ్యితో కలిపి, ల్యాబ్ పరీక్షలను మేనేజ్ చేసేందుకు, సువాసన నిలిపేందుకు బీటా క్యారోటిన్, అసిటిక్ యాసిడ్ ఎస్టర్, ఫుడ్ గ్రేడ్ లాక్టిక్ యాసిడ్, మోనో గ్లిసరైడ్, నెయ్యి ఫ్లేవర్ వంటి రసాయనాలు ఉపయోగించి నెయ్యి లాంటిది తయారు చేసినట్లు సిట్ పేర్కొంది. ఇదే విషయాన్ని 2025 మార్చిలో గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్, ఆనంద్ నివేదిక నెయ్యి ప్రమాణం చాలా తక్కువగా ఉన్నట్లు ధ్రువీకరించినట్లు తెలిపింది. భోలే బాబా డెయిరీలో 68లక్షల కిలోలకు పైగా కెమికల్ నెయ్యి తయారు చేసినట్లు సిట్ ఆధారాలతో తేల్చింది. టీటీడీ నెయ్యి టెండర్లకు అర్హులు కాకపోయినా తప్పుడు పత్రాలు సమర్పించి పాల్గొంది. పామిల్ జైన్, విపిన్ జైన్, అపూర్వ చావ్డా, శ్రీ వైష్ణవీ డెయిరీ, రాజేశ్ మన్సుఖ్ లాల్ చావ్డా, మచింద శాంతారామ్, రాజు రాజశేఖరన్‌లు గ్రూపుగా ఏర్పడి కుట్ర చేసినట్లు పేర్కొంది. భోలే బాబా డైరెక్టర్లయిన నలుగురు జైన్‌లు, అజయ్ కుమార్ సుగంధ్, మహేశ్ రోహిరా రసాయనాలతో రిఫైన్డ్ పామాయిల్, కర్నెల్ ఆయిల్, పామ్‌ఓలిన్‌ను కొబ్బరినూనెగా చూపుతూ తప్పుడు ఇన్వాయిస్‌లు చూపారని వెల్లడించింది. రవీంద్ర శర్మ(ఏ23) కూడా నెయ్యి నివేదికల్ని తారుమారు చేసి ల్యాబ్ రిపోర్టులు సృష్టించినట్లు తెలిపింది. టీటీడీ ప్లాంట్ తనిఖీ సభ్యులు, ఉద్యోగులు తమ అధికారాలను దుర్వినియోగం చేసి సరైన తనిఖీలు చేయకుండా తప్పుడు నివేదికలు సమర్పించారు. ఫలితంగా నాణ్యతలేని నెయ్యి టీటీడీకి 60లక్షల కిలోలు సరఫరా అయింది. సుమారు రూ.235 కోట్ల మేర టీటీడీకి నష్టం కలిగించారని, అంతకు మించి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బ తీశారని చార్జిషీట్‌లో సిట్ పేర్కొన్నట్లు తెలిసింది.

కల్తీ నెయ్యిని నిర్ధారించిన 500 ఆధారాలు

టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సహాయకుడు కుందూరు చిన్నప్పన్న(ఏ24)తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కిలోకు రూ.25 చొప్పున లంచం డిమాండ్ చేయగా సరఫరా దారులు నిరాకరించారు. దీంతో టెండర్ అర్హతను ప్రభావితం చేసినట్లు సిట్ తేల్చింది. అనంతరం మరో సంస్థకు అధిక రేటుకు టెండర్ ఇప్పించి 50లక్షలు తీసుకున్నట్లు అభియోగ పత్రంలో తెలిపినట్టు తెలిసింది. ఏ-16అజయ్ కుమార్ సుగంధ్ నుంచి ఏ36 జయరాజ్ వరకూ నిందితులందరూ సాక్ష్యాల్ని నాశనం చేయడం, నెయ్యి కల్తీ చేయడం, హానికరమైన ఆహార పదార్థాల విక్రయం, నమ్మక ద్రోహం, టీటీడీకి నష్టం కలిగేలా తెలిసి మోసం చేయడం, నకిలీ పత్రాల తయారీ, భక్తుల మనోభావాలు దెబ్బతీయడం, ప్రభుత్వ ఉద్యోగుల్ని ప్రభావితం చేయడం, వాణిజ్యసంస్థల ద్వారా అనుచిత లబ్ధి పొందడం, అధికార దుర్వినియోగం వంటి నేరాలకు పాల్పడినట్లు చార్జిషీట్లో సిట్ వివరించినట్టు సమాచారం. 2024లో నాలుగు ట్యాంకర్ల నెయ్యిలో నాణ్యత ప్రమాణాల లోపాలు వెలుగులోకి రావడంతో నమూనాలను ఎన్‌డీడీబీ ప్రయోగశాలకు పంపారు. అందులో జంతువుల కొవ్వు అవశేషాలు ఉన్నట్లు రిపోర్టు వచ్చింది. దీంతో క్రిమినల్ కేసు నమోదు చేసిన సిట్ ... ఏపీ, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఢిల్లీలోని పలు డెయిరీ సంస్థలు సమన్వయంతో కుట్ర పన్నినట్లు తేల్చింది. ఖాళీ రసీదులు ముందే వాట్సాప్‌లో పంపడం, ఒకే వాహన నెంబర్లు పదేపదే సరఫరాలో చూపడం సరుకు తరలించకుండానే రికార్డులు సృష్టించినట్లు తేలింది. చార్జిషీట్‌లో పేర్కొన్న ల్యాబ్‌నివేదిక ప్రకారం బ్యూటరిక్ ఆమ్లం పరిమాణం తక్కువగా ఉండటం వల్ల నిజమైన పాల కొవ్వు బాగా తక్కువగా ఉందని, బీటా సిటోస్టెరాల్ అనే వృక్ష స్టెరాల్ ఉనికితో ఈ నమూనాల్లో పామాయిల్, పామ్ స్టెరిన్, పామ్ కర్నెల్ మిశ్రమం ఉన్నట్లు నిపుణుల నిర్ధారణకు వచ్చినట్లు తెలిపింది. డబ్బు మొత్తం హవాలా మార్గంలో బ్యాంకుల బయట ఢిల్లీ, గ్వాలియర్, బీకనేర్, ఘాజియాబాద్, సహరాన్‌పూర్, విజయవాడ, హైదరాబాద్‌లో మధ్యవర్తుల ద్వారా చెల్లింపులు జరిగినట్లు ఆధారాలు సమర్పించింది. ప్రతి ట్యాంకర్ నెయ్యికి కమీషన్ తీసుకున్నారని, ప్రొక్యూర్మెంట్, ఇంజనీరింగ్, టెక్నికల్ విభాగాల సిబ్బంది ఇందులో ఉన్నారని వివరించింది. నిందితుల మధ్య సంభాషణలు, చాటింగ్ తదితర ఆధారాలు తొలగించినా డిజిటల్ ఫోరెన్సిక్ వెలికి తీసిందంటూ సుమారు 500 ఆధారాలు సమర్పించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.